వైసీపీ రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయి. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు, దాడులకు తెగబడుతున్నాయి. పోలీసులు వారికి వంతపాడుతున్నారు. ప్రతిపక్షాల వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. తాజాగా ఒంగోలులో వైసీపీ గూండాలు వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనలో ఒంగోలు పోలీసుల వ్యవహార శైలిపై టీడీపీ తీవ్ర ఆరోపణలు, విమర్శలు చేస్తోంది. ఇక్కడి పోలీసు అధికారులపై టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ గతంలోనే హైకోర్టులో పిటిషన్ వేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అనంతరం ఎస్పీని ఎన్నికల సంఘం బదిలీ చేసి కొత్త అధికారిని నియమించినప్పటికీ ఒంగోలులో బాలినేని అనుచరులు బరితెగించి దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో ఏమేరకు ప్రశాంతంగా జరుగుతాయన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఎన్నికల సమయంలో పోలీసుల తీరు ఎలా ఉంటుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రౌడీ రాజ్యం


ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు



ఒంగోలు సమతానగర్‌లో టీడీపీ శ్రేణులపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు (ఫైల్)

- వైసీపీ మూకల దాడులతో అనుమానాలు
- తాజాగా ఒంగోలు ఘటనతో మరింత ఆందోళన
- టీడీపీ వారిపై దాడిచేసి ఆపై అక్రమ కేసులు
- ఐదేళ్లుగా ఇదేవిధంగా దౌర్జన్యకాండ
- ఎస్పీ మారినా వెనక్కితగ్గని అరాచకవాదులు
- ఒంగోలులో పోలీసు అధికారులపై గతంలోనే దామచర్ల పిటిషన్
- తాజాగా సింగరాయకొండలో సీఈవోకు ఫిర్యాదు
- యంత్రాంగం నుంచి భరోసా కోరుతున్న ప్రజానీకం
- ఆ దిశగా ఉన్నతాధికారుల చర్యలు ఉంటేనే సజావుగా ప్రక్రియ

ఇలాగైతే ప్రశాంతంగా ఎన్నికలు జరిగేనా?



బెదిరింపులు, దాడులు, హత్య

ప్రస్తుత ఎన్నికల ప్రక్రియ ప్రారంభంలోనే గిద్దలూరు నియోజకవర్గంలో మునయ్య అనే టీడీపీ కార్యకర్త హత్యోదంతం మరింత సంచలనం కలిగించింది. గతనెలలో మేదరమెట్ల వద్ద జరిగిన సీఎం సిద్ధం సభకు రాకపోగా టీడీపీకి అనుకూలంగా జనాన్ని కూడగడుతున్నాడన్న అక్కసుతో అక్కడ మునయ్యను వైసీపీ నేతలు మట్టుపెట్టారు. ఈకేసు విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఇదేవిషయంలో సీరియస్ అయిన ఎన్నికల సంఘం ఏకంగా అప్పటి ఎస్పీ పరమేశ్వరరెడ్డిని తన కార్యాలయానికి పిలిపించి వివరణ కోరింది. తదనంతరం ఆయన్ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో గరుడ సుమిత్ సునీల్ వచ్చారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, ఆరోపణలతో ఏకంగా ఎస్పీ బదిలీ అయినా జిల్లాలో ఇటు వైసీపీ శ్రేణులు, అటు పోలీసుల తీరు ఏమాత్రం మారలేదు. అందుకు గత బుధవారం రాత్రి వైసీపీ కార్యకర్తలు, ప్రత్యేకించి ఒంగోలులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరులు బరితెగించి సామాన్య కుటుంబంపై, టీడీపీ నేతలపైన చేసిన దాడే నిదర్శనం.

ప్రజల్లో ఆందోళన

సమతానగర్, రిమ్స్ వద్ద చేసిన దాడులతో ఆగక ఏకంగా టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు కూడా పెట్టడాన్ని అందరూ ఖండిస్తున్నారు. నగరంలోని పోలీసు అధికారుల తీరుపై ప్రతిపక్ష టీడీపీ శ్రేణులేకాక సామాన్య ప్రజల నుంచి కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సదరు పోలీసు అధికారులను మార్చాలని గతంలోనే టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతోపాటు కోర్టులో పిటిషన్ కూడా వేశారు. ఇదేవిషయాన్ని గురువారం జిల్లాకు వచ్చిన సీఈవో మీనా దృష్టికి కూడా టీడీపీ తీసుకెళ్లింది. తాజాగా ఒంగోలులో జరిగిన ఘటన, వైసీపీ నేతల తీరు, పోలీసుల వ్యవహారశైలి జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఎస్పీని ఎన్నికల సంఘం మార్పు చేసి కొత్త వారి నియామకం జరిగాక కూడా ఇలాంటి ఘటనలు జరగడంతో ప్రజల్లో ఎన్నికలు ఎలా జరుగుతాయోనన్న ఆందోళన, అనుమానం వ్యక్తమవుతోంది.

ఒంగోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకం ఎన్నికల వేళ కూడా కొనసాగుతోంది. ఆపార్టీ శ్రేణులమంటూ కిరాయి రౌడీమూకలు రోడ్డునపడ్డాయి. అభ్యర్థులు, వారి కుటుంబసభ్యుల ప్రచారంలో అంతా తామై వ్యవహరిస్తున్నాయి. పూర్తిగా మద్యం మత్తులో ఉండి ఇదేమని అడిగిన వారిపై దౌర్జన్యానికి పాల్పడుతున్నాయి. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో దౌర్జన్యకర పాలన సాగించినట్లే జిల్లాలోనూ ఆపార్టీ తాజాగా వ్యవహ రిస్తోంది. ఇందుకు ఒంగోలు ఘటనే నిదర్శనం. వివరాల్లోకి వెళితే.. 2019లో సాధారణ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగానే జరిగాయి. అప్పుడు మొత్తం 12అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికలను ఇక్కడి అధికారులు పర్యవేక్షించారు. దాదాపు మూడు వేల పోలింగ్ కేంద్రాలు అప్పట్లో ఉండగా ఒక్కచోట మాత్రమే రీపోలింగ్ జరిగింది. మిగతా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. విభజన అనంతరం జిల్లా పరిధిలో ప్రస్తుతం ఒంగోలు పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలు మాత్రమే ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో జరిగిన ఘటనలు, జరుగుతున్న పరిణామాలతో ఈసారి ఎన్నికలు ఏమేరకు ప్రశాంతంగా సాగుతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మచ్చుకు కొన్ని పరిశీలిస్తే.. వైపాలెంలో స్థిరాస్తి వ్యాపారి హత్య, ఒంగోలులో సుబ్బారావు గుప్తాపై దాడి, దోర్నాల మండలంలో సర్పంచ్ భర్త హత్య, తర్లుపాడులో అక్రమ ఇసుక బాగోతాన్ని ప్రశ్నించిన యువకుడిపై దాడి, ఎస్ఎన్‌పాడు తహసీల్దార్‌పై ఆఫీసులోనే వైసీపీ నేత దాడి, సీఎస్‌పురంలో ఉపాధి పథకం అవినీతిని ప్రశ్నించిన పాస్టర్‌ను అంతమొందించడం, బేస్తవారపేట మండలంలో పారిశుధ్య పరిస్థితిని ప్రశ్నించిన జనసేన కార్యకర్తకు వేధింపులు.. ఆపై అతని ఆత్మహత్య, కొండపి సెగ్మెంట్‌లో అనేక మార్లు ఏకంగా ఎమ్మెల్యే స్వామిపై వైసీపీ నేతలు దౌర్జన్యం, టంగుటూరులో అంగన్‌వాడీ కార్యకర్త హత్య ఇలా పలుచోట్ల పెద్దఎత్తున అక్రమాలు, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయి. ఆయా ఘటనల్లో పోలీసులు అధికారపార్టీకి కొమ్ముకాశారన్న విమర్శలు వచ్చాయి.

వైసీపీ పాలనలో పెరిగిన హింస

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో మూడొంతులకుపైనే సమస్యాత్మకంగా ఏదో ఒకస్థాయిలో ఇబ్బంది కలిగించేవిగా అధికారులు గుర్తించారు. దాదాపు 1,600లకు పైగా అలాంటివి ఉండగా సమస్య అధికంగా ఉండే వాటిలో సగం వరకు ఉన్నట్లు సమాచారం. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకునే ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాకు అదనపు బలగాలు కూడా వచ్చాయి. దాదాపు నెలరోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కవాతు చేస్తున్నాయి. అయితే ఇవన్నీ జరుగుతున్నా, ఎన్నికల సంఘం సీరియస్‌గా ఉండి ఏకంగా ఎస్పీనే బదిలీ చేసినా స్థానికంగా ఉన్న పోలీసుల పక్షపాత ధోరణితో వైసీపీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. ప్రజానీకం స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకునే వాతావరణం కావాలని యంత్రాంగాన్ని కోరుతోంది. ఆ మేరకు ఎన్నికల సంఘం తరఫున జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్.. అలాగే ఎస్పీ, ఇతర అధికారులు ప్రజలకు భరోసా ఇచ్చే చర్యలను ఇకనైనా పటిష్ఠం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాపారుల మాయాజాలం

- రైతుల ఆందోళన
- మూడు కేంద్రాల్లో ఆగి సాగిన వేలం
- తగ్గిన లోగ్రేడ్ ధరలు
- కిలో రూ.249 పలికిన గరిష్ఠ ధర



టంగుటూరులో పరిస్థితిని సమీక్షిస్తున్న బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు

ఒంగోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సజావుగా సాగుతున్న పొగాకు మార్కెట్లో శనివారం కాస్తంత గందరగోళం నెలకొంది. వ్యాపారుల మాయాజాలంపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో మూడు కేంద్రాల్లో వేలం ఆగిసాగగా, ఇతరచోట్ల మార్కెట్ తీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మేలురకం గ్రేడ్ ధరలను నెలన్నరగా నిలకడగా ఉంచిన వ్యాపారులు రెండు రోజుల నుంచి క్రమంగా పెంచుతూ వచ్చారు. పలు కేంద్రాల్లో గరిష్ఠ ధర కిలో రూ.246 నుంచి రూ.248 పలికింది. కొండపిలో అత్యధికంగా కిలో రూ.249 లభించింది. అదేసమయంలో రైతులు అధికంగా వేలంకు తెచ్చిన లోగ్రేడ్ ధరలను తగ్గించి వేశారు. ఆరకం శనివారం కిలో రూ.225 దిగువకు పడిపోయింది. కొందరు వ్యాపారులు ఆ తరహా బేళ్లవైపు మొగ్గుచూపలేదు. దీంతో లోగ్రేడ్ ధర మరింత తగ్గుతుందని భావించిన రైతులు వ్యాపారుల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టంగుటూరు, కొండపిలలో అయితే ఏకంగా వేలం మధ్యలో నిరసన తెలిపి నిలిపివేశారు. విషయం తెలిసిన ఆర్ఎం లక్ష్మణరావు టంగుటూరుకు వెళ్లి రైతులతో చర్చించి తిరిగి వేలాన్ని ప్రారంభించగా అనంతరం కొండపిలోనూ సాగింది. అదేసమయంలో ఒంగోలు-2లోనూ రైతు ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసన తెలపడంతో వేలంకేంద్ర అధికారి తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చి బయ్యర్లు, రైతు ప్రతినిధులతో చర్చలు జరపడంతో తిరిగి వేలం కొనసాగింది. మొత్తం మీద లోగ్రేడ్ ధరలు కిలో రూ.225కు పరిమితమయ్యాయి. కాగా లోగ్రేడ్ కొనుగోళ్లను తగ్గించి బయ్యర్లు శనివారం నాటి మార్కెట్‌లో మేలురకం బేళ్ల కోసం పోటీపడ్డారు.

నేటితో ముగియనున్న ఓటుహక్కు దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 13 : సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ఓటుహక్కు కోసం ఫాం-6 దరఖాస్తు చేసుకునేందుకు ఆదివారంతో గడువు ముగియనుంది. జిల్లాలో ఓట్ల నమోదు, చేర్పులు, మార్పుల ప్రక్రియ గత ఆరు నెలల నుంచి జరుగుతోంది. అయితే రాజకీయ కారణాలతో కొందరి ఓట్లు గల్లంతు కాగా, మరికొందరివి ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రం జాబితాల్లో ప్రచురించారు. అటువంటి వాటిని సరిచేయడంతోపాటు కొత్తగా ఓటుహక్కును పొందేందుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. ఈనెల 18న పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్న నేపథ్యంలో కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆదివారం వరకు గడువు ఇచ్చింది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 8వేలకుపైగా దరఖాస్తులు రాగా వాటిలో మూడువేలు పరిష్కరించారు. మరో 5,300 పెండింగ్‌లో ఉన్నాయి. ఆన్‌లైన్‌తోపాటు మాన్యువల్‌గా కూడా బీఎల్వోల వద్ద దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆదివారంతో గడువు ముగియనుండటంతో సోమవారం నుంచి దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉంటే ఓటుహక్కు కల్పించనున్నారు. ఓటు హక్కు పొందిన వారు వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో వినియోగించుకోవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎంలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

నియోజకవర్గాలకు ఈవీఎంల తరలింపు

- ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 13: ర్యాండమైజేషన్ ప్రకారం ఈవీఎంలను జిల్లాలోని నియోజకవర్గాలకు పంపుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం నియోజకవర్గాలకు ఈవీఎంల తరలింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం రాజకీయ నేతల సమక్షంలో నిర్వహించామన్నారు. అందుకుఅనుగుణంగా శనివారం పార్లమెంట్ నియోజకవర్గానివి, ఆదివారం జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీలకు సంబంధించిన ఈవీఎంలను ర్యాండమైజేషన్ ప్రకారం తరలిస్తామన్నారు. ఈ మొత్తం ప్రక్రియను సీసీ టీవీల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వివరాలను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ఈఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.

కొట్టారు.. సస్పెండ్ చేశారు!

- సమతానగర్ ఘటనలో బాధితులపైనే చర్యలు
- కుటుంబ పెద్ద అయిన ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 13 : నగరంలోని సమతానగర్‌లో రెండు రోజుల క్రితం వైసీపీ మూకలు సామాన్యులపై చేసిన దాడి ఘటనలో ఆ కుటుంబ పెద్ద అయిన ఏఆర్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ ఎస్పీ జి.సుమిత్ సునీల్ ఉత్తర్వులు జారీచేశారు. వలంటీర్ పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కానిస్టేబుల్ ప్రమేయం ఉన్నట్లు అధికారులు నిర్ధారించడంతో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అయితే దాడి ఘటనలో బాధిత కుటుంబంపైనే వరుసగా కేసులు నమోదు చేయడంతోపాటు ఇప్పుడు సస్పెన్షన్ చర్యలు తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటిపై దాడి చేయడమే కాకుండా వారిపైనే కేసులు పెట్టడం, అదీ చాలదన్నట్లు కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవడం దారుణమన్న చర్చ నగరంలో నడుస్తోంది.

ప్రచారంలో టీడీపీ దూకుడు

- ఇంటింటికీ వెళ్తున్న నేతలు
- విభిన్నవర్గాలతో ఆత్మీయ సమావేశాలు
- కేడర్‌తో మమేకం, ముఖ్యులతో సమీక్షలు
- పార్టీలో చేరికలపై ప్రత్యేక దృష్టి
- అందరూ కార్యరంగంలోకి..

మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం

ఒంగోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గాల బరిలో నిలుస్తున్న వారంతా గెలుపే లక్ష్యంగా, అందుకు అవసరమైన ఏ ఒక్క దానిని నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగుతున్నారు. పోలింగ్‌కు మరో నెలరోజులు ఉండగా ఇప్పటికే ఇంచుమించు తమ నియోజకవర్గాల్లోని సగంమంది ఓటర్లను ప్రత్యక్షంగా,పరోక్షంగా కలిశారు. పార్టీ మేనిఫెస్టోలోని అంశాలను, వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. నిత్యం సాయంత్రం వేళ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం విధిగా చేపడుతున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల కుటుంబసభ్యులు అంతా ఇదే పనిలో ఉంటున్నారు. మరోవైపు వివిధ సామాజికవర్గాల వారితో, అలాగే తమకు మద్దతు ఇస్తున్న కూటమిలోని భాగస్వామ్య పార్టీల శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు టీడీపీ కార్యకర్తలతోనూ భేటీ అయి క్షేత్రస్థాయి కేడర్‌ను కదిలిస్తున్నారు. అదేసమయంలో గ్రామ, బూత్ స్థాయిలోని నేతలతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ వ్యక్తిగత బాధ్యతలు అప్పగిస్తూ మెరుగైన ఫలితాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక అన్ని నియోజకవర్గాల్లోనూ పెద్దసంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలోకి వివిధ స్థాయిల్లోని నాయకులు, కార్యకర్తలు వచ్చేందుకు ఆసక్తి చూపుతుండగా వాటిపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. అలాంటి వారి రాక వల్ల ఇప్పటివరకు పార్టీలో ఉన్నవారి నుంచి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకొని సమన్వయం చేస్తున్నారు. దీంతో టీడీపీలో చేరికలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ప్రతిరోజూ అన్ని నియోజకవర్గాల్లో భారీగానే వైసీపీ నుంచి వచ్చి చేరుతున్నారు. ఇలా అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులే కాకా చాలాచోట్ల ఎక్కడికక్కడ స్థానిక నేతలు కూడా ఎన్నికల ప్రచారంలో పాలు పంచుకుంటున్నారు. నామినేషన్ల తర్వాత మరింత ఉధృతంగా ప్రచార కార్యక్రమం కొనసాగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాగా జిల్లాలో శనివారం కార్యక్రమాలను పరిశీలిస్తే ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ నగరంలోని 35వ డివిజన్ పార్టీ కార్యాలయ ప్రారంభం, డివిజన్ అధ్యక్షులతో సమావేశంతో పాటు సాయంత్రం ఒంగోలు రూరల్ మండలంలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొండపి అభ్యర్థి డాక్టర్ స్వామి టంగుటూరులో ఇంటింటి ప్రచారం చేశారు. ముందుగా పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుతో భేటీ అయ్యారు. అనంతరం ఆయన టంగుటూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయకుమార్ చీమకుర్తి మండలం పిడతలపూడిలో ఉదయం క్యాంపెయిన్ నిర్వహించగా, అక్కడ 35 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రాత్రికి చీమకుర్తి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. కనిగిరి అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో పెద్దఎత్తున వైసీపీ శ్రేణులు టీడీపీలోకి వస్తుండగా శనివారం కూడా నాలుగు మండలాలకు చెందిన 175 కుటుంబాల వారు చేరారు. పామూరు మండలంలోని తిరగలదిన్నెలో జరిగిన జయహో బీసీ సభలో ఉగ్ర పాల్గొన్నారు. అక్కడ మాజీ సర్పంచ్ నాగేశ్వరరావుతోపాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి దర్శి పట్టణంలో విస్తృతంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కూటమిలోని పార్టీలకు చెందిన ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి, మాగుంట రాఘవరెడ్డిల సమక్షంలో 250మంది మైనార్టీలు పార్టీలో చేరారు. సాయంత్రం కొమరోలు మండలంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్ బాబు పెద్దారవీడు మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పొదిలి మండలంలో మాగుంట రాఘవరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఏలూరులో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు.



కనిగిరి మండలం ఎన్.గొల్లపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులతో కూటమి అభ్యర్థి ఉగ్ర




ముండ్లమూరు మండలం ఈదరలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ కూటమి దర్శి అభ్యర్థి లక్ష్మి



ఉలిచిలో పార్టీలో చేరికల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల



టంగుటూరులోని అరుంధతివాడలో టీడీపీ కూటమి కొండపి అభ్యర్థి స్వామికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



కంభంలో అశోక్‌రెడ్డి, రాఘవరెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన కార్యకర్తలు

నాలుగు కేజీబీవీల్లో జీరో ఉత్తీర్ణత

- ఇంటర్ ఫలితాల్లో వెనుకంజ
- హైస్కూలు ప్లస్ ధమాల్

వివరాలు లోపలి పేజీల్లో..

శాంతి భద్రతలకు

భంగం కలిగిస్తే కఠిన చర్యలు

ఎస్సీ, ఎస్టీ కేసులో ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

వైసీపీకి చెందిన 36 మంది, టీడీపీకి చెందిన 15మంది

ఆర్డీవో వద్ద బైండోవర్ • ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 13: శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ జి.సుమిత్‌సునీల్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒంగోలు నగరం సమతానగర్‌లో జరిగిన ఘర్షణ కేసులో వైసీపీ వారిపై టీడీపీ ఫిర్యాదు మేరకు 35 మంది పైన కేసు నమోదు చేశామన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసిన దిశా డీఎస్పీ 17మందిని గుర్తించి వారికి 41 సీఆర్పీస్ కింద నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. అదేవిధంగా టీడీపీ వారిపై వైసీపీ వారు ఇచ్చిన ఫిర్యాదులో 31మంది పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వారిలో ఇరువురుని గుర్తించి నోటీసులు ఇచ్చామన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేశామని ఎస్పీ తెలిపారు.



ఆర్డీవో వద్ద ఉన్న నిందితులు

రిమ్స్ ఘటనపై.. ఒంగోలు రిమ్స్‌లో టీడీపీ, వైసీపీ వారు మధ్య జరిగిన ఘటనపై డ్యూటీ డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 100 మందిని విచారణాధికారి దుర్గాప్రసాద్ గుర్తించారని ఎస్పీ తెలిపారు. వీరిలో ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీకి చెందిన 21మం దికి, వైసీపీకి చెందిన 23 మందికి 41 సీఆర్పీసీ ప్రకారం నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వైసీపీకి చెందిన 36 మంది, టీడీపీకి చెందిన 15మందిని ఒంగోలు ఆర్డీవో వద్ద బైండోవర్ చేశామన్నారు. ఇంకా ఈ కేసులో దుందుడుకు చర్యలకు పాల్పడే వారిని గుర్తించి బైండోవర్ చేస్తామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

మాగుంటను కలిసిన వైసీపీ నేత



మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసిన ప్రభాకర్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 13: ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం రాత్రి స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఈనెల 17వతేదీన స్థానిక కాపు కళ్యాణ మండపంలో మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్‌ల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు జడా బాలనాగేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 13: జిల్లాలో ఇంటర్ పరీక్షా ఫలితాల్లో బాలురకంటే బాలికలే పైచెయ్యి సాధించారు. బాలుర కంటే బాలికలు 10శాతంకు పైగా అధిక ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలురు 54శాతం మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 10శాతం అదనంగా 64శాతం మంది పాసయ్యారు. బాలురు 8,789 మందికి 4,722 మంది, బాలికలు 9,560 మందికి 6,146 మంది పాసయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో బాలురు 45శాతం మంది పాసు కాగా, బాలికలు 16శాతం అదనంగా 61శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 924మందికి 414మంది, బాలికలు 1,005 మందికి 618 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో బాలురు 68శాతం మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 8శాతం అదనంగా 76శాతం మంది పాసయ్యారు. బాలురు 7,102 మందికి 4,800మంది, బాలికలు 8,136 మందికి 6,193 మంది పాసయ్యారు. ఒకేషనల్‌లో బాలురు 63శాతం మంది పాసుకాగా బాలికలు 11శాతం అదనంగా 74శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 956 మందికి 604 మంది, బాలికలు 045 మందికి 769 మంది ఉత్తర్ణులయ్యారు.

కిమ్స్‌లో అరుదైన ఎండోస్కోపిక్ చికిత్స

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 13: ఒంగోలులోని కిమ్స్ హాస్పటల్‌లో ఆచలాసియా కార్డియాకు అరుదైన ఎండోస్కోపిక్ చికిత్స విజయవంతంగా నిర్వహించారు. హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీహరిరెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్‌లు శనివారం జరిగిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. యర్రగొండపాలెంకు చెందిన 24 ఏళ్ల వయస్సు కలిగిన ఒక మహిళ అనారోగ్య సమస్యతో కిమ్స్ హాస్పటల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ అశోక్‌కుమార్‌ను కలిశారు. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆచలాసియా కార్డియాతో బాధపడుతున్న గుర్తించారు. ఈ వ్యాధి వల్ల ఆహారం, ద్రవపదార్థాలు వెళ్లడం కష్టతరం ఉంటుంది. మొదటిసారిగా కిమ్స్ హాస్పటల్‌లో ఎండోస్కోపి ప్రక్రియ అయిన పీవోఈఎం చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇటువంటి చికిత్సలను మహానగరాలలో మాత్రమే చేస్తారని, అధిక ఖర్చుతో కూడుకున్న వైద్య చికితను అందరికి అందుబాటులోకి తేవడంతో పాటు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిన హాస్పటల్ డైరెక్టర్ బొల్లినేని భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడులను హాస్పటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె. అంకిరెడ్డి, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ అమర్‌నాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి : జేసీ

చీమకుర్తి, ఏప్రిల్ 13 : ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జేసీ, నియోజకవర్గ ఆర్వో గోపాలకృష్ణ సూచించారు. నియోజకవర్గంలో పోలింగ్ అధికారులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని చీమకుర్తి ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో రీపోలింగ్‌కు తావివ్వకుండా ఎన్నికలను నిర్వహించాలని కోరారు. ఓపీవోలకు సోమవారం ఆయా మండలాల్లో శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు రామారావు, బెజవాడ రఘుబాబు, మండవ ప్రభాకర్, కరిచేటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 13: త్వరలో జరిగే ఎన్నికల్లో కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ అధికారులు పిలుపునిచ్చారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని పలు షోరూములలో కార్మికులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు బి.రవి, వైఎస్.జ్యోతి, పవన్‌కుమార్, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యం

కూటమి గెలుపు కోసం కృషి చేయాలి • ఒంగోలు అభ్యర్థి దామచర్ల పిలుపు • టీడీపీ, జనసేన డివిజన్ అధ్యక్షులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్



టీడీపీలో చేరిన ఉలిచివాసులతో దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 13 : తెలుగుదేశం పార్టీ గెలుపుతోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యపడుతుందని, అందుకోసం టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఒక్కటయ్యాయని, వైసీపీ ఓటమి కోసం అందరూ సమష్టిగా కష్టపడి పని చేయాలని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయలో తెలుగుదేశం, జనసేన డివిజన్ అధ్యక్షులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనతో ప్రజలు సంతోషంగా లేరని, సైకో పాలకులను శాశ్వతంగా సాగనంపేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా శ్రేణులు అందరూ సమష్టిగా ముందుకెళ్లాలని సూచించారు. టీడీపీ అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. డివిజన్‌లలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రజలు కోరుకున్న పాలన అందించడమే కూటమి లక్ష్యమన్నారు. అందుకోసం టీడీపీ., జనసేన శ్రేణులు చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. కూటమి తరుపున ఒంగోలు అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు కూటమి శ్రేణులు అండగా ఉండి అత్యధిక మెజారిటీ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు అందరం అన్నదమ్ములుగా కలిసి పనిచేయాలన్నారు. జనసేన, టీడీపీ శ్రేణులు త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీ ఓటమి కోసం ఉమ్మడిగా ముందుకెళ్లాలని కోరారు. పోలింగ్‌కు నెలరోజులే ఉందని, బూత్ కన్వీనర్లను సమన్వయం చేసుకుంటూ దామచర్ల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, నగరంలోని యాభై డివిజన్ల నాయకులు పాల్గొన్నారు. అంతకముందు స్థానిక 35వ డివిజన్‌లోని టీడీపీ డివిజన్ కార్యాలయాన్ని దామచర్ల ప్రారంభించారు.

దామచర్ల ప్రచారం

త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం శ్రేణులు కష్టపడి పనిచేసి, ఒంగోలు రూరల్‌లో మంచి మెజారిటీ తీసుకురావాలని తెలుగుదేశం కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని గుండాయపాలెం, ఉలిచి గ్రామాలల్లో జనం కోసం జనార్దన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్ళి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం హయాంలోనే సాధ్యపడిందన్నారు. సంక్షేమ పాలన కోసం టీడీపీ కూటమి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు అండగా ఉండి ఎమ్మెల్యేగా తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైసీపీ హయాంలో రైతులకు కనీస సబ్సిడీలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని, కౌలు రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చూపిందని విమర్శించారు. చంద్రబాబుతోనే గ్రామాలలో సంతోషాలు కనిపిస్తాయన్నారు. తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని దామచర్ల కోరారు. కాగా ఆయా గ్రామాల ప్రజలు దామచర్లకు హారతులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, యోగయ్యయాదవ్, గుండాయపాలెంకు చెందిన మావయ్య, మాజీ ఎంపీటీసీ నరసింహారావు, ఏడుకొండలు, ప్రభాకర్, పోలవరపు వెంకట్రామయ్య, ఉలిచి గ్రామంలో మాజీ జడ్పీటీసీ నరసింహారావు, పిల్లుట్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభివృద్ధికి బాసటగా ఉంటా..!

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ • పిడతలపూడిలో 35కుటుంబాలు తెలుగుదేశంలో చేరిక



పిడతలపూడిలో పార్టీలో చేరిన వారితో విజయ్‌కుమార్



చీమకుర్తి పట్టణంలో బీఎన్‌కు స్వాగతం పలుకుతున్న శ్రేణులు

చీమకుర్తి, ఏప్రిల్ 13 : బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి, సంక్షేమానికి బాసటగా నిలుస్తానని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని పిడతలపూడి గ్రామం, చీమకుర్తి పట్టణంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌కు పిడతలపూడి గ్రామంలో అపూర్వ స్వాగంతం లభించింది. గ్రామంలో 35 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరగా వారందరికీ విజయ్‌కుమార్ పార్టీ కండువాలను వేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ పిడతలపూడి గ్రామాన్ని అభివృద్ధిపథంలో పయనింపచేస్తానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారికి అన్నివిధాల అండగా నిలుస్తానన్నారు. సీఎంగా చంద్రబాబునాయుడుని చూడటమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. తదుపరి చీమకుర్తి పట్టణంలో రామనగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి అఖండ స్వాగతం లభించింది. మహిళలు, యువకులు పెద్దఎత్తున తరలివచ్చి విజయ్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికారు. కూటమి గెలిస్తే అమలు చేయబోయే సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు రాయపాటి అరుణ, టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, కందిమళ్ల గంగాధరరావు, ధనేకుల నాగయ్య, నర్రా నాగరాజు, పొదిలి రాములు, కరిచేటి అనిల్, పూనాటి వెంకట్రావు, సింగారెడ్డి, లక్ష్మణ్, వెంకట్రావు, కడియాల సుబ్బారావు, తూమాటి వెంకట్రావు, ఏడుకొండలు, బ్రహ్మనాయుడు, ఆదినారాయణ, నరేంద్ర, నరసింహాచారి, వేల్పుల వెంకటేశ్వర్లు, వంశీ, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులంపేరుతో దుష్ప్రచారం దారుణం

• ఎమ్మెల్యే బాలినేనిపై తెలుగు మహిళల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు మహిళలు

ఒంగలు(కార్పొరేషన్), ఏప్రిల్ 13: ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం పుట్టిందని, అందుకే కమ్మ సామాజికవర్గంపై దుష్ప్రచారం చేసి సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని తెలుగు మహిళలు ధ్వజమెత్తారు. శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బాలినేని పదేపదే కమ్మవారు అంటూ మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. కమ్మవాళ్ళు మనుష్యులు కాదా అని ప్రశ్నించారు. సమతానగర్‌లో జరిగిన వైసీపీ ప్రచారంలో తన కోడలని అవమానపరిచారని మాట్లాడుతున్న బాలినేని ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని చెప్పారు. మహిళలను అవమానపరిచే సంస్కృతి టీడీపీకి లేదన్నారు. అంతేగాకుండా పదేపదే ఆడవారిని అవమానించారని, మా ఫ్యామిలీని టచ్ చేశారని మాట్లాడటం వింటుంటే హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. గతంలో తెలుగు మహిళలను పోలీసుస్టేషన్‌లో నిలబెట్టి, ఇబ్బందులు పెట్టిన విషయం మరిచినట్టున్నారని అన్నారు. బాలినేని వాస్తవాలు తెలిసి కూడా అక్కడ జరిగిన సందర్భాన్ని ఎన్నికల్లో స్వార్థం కోసం ఉపయోగించుకోవడం ఆయనలో ఓటమి భయాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. మరోసారి తమ నాయకుడు దామచర్ల జనార్దన్‌పై నోరు పారేసుకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతిదాన్ని రాజకీయం చేయడం, తన స్వార్థ రాజకీయానికి వాడుకోవడం, సానుభూతి పొందాలని బాలినేని చేసే నీచ రాజకీయాలకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు త్వరలోనే ఉన్నాయని చెప్పారు. సమావేశంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాళం నరసమ్మ, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షురాలు రావుల పద్మజ, ప్రధానకార్యదర్శి బీరం అరుణ, నిడమనూరి పావని, షేక్ హజీమున్నీసా, పసుపులేటి సునీత పాల్గొన్నారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు



కలశాలతో శోభాయాత్ర చేస్తున్న భక్తులు





నిర్మల్‌నగర్‌లో నృత్యప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 13 : ఒంగోలు నగరంలో శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాలలో పందిళ్లు, వేదికలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. స్థానిక సీతారాంపురం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా తాతా బిల్డింగ్స్ దగ్గర నుంచి దేవస్థానం వరకు చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఇక శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో 108 కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానం ఆలయ పుష్కరిణి దగ్గర పరాంకుశం రమానాథాచార్యులు కలశాలకు ప్రత్యేక పూజ చేశారు. అనంతరం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానానికి శోభాయాత్ర చేరుకుంది. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీరామనామాన్ని జపించారు. అర్చకులు ముప్పాళ్ల రాంబాబు, వాకాని కోదండ రాంబాబులు కలశ జలాలతో స్వామివారికి అభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ సేవాసమితి అధ్యక్షులు మొగిలి ఆనందరావు, కార్యదర్శి మద్దులూరి శ్రీనివాసులు, సంతవేలూరి కోటేశ్వరరావు, నట్టం పురందర దాసు, గోగు శివుడు, చలువాది బదరీనారాయణ, రాధా రమణగుప్తా జంధ్యం, నేరెళ్ల శ్రీనివాసరావు, దనిశెట్టి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

స్థానిక నిర్మల్‌నగర్ శ్రీ సీతారామ భక్తబృందం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్థానిక నారాయణ పబ్లిక్ స్కూలు విద్యార్థులు పలు భక్తి గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. నిర్వాహక కమిటీ గౌరవ అధ్యక్షులు తాటిపర్తి గోపాలరెడ్డి, అధ్యక్షులు డాక్టర్ కె.సీతారామయ్య, కార్యదర్శి నాగబోయిన భాస్కరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలు బహూకరించారు.

ఘనంగా రంగభూమి సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 13 : ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములోని జిల్లా రంగభూమి కళాకారుల సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముందుగా నటరాజ స్వామి చిత్రపటానికి పలువురు కళాకారులు పూలమాల సమర్పించారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటులు ధూళిపాళ్ల గురించి వెలనాటి మల్లిఖార్జునరావు, కందుకూరి వీరేశలింగం పంతులు గురించి డాక్టర్ మొగిలిదేవ, సినీ, రంగస్థల నటులు జేవీ.సోమయాజులుపై దేనువకొండ వెంకట సుబ్బారావు ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాదు, ఏల్చూరి అనంతలక్ష్మి, ఐ.నరసింహం, జి.వెంకటరామయ్య, చిడితోటి బాబూరావు, జయరావు, ఉషారాణి పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

కేజీబీవీల్లో విద్యార్థినుల ప్రతిభ

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 13 : జిల్లాలోని కాస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారని జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కురిచేడు, రాచర్ల కేజీబీవీలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. మార్కాపురం కేజీబీ విద్యార్థిని జి.లక్ష్మీతిరుపతమ్మ 980 మార్కులు, కురిచేడు విద్యార్థిని ఎ.సుభాషిణి 961, హెచ్ఎంపాడు విద్యార్థిని డి.యామిని, జి.మాధురి 955 మార్కులు సాధించి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 469 మంది పరీక్షకు హాజరు కాగా 304 మంది పాసై 64.82 శాతం ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరం విద్యార్థులు 506 మంది పరీక్షకు హాజరు కాగా 234 మంది పాసైనట్లు తెలిపారు. వెలిగండ్ల, మర్రిపూడి, ముండ్లమూరు, పెద్దారవీడు కేజీబీవీలు ప్రథమ సంవత్సరం ఫలితాల్లో జీరో ఉత్తీర్ణత సాధించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను డీఈవో అభినందించారు.

నేడు మెగా సంగీత సమ్మేళనం

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 13: ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన గాయకులతో ఆదివారం ఒంగోలు నగరంలో మెగా సంగీత సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, సీనియర్ గాయకులు అర్జున్ కర్నాటి, జనార్ధనరావు, తిరుపతిరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక నెల్లూరు బస్టాండ్ కుమార్ రెసిడెన్సీలో జరుగనున్న ఈ సంగీత సమ్మేళనంలో ఎస్.వెంకటలక్ష్మి, స్వర్ణలత, లక్ష్మీప్రియ, రాధానాయుడు, సత్యస్వాతి, రోజాలక్ష్మి, సుమాంజలి, సౌజన్య, శ్యామల, రామస్వామి, ఆర్ట్ కోటి, డాక్టర్ మల్లిఖార్జునరావు, వంశీమోహన్, చంద్ర, సైదారెడ్డి, హరిబాబు తదితర దాదాపు 80 మంది గాయకులు హాజరవుతారన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్విరామంగా జరిగే ఈ సంగీత సమ్మేళనంలో సంగీతాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

22 నుంచి రెండో సెమిస్టర్ పరీక్ష

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 13: ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలోని 88 డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న మొదటి సంవత్సరం డిగ్రీ రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 22 నుంచి మే 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు యూనివర్శిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి బి.పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా పరీక్షలు ఉదయం పూటే నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఆదేశిక సూత్రాల పరిరక్షణకు పాటుపడాలి



సదస్సులో మాట్లాడుతున్న వేణుగోపాల్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 13: రాజ్యాంగంలోని ప్రజాస్వామిక, లౌకిక, ఆదేశిక సూత్రాల పరిరక్షణకు ప్రజలు ముందుకురావాలని వీక్షణ ఎడిటర్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. శాస్త్రీయ, సామ్యవాద అధ్యయన వేదిక ఆధ్వర్యంలో శనివారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో అంబేడ్కర్ జయంతి, కారల్‌మార్క్స్, భగత్‌సింగ్, చంద్ర రాజేశ్వరరావుల వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సదస్సుకు వేదిక కన్వీనర్ ఎం.వెంకయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లడుతూ రాజ్యాంగంలో ప్రజా అనుకూల, ప్రజా వ్యతిరేక అంశాలు ఉన్నాయన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసేందుకు, ప్రజాస్వామిక ఉద్యమాలను అణిచివేసేందుకు రాజ్యాంగంలో ఉన్న బలహీనతలను పాలకులు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ప్రజాస్వామిక ఉద్యమకారులను విచారణ లేకుండా సంవత్సరాల తరబడి జైలులలో నిర్బంధిస్తున్నారని విమర్శించారు. ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హనుమంతరెడ్డి మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు ఆదర్శనీయుడని, నిత్యం పేద ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై పోరాటం సాగించారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘర్షణలకు బహుజనులు దూరంగా ఉండాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 13 : ఒంగోలులో నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో బహుజనులు పాల్గొనవద్దని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికలలో రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం బహుజనులను బలిపశువులను చేసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఓటును నోటుకు అమ్ముకోకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా ప్రయత్నం చేయాలని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కార్యకర్తలను బలిపశువులను చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

క్విస్‌లో అతిథి ఉపన్యాసం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 13: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ, డేటా సైన్స్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆటోమేటా ఆన్ ఇన్ఫినిట్ సీక్వెన్షన్ అండ్ ట్యూరింగ్ మెషీన్స్ అనే అంశంపై శనివారం అతిథి ఉపన్యాసం జరిగింది. ఎస్ఆర్ఎం యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.కృష్ణ ట్యూరింగ్ యంత్రాలు పని చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, విభాగాధిపతి డి.బుజ్జిబాబు, కో కన్వీనర్ నిడమానూరి శ్రీను పాల్గొన్నారు.

వాసుదేవరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 13: ప్రజా సేవలో వాసుదేవరావు జీవితం ఆదర్శనీయమని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒంగోలులోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో శనివారం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి పైలా వాసుదేవరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు కానూరి వెంకటేశ్వరరావుల వర్ధంతిని పురస్కరించుకుని ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సాగర్, చొప్పర జాలన్న, రాజశేఖర్, రామ్మోహన్‌రెడ్డి, నాగరాజు, పద్మ, లలిత, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వంశీకృష్ణకు ఉగాది పురస్కారం



వంశీకృష్ణను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 13: ఒంగోలు నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు చాపల వంశీకృష్ణను ఎల్ఈఎఫ్ ఫౌండేషన్ ఉగాది పురస్కారంతో సన్మానించింది. శనివారం సంస్థ ప్రతినిధులు స్థానిక శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో ఆయనను కలిసి పురస్కార జ్ఞాపికను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ వైద్య, సామాజిక, కళా, సేవారంగాలలో డాక్టర్ వంశీకృష్ణ అందిస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. వైద్యవృత్తికి హుందాతనాన్ని తీసుకువచ్చిన వైద్యులు వంశీకృష్ణ అని కె.బుచ్చేశ్వరరావు అభినందించారు. కాగా తనకు ఈ పురస్కారం లభించటం ఎంతో ఆనందంగా ఉందని వంశీకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్, దేవారెడ్డి, శరత్‌బాబు, నక్కల శ్రీనివాసరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయిరాం కళాశాల విద్యార్థినుల ప్రతిభ



కొప్పర్తి అమృత

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 13 : ఇంటర్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీసాయిరాం జూనియర్ కళాశాల విద్యార్థినులు విజయభేరి మోగించారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో కొప్పర్తి అమృత 985 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులను సాధించిన విద్యార్థినులు గతంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 929 ర్యాంకును ఎం.నందిని సాధించారు. ఈ సందర్భంగా శనివారం కాలేజీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను కరస్పాండెంట్ కె.మోహన్‌రావు, ప్రిన్సిపాల్ కరి అంజయ్య ప్రత్యేక అభినందించారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలి

మద్దిపాడు, ఏప్రిల్ 13: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలని ఎంపీడీవో శంకర్ పేర్కొన్నారు. శనివారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటును వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి సురేష్ ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

వైసీపీ ఆత్మీయ సమ్మేళనం అట్టర్‌ఫ్లాప్

- విందు పేరుతో ఆహ్వానించిన చెవిరెడ్డి
- ఆశించిన స్థాయిలో హాజరుకాని పార్టీ శ్రేణులు
- సింగరాయకొండలో ఈసారి కష్టమేనని చర్చ

సింగరాయకొండ, ఏప్రిల్ 13 : సింగరాయకొండలో శనివారం వైసీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. మండలంలో 10 గ్రామాల నుంచి 2,000 మందిని తరలించాలని అధికార పార్టీ నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆమేరకు శుక్రవారం తన క్యాంపు కార్యాలయానికి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులకు పిలిపించుకొని మంత్రి సురేష్ టార్గెట్ ఫిక్స్ చేశారు. సమావేశానికి హాజరైన వారికి చెవిరెడ్డి మంచి విందు కూడా ఇస్తున్నట్లు ప్రచారం చేయాలని సూచించారు. గ్రామాల నుంచి ఆటోలను కూడా ఏర్పాటు చేశారు. కానీ వైసీపీ శ్రేణులు ఆశించిన స్థాయిలో హాజరుకాలేదు. కేవలం 500 మంది లోపు మాత్రమే వచ్చారు. దీంతో ఈసారి సింగరాయకొండ మండలంలో వైసీపీకి మెజారిటీ రావడం కష్టమేనన్న చర్చ వైసీపీ శ్రేణుల్లో నడుస్తోంది. సమావేశంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ నా రాజకీయ భవిష్యత్‌కు సమాధి కట్టేది ఎమ్మెల్యే స్వామి కాదని, తన భవిష్యత్ జగనన్న చేతిల్లో సురక్షితంగా ఉందని చెప్పారు. జగనన్న నొక్కాల్సిన బటన్లు అన్నీ నొక్కారని, ఇప్పుడు ఓటర్లు రెండు బటన్లు నొక్కాలని కోరారు. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఒక ఎంపీలా కాకుండా ఒక వార్డు సభ్యుడిగా, గ్రామ సర్పంచ్‌గా ఉన్నట్లు మీలో ఒకరిగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, వైసీపీ వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, ఆపార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, యన్నాబత్తిన చిన్నా, సర్పంచ్ తాటిపర్తి వనజ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కోదండ రామస్వామి ఆలయ ప్రతిష్ఠ

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్ 13 : మండలంలోని దావగూడూరులో శ్రీ హనుమత్ సమేత లక్ష్మణ సీతా సమేత కోదండ రామస్వామి ఆలయ ధ్వజ స్తంభ, విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. ఉత్తర కార్యక్రమాలు ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

22న సురేష్ నామినేషన్

కొండపి, ఏప్రిల్ 13 : వైసీపీ కొండపి అభ్యర్థి, రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ ఈనెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆమేరకు శనివారం నియోజకవర్గంలోని పలు మండలాల్లో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి ప్రకటించారు.



ప్రమాదస్థలంలో పడి ఉన్న మృతదేహాలు (ఇన్‌సెట్లో) ప్రణయ్ కుమార్, రవీందర్‌బాబు(ఫైల్)

రెండు కార్లు ఢీ.. ఇద్దరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అతివేగం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. నిద్రమత్తులో అతివేగంగా కారు నడిపి డివైడర్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన బొల్లం ప్రణయ్ కుమార్(29) ప్రైవేట్ ఉద్యోగి. మీర్‌పేట్‌లోని నందిహిల్స్‌లో ఉంటున్నాడు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన కుంచాల రవీందర్‌బాబు(29) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ వనస్థలిపురం ఎస్‌కేడీనగర్‌లో ఉంటున్నాడు. వీరిద్దరూ స్నేహితులు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి 2.30 గంటలకు స్విఫ్ట్ కారు(టీఎస్22టీఏ 0898)లో తుర్కయాంజాల్ నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వస్తున్నారు. అదేసమయంలో నల్గొండ జిల్లా మల్లేపల్లి సమీపంలోని వడ్డెమోని గూడెం తండాకు చెందిన ఇస్లావత్ దస్రు(26)తన క్రేటా కారు(టీఎస్05ఈసీ0123)తో బీఎన్‌రెడ్డినగర్ నుంచి తుర్కయంజాల్ వైపు వెళ్తున్నాడు. గుర్రంగూడ చౌరస్తా దాటిన తర్వాత నిద్రమత్తులో అతివేగంతో డివైడర్‌ని ఢీకొని అవతలివైపు నుంచి వస్తున్న స్విఫ్ట్ కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారులోని బొల్లం ప్రణయ్‌కుమార్, కుంచాల రవీందర్‌బాబు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలంలోనే ఇద్దరూ మృతిచెందారు. ఇస్లావత్ దస్రుకు తీవ్రగాయాలు కాగా అతన్ని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోనంకికి చేరిన సాగర్ జలాలు

మార్టూరు, ఏప్రిల్ 13 : కోనంకి సబ్ డివిజన్ పరిధిలో ఎన్ఎస్‌పీ కాలువలోకి శనివారం సాయంత్రానికి సాగర్ జలాలు ప్రవేశించాయి. చాలా తక్కువగా సాగర్ జలాలు వస్తున్నట్లు ఎన్నెస్పీ అధికారులు చెప్తున్నారు. శనివారం రాత్రి 7 గంటలకు మార్టూరు మండలం బొల్లాపల్లి జీఎన్‌టీ రోడ్డు దాటి సాగర్ జలాలు దిగువకు ప్రవహించాయి. రాజుపాలెం మేజర్‌కు కూడా స్వల్పంగా జలాలు వెళుతున్నాయి. వారబందీ పద్ధతిన పమిడిపాడు మేజర్, కోటపాడు మేజర్‌ను మూసివేశారు. మూడు రోజుల తర్వాత వాటిని తెరుస్తారు. యద్దనపూడి బ్రాంచి కెనాల్ ద్వారా జీఎన్‌టీ దాటిన తర్వాత నూతలపాడు మైనర్, ద్రోణాదుల మేజర్‌కు నీటి సరఫరాను పంపించనున్నట్లు జేఈ రాజేష్ తెలిపారు.

దళిత ద్రోహి జగన్

టీడీపీ కూటమి కొండపి అభ్యర్థి స్వామి ధ్వజం
అరుంధతివాడలో ప్రచారం

టంగుటూరు, ఏప్రిల్ 13 : ముఖ్యమంత్రి జగన్ దళిత ద్రోహి అని ఎమ్మెల్యే, టీడీపీ కూటమి కొండపి అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ధ్వజమెత్తారు. టంగుటూరు పంచాయతీలోని అరుంధతివాడలో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ముఖ్యమంత్రి దళితులను మోసం చేసిన తీరును వివరించారు. రూ.25వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించాడని, 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి ఓట్లు వేసిన దళితులను దగా చేశాడన్నారు. దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని ముఖ్యమంత్రి తన పక్కన పెట్టుకొని తిరుగుతున్నాడన్నారు. అదే ఎమ్మెల్సీ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వేసిన పూలమాలను స్థానిక దళితులు తీసివేసి ఆయన్ను అక్కడ నుంచి తరిమివేశారని ఈసందర్భంగా స్వామి గుర్తు చేశారు. అలాగే జగన్‌ను కూడా దళితులు తరిమివేసే రోజు ఎంతో దూరంలో లేదని తేల్చి చెప్పారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో దళితులకు ఒరిగిందేమీలేదని, పేదలు నిరుపేదలయ్యారని విమర్శించారు. మద్యం, ఇసుక, మట్టి, మైనింగ్‌లో అక్రమాల ద్వారా రూ.కోట్లు కొల్లగొట్టి ఆ డబ్బును ఎన్నికల్లో వెదజల్లేందుకు సిద్ధంగా ఉన్నాడని ఆరోపించారు. ఆయన్ను నమ్మి ఓట్లు వేసిన దళితులను నిలువునా ముంచాడని, మూడు ముక్కలాట ఆడి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడని, రాష్ట్రాన్ని తలలేని మొండెంలా తయారు చేశాడని మండిపడ్డారు. నా ఎస్సీలంటూ వారిని నమ్మించి ఓట్లు దండుకొని ముఖ్యమంత్రి పీఠం ఎక్కగానే వారి నెత్తిన భస్మాసుర హస్తం పెట్టాడన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎక్కువగా నష్టపోయింది ఎస్సీ లేనన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఉంటే దళితులు పూర్తిగా దగాకు గురవుతారని, జగన్ రాష్ట్రాన్ని ఎంత త్వరగా వీడితే అంతమంచిదని వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరఫున ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనకు, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఓట్లేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలన్నింటినీ తిరిగి సాధించవచ్చని స్వామి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నేత బెజవాడ వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ మద్దిరాల మమత, పార్టీ పట్టణ కార్యదర్శి దయానందం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భానుచందర్, నాయకులు మద్దిరాల వెంకట్రావు, జక్కుల శ్రీను పాల్గొన్నారు.



టంగుటూరు అరుంధతీవాడలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

నా విజయానికి సహకరించండి

టీడీపీ కూటమి కొండపి అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శనివారం మండలంలోని పొందూరులో సీపీఐ (ఎంఎల్)కు చెందిన నాయకులు డీవీఎన్ స్వామి, లలిత, వేజెండ్ల రామారావును కలిశారు. ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని వారిని కోరారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో దామచర్ల సత్య

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్ 13 : మండలంలోని దావగూడూరులో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరంతా మాజీ ఎంపీపీ కంచర్ల వెంకటేశ్వర్లు వర్గీయులు. గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చదలవాడ బ్రహ్మేంద్రం, బ్రహ్మయ్య, వెంకటస్వామి, నరసింగరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన గ్రామీణ వైద్యుడు గౌరీశంకర్‌శర్మ

మర్రిపూడి, ఏప్రిల్ 13 : మండలంలోని కూచిపూడికి చెందిన ప్రముఖ గ్రామీణ వైద్యుడు, విశ్రాంత బ్రాంచ్ పోస్టుమాస్టర్ గూడలి గౌరీశంకర్‌శర్మ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేస్వామి ఆయన మెడలో పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. గౌరీశంకర్‌శర్మ కూచిపూడి పరిసర గ్రామాల్లో గ్రామీణ వైద్యుడిగా 50 ఏళ్ల నుంచి అందరికీ చిరపరిచితులు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందిన శర్మ అనంతరం వైసీపీలో కూడా కీలకంగా వ్యవహరించారు. ఆ పార్టీ విధానాలు నచ్చక టీడీపీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఆయనతోపాటు పాతకొట్టు సుధాకర్ రెడ్డి, మరో ఐదు కుటుంబాల వారు సైకిలెక్కారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు చిలకల కొండారెడ్డి, ఎర్రంరెడ్డి వెంకటరెడ్డి గూడలి శశిధర్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



గౌరీశంకర్‌శర్మకు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే స్వామి

నాలుగు కేజీబీవీల్లో జీరో ఉత్తీర్ణత

- ఫలితాల సాధనలో వెనుకంజ
- ఇంటర్ ఫలితాల్లో హైస్కూలు ప్లస్ ఢమాల్

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 13 : ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) చతికిలబడ్డాయి. 28 కేజీబీవీల్లో నాలుగు చోట్ల ప్రథమ సంవత్సరం విద్యార్థులు, ఒకచోట ద్వితీయ సంవత్సరం విద్యార్థులందరూ ఫెయిలై జీరో ఉత్తీర్ణత సాధించారు. జిల్లా సగటు ఉత్తీర్ణత కంటే తక్కువతో బాగా వెనుకబడ్డారు. జిల్లాలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు సగటున 67శాతం ఉత్తీర్ణత సాధించగా కేజీబీవీ విద్యార్థులు 22శాతం తక్కువగా కేవలం 45.3శాతం మంది మాత్రమే పాసయ్యారు. పెద్దారవీడు కేజీబీవీలో ఐదుగురు, మర్రిపూడిలో ఐదుగురు, ముండ్లమూరులో 17 మంది, వెలిగండ్లలో 19మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఫెయిలయ్యారు. అర్ధవీడు కేజీబీవీలో 25కుగాను 21 మంది పాసై 84శాతం ఉత్తీర్ణతతో ప్రథమస్థానంలో నిలిచింది. పామూరు కేజీబీవీలో 11 మందికి తొమ్మిదిమంది ఉత్తీర్ణత సాధించి 81శాతం ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన కేజీబీవీలన్నీ జిల్లా సగటు ఉత్తీర్ణత సాధనలో వెనుకబడి ఉన్నాయి. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వెలిగండ్ల కేజీబీవీలో ఒక్కరు కూడా పాస్ కాలేదు. ఈ కళాశాల నుంచి నలుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందరు ఫెయిలయ్యారు. జిల్లాలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 78శాతం మంది ఉత్తీర్ణులు కాగా కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో 25.2శాతం తక్కువగా 52.8శాతం మంది మాత్రమే పాసయ్యారు. పుల్లలచెరువు కేజీబీవీలో 20 మందికి 18 మంది పాసై 90శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. అర్ధవీడు కేజీబీవీలో 17 మందికి 15 మంది పాసై 88.24శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. మిగిలిన వాటిలో జిల్లా సగటు కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించారు. మర్రిపూడిలో 10శాతం, దర్శి, కొనకనమిట్లలో 20శాతం, బీపేటలో 25శాతం, పెద్దారవీడులో 28.57శాతం, కే.బిట్రగుంటలో 40.74శాతం, కలుజువ్వలపాడులో 40.91శాతం, కనిగిరిలో 41.18శాతం, పెదదోర్నాలలో 45.45, ముండ్లమూరులో 47.37శాతం, తాళ్లూరులో 50శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

రెండు ప్లస్‌ల్లో జీరో ఉత్తీర్ణత

ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని హైస్కూలు ప్లస్‌లు ఢమాల్ అన్నాయి. జిల్లాలోని తొమ్మిది స్కూళ్లల్లో రెండుచోట్ల ఒక్క విద్యార్థి కూడా పాసుకాలేదు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సగటున 78శాతం మంది ఉత్తీర్ణులు కాగా హైస్కూలు ప్లస్‌ల్లో 52.1శాతం తక్కువగా కేవలం 25.9శాతం మంది మాత్రమే పాసయ్యారు. హెచ్.నిడమానూరులో ముగ్గురు, కొణిజేడు ప్లస్‌లో 11 మంది పరీక్షకు హాజరు కాగా అందరూ ఫెయిలయ్యారు. దేవరంపాలెంలో ఇద్దరు పరీక్షకు హాజరు కాగా ఇద్దరూ పాసయ్యారు. మిగిలిన ఆరు హైస్కూళ్లలో జిల్లా సగటు కన్నా తక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. పాకలలో ముగ్గురికి ఇద్దరు, కరవదిలో 20కి ఎనిమిది మంది, శీలంవారిపల్లిలో 10కి ముగ్గురు, మైనంపాడులో ఎనిమిదికి ఇద్దరు, కె.ఉప్పలపాడులో 11కు ఇద్దరు, గిద్దలూరులో 13మందికి ఇద్దరు పాసయ్యారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కూడా చతికిలపడ్డారు. జిల్లాలో సగటున 67శాతం మంది ఉత్తీర్ణులు కాగా హైస్కూలు ప్లస్‌లో 41శాతం తక్కువగా 26.21శాతం మంది పాసయ్యారు. జిల్లాలోని తొమ్మిది ప్లస్‌లలో ఒక్కదానిలో కూడా జిల్లా సగటు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. 145 మంది పరీక్షకు హాజరు కాగా కేవలం 38మంది మాత్రమే పాసయ్యారు. పాకలలో 10మందికి ఆరుగురు పాసై 60శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలువగా, కె.ఉప్పలపాడు 11 మందికి ముగ్గురు పాసై 42.86శాతంతో ద్వితీయస్థానంలో నిలిచారు. కొణిజేడులో 16 మందికి ఒక్కరు, హెచ్.నిడమానూరులో 9మందికి ఒకరు, దేవరపాలెంలో 10మందికి ఒకరు, గిద్దలూరులో 32 మందికి నలుగురు, కరవదిలో 14 మందికి ఒకరు, మైనంపాడులో ఎనిమిది మందికి ముగ్గురు, శీలంవారిపల్లిలో 39 మందికి 16 మంది పాసయ్యారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

- మృతురాలిది ఒంగోలు ధారావారితోట

కావలి రూరల్, ఏప్రిల్ 13: నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని అష్టలక్ష్మీనగర్‌లో అత్తింటి వేధింపులు తాళలేక అంబార్కర్ లక్ష్మి(32) శనివారం ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు, వెంగళరావునగర్‌కు చెందిన అంబార్కర్ వంశీభరత్‌కు ప్రకాశం జిల్లా ఒంగోలు ధారావారితోటకు చెందిన లక్ష్మికి 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. పెళ్లి అయిన దగ్గర నుంచి వంశీభరత్ తాగి వచ్చి లక్ష్మిని తిడుతూ, కొడుతూ చిత్రహింసలకు గురిచేసేవాడు. వంశీభరత్‌కు ఆయన కుటుంబ సభ్యులకు వెంగళరావునగర్ లోని ఇంటి విషయపై తరచూ వివాదాలు జరిగేవి. దీంతో వంశీభరత్ అష్టలక్ష్మీనగర్‌లో ఇల్లు కట్టుకుని భార్య పిల్లలతో వేరుగా ఉంటున్నాడు. ఈ మధ్యకాలంలో లక్ష్మిని వంశీభరత్, అతడి సోదరుడు వంశీతోపాటు ఆయన భార్య హిమబిందు, అత్తమామలు తనిత, విజయభాస్కర్‌లు తరచూ వేధించేవారు. ఈ క్రమంలో శనివారం లక్ష్మికి, భర్త వంశీభరత్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి ఇంట్లోని హిట్ తాగి నురగలు కక్కుతూ అపస్మారక స్థితికి చేరుకుంది. గుర్తించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు. మృతురాలు లక్ష్మికి ఇద్దరు పిల్లలు. మృతురాలి సోదరుడు సురేంద్ర ఫిర్యాదుతో రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహజ వనరులను దోచుకున్న వైసీపీ నేతలు

* టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి కూటమి అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 13: వైసీపీ పాలకులు సహజవనరులను దోచుకున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని మోదేపల్లిలో శనివారం ఎమ్మెల్యే గొట్టిపాటి ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిలిపేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆ బిల్లులను చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకుంటామన్నారు. చిలకలేరు వాగులో గతంలో నీరు ఉండేదని, ప్రస్తుతం కనీసం పశువులు తాగేందుకు కూడా నీరు లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇసుక ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేసేందుకు వీలుగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు గేట్లను పెట్టలేదన్నారు. సహజ వనరుల దోపిడీతో ప్రజలు వలస పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తామని గొట్టిపాటి చెప్పారు. టీడీపీ ప్రభుత్వం అర్హులందరికి పింఛన్‌లు మంజూరు చేయగా, జగన్‌రెడ్డి వచ్చాక వైసీపీ సానుభూతిపరులకు మాత్రమే పింఛన్‌లు మంజూరు చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామన్నారు. అలాగే బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ మంజూరు చేస్తామని తెలిపారు. టీడీపీతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలు పెద్ద ఎత్తున హారతులు ఇచ్చి, వీరతిలకం దిద్ది స్వాగతం పలికారు.



నగరంలో పర్యటిస్తూ పోలీసులను అప్రమత్తం చేస్తున్న ఎస్పీ సునీల్

అప్రమత్తమైన పోలీసులు

నగరంలో అర్ధరాత్రి పర్యటన

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 13 : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ఎన్టీఆర్ జిల్లాలో బస్సు యాత్ర సందర్భంగా రాయి దాడి జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శనివారం రాత్రి ఎస్పీ సుమిత్ సునీల్, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు ఒంగోలు నగరంలో అర్ధరాత్రి పర్యటించారు. అదేవిధంగా ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేశారు. వైసీపీ కార్యకర్తలు అలజడి సృష్టిస్తారనే ఆలోచనతో ముందస్తు చర్యలు చేపట్టారు. నగరంలోని చర్చి సెంటర్, అద్దంకి బస్టాండ్‌తోపాటు పలు ప్రాంతాలను సందర్శించి పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



మద్యం దుకాణం వద్ద బారులు తీరిన మద్యపాన ప్రియులు

మద్యం ప్రియం.. జోరుగా మొబైల్ వ్యాపారం

- ఈసీ ఆంక్షలతో మధ్యాహ్నానికే మూతపడుతున్న దుకాణాలు
- పెరిగిన బెల్టుషాపులు
- వాహనాల్లో తిరుగుతూ విక్రయిస్తున్న కొందరు

కొండపి, ఏప్రిల్ 13 : మద్యం అమ్మకాలపై ఎన్నికల సంఘం ఆంక్షలు పెట్టింది. రేషన్ విధించింది. గత ఏడాది ఈ సమయంలో ఏతేదీన ఎంత మద్యం విక్రయించారో అంతే అమ్మాలన్న షరతుతో మద్యం దుకాణాలు మధ్యాహ్నానికే మూతపడుతున్నాయి. దీంతో మందుబాబులు ఉదయం షాపులు తెరిచిన వెంటనే క్యూ కడుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన కొండపి, కె.ఉప్పలపాడు, పెట్లూరు జరుగుమల్లి మండలంలోని కామేపల్లి, చింతలపాలెంలో ఉన్న సర్కారు మద్యం దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఒక్కొక్కరికి ఒక్క క్వార్టర్ బాటిల్ మాత్రమే ఇస్తుండటంతో మద్యానికి గిరాకీ పెరిగింది. దీన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. కొండపిలోని మద్యం షాపుల పరిసర ప్రాంతాల్లో ఉన్న కొన్ని టిఫిన్ దుకాణాల వారు ముందుగా మద్యం తెచ్చి అక్రమంగా నిల్వ చేస్తున్నారు. క్వార్టర్‌కు అదనంగా రూ.100 తీసుకొని విక్రయిస్తున్నారు. దీనికి తోడు కొంతమంది ఉదయాన్నే మద్యం బాటిళ్లను తీసుకుని మోటారు సైకిళ్లలో దాచుకుని వైన్‌షాపులు మూసివేశాక అమ్ముతున్నారు. వారితో సర్కారు వైన్స్‌లో పనిచేసే సిబ్బంది లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని ఎక్కువ బాటిళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే మండలంలో 20కిపైగా బెల్టు దుకాణాలు నడుస్తుండగా, తాజాగా ఎన్నికల సంఘం ఆంక్షలతో మరో 10మంది మోటారు సైకిళ్లపై తిరిగి మద్యం అమ్ముతూ మొబైల్ వ్యాపారం చేస్తున్నారు. దీన్ని అధికారులు అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

సింగరాయకొండ, ఏప్రిల్ 13 : టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలోని పాత సింగరాయకొండలో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, మురళి, జాలయ్య పాల్గొన్నారు. సింగరాయకొండ సుందర్‌నగర్‌లో, సోమరాజుపల్లి పంచాయతీలోనూ టీడీపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా స్వామిని, ఎంపీగా మాగుంటను గెలిపించాలని కోరారు.

టీడీపీలో చేరికల ఉత్సాహం

● వైసీపీని వీడి ఆ పార్టీలోకి భారీగా చేరికలు ● ప్రచారంలోనూ దూసుకుపోతున్న అశోక్‌రెడ్డి, కుటుంబ సభ్యులు


ప్రజలకు అభివాదం చేస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 13 : టీడీపీ శ్రేణుల్లో చేరికల ఉత్సాహం కనిపిస్తోంది. మరోవైపు వైసీపీ రోజురోజుకు డీలాపడుతోంది. ప్రధానంగా నియోజక వర్గంలో రోజూ వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. తాజాగా కంభం మండలం నర్సిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పెద్దనల్లకాల్వ ఎంపీటీసీ సభ్యుడు పల్లె బోయిన లక్ష్మీనారాయణయాదవ్ వైసీపీని వీడి తన అనుచరులు, 50 కుటుంబాల వారితో టీడీపీలో చేరారు. వీరందరికీ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తాను స్థానికుడినని, నియోజక వర్గం గురించి బాగా తెలిసిన వ్యక్తిని అని అన్నారు. తాను శాసనసభ్యునిగా ఉన్న కాలంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, మరోసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెడతానన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో నాలి ఆవులరాజు, జింకా చిన్నతిరుపతి, పందనబోయిన శివయాదవ్, జింకా ఆవులయ్య, సూరె రాఘవ, మద్దు పరమేష్, మద్దు ఈశ్వరయ్య, ఓబులదిన్నె వెంకటరమణ, సంగాల క్రిష్ణ, మల్లెబోయిన మాలకొండయ్య, అద్దంకి శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షులు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు కేతం శ్రీనివాసులు, కొత్తపల్లె శ్రీను, భాస్కర్, తదితరులు ఉన్నారు.

మదారుపల్లె నుంచి 50 కుటుంబాలు చేరిక

కంభం మండలం తురిమెళ్ల పంచాయతీలోని మదారు పల్లె గ్రామానికి చెందిన 50 కుటుంబాలు మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారిలో వార్డుసభ్యుడు ఉదయగిరి మురళి, మాజీ వార్డుసభ్యుడు ఉదయగిరి రమణ, ఉదయగిరి మోహన్, మల్లెబోయిన తిరుపతి, కొత్తపల్లి రాజాబాయ్, ఏలె శ్రీనివాసులు, మల్లెబోయిన అంజనేయులు, మద్దికట్ల సుబ్బా రావు, మాలా ఈశ్వర్‌రెడ్డి, ఏలం మురళి, ఉదయగిరి వెంకటయ్య, పార్శ శ్రీనివాసులు, మల్లెబోయిన శ్రీనివాసులు తదితరులున్నారు.

గెలిపించండి అండగా ఉంటా

కొమరోలు : స్థానికుడినైన తనను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటానని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని దద్దవాడ, తాటిచర్ల, నల్లగుంట్ల గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. గిద్దలూరు మండలంలో భూకబ్జాల సంస్కృతి లేదని వలస వచ్చిన నేతలు గెలిస్తే ఆ సంస్కృతి వస్తుందన్నారు. కొమరోలు మండలం నుంచి అత్యధికంగా ఓట్లు వేయాలని అభ్యర్థించారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేసే వారికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బెల్లంకొండ సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్రంలోని అరాచక పాలనను పారదోలాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులు బిజ్జాల తిరుమలరెడ్డి, జిల్లా రైతు నాయకులు బిజ్జం రవీంద్రారెడ్డి, నాయకులు అనపా వీరశేఖర్, బిజ్జం కృష్ణ మోహన్‌రెడ్డి, లక్ష్మీనరసయ్య, జ్యోతిరెడ్డి, గోడి ఓబుల్‌రెడ్డి, గోపాలక్రిష్ణయ్య, చలిచీమల శ్రీనివాసచౌదరి, లాయర్ విజయ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల రంతూ పాల్గొన్నారు.


మదారుపల్లె నుంచి టీడీపీలో చేరిన కుటుంబాలు


ప్రచారం నిర్వహిస్తున్న అశోక్‌రెడ్డి సోదరి గీత

అశోక్‌రెడ్డి సోదరి గీత ప్రచారం

బేస్తవారపేట : నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన అశోక్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని ముత్తముల అశోక్‌రెడ్డి సోదరి గీత అన్నారు. శనివారం ఆమె రెడ్డినగర్, రెవెన్యూ కార్యాలయం రోడ్లలో పర్యటించారు. టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ముత్తముల అశోక్‌రెడ్డిని, మాగుంట శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ముప్పూరి రాము, బాష, అరుణ్‌కుమార్, బాదం మురళీ, రోషన్ బాబు, జలగం అనిత పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా ముస్లిం కుటుంబాలు

కంభం : పట్టణంలో గిద్దలూరు ఎన్‌డీఏ కూటమ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి సమక్షంలో సయ్యద్ రఫీ ఆధ్వర్యంలో 250 మైనారిటీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మాగుంట రాఘవరెడ్డి, అశోక్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఒక కూటమిగా ఏర్పడిన తరువాత వైసీపీలో వణుకు మొదలైందన్నారు. ఎన్‌డీఏ కూటమి ద్వారా రాష్ట్రానికి ఏదో అన్యాయం జరుగుతోందన్నారు. వైసీపీ దుష్ప్రచారం చేస్తుందన్నారు. రాష్ట్రంలో మైనారిటీలకు పూర్తిభద్రత కల్పించే పార్టీ టీడీపీ అన్నారు. ప్రతి ఏడాది రంజాన్ తోఫా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో 90 మసీదులకు, మదరసాలకు, కబరిస్తాన్‌లకు నిధులు మంజూరు చేశామన్నారు. అదే వైసీపీ ఒక్క మసీదు కైనా నిధులు మంజూరు చేశారా అని ప్రశ్నించారు. మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి చీకటి రాజ్యంగా మార్చిన జగన్ ప్రభుత్వాన్ని కాలరాసి ఎన్‌డీఏ కూటమి బలపరచిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో ఉస్మాన్, సయూమ్, అన్వర్, జావీద్, వసీమ్, అక్రమ్, ఇమ్రాన్, మస్తాన్, బాబా, మొహమ్మద్, సురేష్, నాగార్జున్, కాశి, రమణ, బాసు, సంజీవరావు, వంశీ, శ్యామ్, విక్కి, రంగనాయకులు, లింగయ్య, సుబ్రహ్మణ్యం, రమణ, ఖాశింవలి, క్రిష్టారెడ్డి, శ్రీను, రమణ, దిల్వర్, భక్షు, గౌస్, హుస్సేన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి మానిఫెస్టోలోని ఆడబిడ్డ నిధి మహిళలకు లబ్ధి చేకూరుతుందని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సతీమణి ముత్తుముల పుష్పలీల అన్నారు. శనివారం పట్టణంలోని 1వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ఉమ్మడి మానిఫెస్టోలోని ప్రతి అంశాన్ని ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పిడతల సరస్వతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షాన్వావలి, కౌన్సిలర్ చంద్రశేఖర్‌యాదవ్, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, పాముల వెంకటరమణ యాదవ్, పందీటి రజనీబాబు, బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఉపాధి హామీ పనులు తనిఖీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ అర్జునరావ్

తర్లుపాడు, ఏప్రిల్ 13: తర్లుపాడులో ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ అర్జున్‌రావ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం ఎండలు తీవ్రరూపం దాల్చుతుండడంతో ఉదయాన్నే పనులకు వచ్చి 10 గంటలలోపే పనులు ముగించుకొని వెళ్లాలన్నారు. కొలతల ప్రకారమే కూలీలకు వేతనాలు ఇస్తామన్నారు. కూలీలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పని ప్రదేశంలో కనీస వసతులు లేవని, తాగేందుకే మంచినీరు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు చెరువు పూడికతీత పనులు చేసినప్పటికీ వేతనాలు కేవలం రూ.70 నుంచి రూ.90 మాత్రమే ఇస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవటంతో మట్టి తవ్వేందుకు కష్టంగా ఉంటుందని పీడీ దృష్టికి తీసుకొచ్చారు. పనిప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పీడీ తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది లక్ష్యాల ప్రకారం పనులు చేయాలని, ఎక్కడైనా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఏపీడీ భాస్కర్‌రావు, ఏపీవో కొండయ్య, ఈసీ పెద్దన్న, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలి


అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం వన్ టౌన్, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మార్కాపురం అసెంబ్లీ పరిధిలోని తర్లుపాడు, కొనకమిట్ల, పొదిలి మండలాలకు చెందిన ప్రిసైడింగ్ అధికారులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ విధులలో బాధ్యతగా నిర్వహించాలని ప్రతి ఒక్కరూ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా తమ వంతు కృషి చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడితే సహించమని, పటిష్టమైన చర్యలు తీసుకుని పోలింగ్ సజావుగా నిర్వహించేలా చూడాలన్నారు. ఈవీఎంపై అవగాహన కల్పించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డివిజన్ అభివృద్ధి అధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఏర్పడాలి

● గిద్దలూరులో ముత్తుముల విజయం సాధించాలి
● నందవరంలో బిజెపి నాయకుల ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 13 : కేంద్ర, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఏర్పడి రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్, పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి డి.షరీఫ్, పట్టణ బిజెపి అధ్యక్షులు ఎం.వి.రమణ, తదితరులు శనివారం నంద్యాల జిల్లా నందవరం చౌడేశ్వరిదేవి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిద్దలూరు కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం సాధించాలని కోరుతూ అమ్మవారికి పూజలు నిర్వహించాలని తెలిపారు.

మద్యం సీసాలు అక్రమంగా నిల్వచేస్తే చర్యలు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం సీసాలను నిల్వ ఉంచే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ హెడ్ క్వార్టర్స్ గుంటూరు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సెబ్ కార్యాలయంలో శనివారం ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్ కమిషనర్ రవి ప్రకాష్ ఆదేశాల మేరకు ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాలకు గురి చేసేందుకు మద్యం సీసాలను నిల్వ ఉంచి ప్రజలకు సరఫరా చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం రహిత ఎన్నికలను నిర్వహించేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా ఎన్నికలలో పంచేందుకు నిల్వ చేసిన మద్యం సీసాల సమాచారాన్ని తమకు తెలియజేయాలని కోరారు. ఎన్నికలలో మద్యం రహితంగా జరిగితేనే ప్రజలు తమ ఓటు హక్కును పారదర్శకంగా వినియోగించుకుంటారన్నారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ సీఐ, ఎస్ఐలు శ్రీనివాస్, గోపాలకృష్ణలతో పాటు మార్కాపురం పరిధిలోని ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిద్దార్థ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 13: స్థానిక బోడపాడు రోడ్డులోని సిద్దార్థ జూనియర్ కళాశాల స్థాపించిన రెండో సంవత్సరంలోనే ఇంటర్ ఫలితాలలో మేటిగా నిలిచిందని కళాశాల కరస్పాండెంట్, ఛైర్మన్ గొలమారు వెంకట నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక సిద్దార్థ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలి తాలు సాధించిన విద్యార్థులను అభినందించి ఆయన మాట్లాడారు. ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో భారతి, షేక్ తస్లీమ్‌లు 470 మార్కులకు గాను 460 మార్కులతో జిల్లా డివిజన్ స్థాయిలో సత్తా చాటారన్నారు. హిమబిందు 463 మార్కులు, బైపీసీలో ఎం.గాయత్రి 440కి 430మార్కులు, సీఈసీలో మోజేష్ 440 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థి వై.శివారెడ్డి 1000కి 980 మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సరం ఫలితాలలో 400కు పైగా మార్కులు 20 మంది విద్యార్థులు సాధించారన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ గొలమారు శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ నల్లబోతుల పెద్ద కాశయ్య పాల్గొన్నారు.

గంటలోనే సొంతగూటికి ముజీబ్


టీడీపీ కండువా కప్పుకున్న ముజీబ్

కంభం, ఏప్రిల్ 13 : కంభం మండలం కందులాపురం పంచాయతీ వార్డు సభ్యుడు, టీడీపీ నాయకుడు షేక్ ముజీబ్‌కు బలవంతంగా వైసీపీ కండువా కప్పారు. అయితే అనంతరం గంటలోనే తిరిగి టీడీపీలోకి వచ్చారు. పార్టీ కార్యాలయానికి వచ్చి టీడీపీలోనే ఉంటున్నట్లు ప్రకటించారు. తన కడవరకు టీడీపీలోనే కొనసాగుతానన్నారు. వివరాల్లోకి వెళితే శనివారం సాయంత్రం 5గంటల సమయంలో వైసీపీ నాయకులు ముజీబ్ ఇంటికి వెళ్లి బలవతపెట్టి వైసీపీ కండువా కప్పినట్లు తెలిసింది. అయితే ముజీబ్ సాయంత్రం 6 గంటల సమయంలో టీడీపీ కార్యాలయంలో తన వార్డు ప్రజల ఆధ్వర్యంలో సొంతగూటికి చేరి టీడీపీ కండువా కప్పుకున్నాడు. ముజీబ్ మాట్లాడుతూ పార్టీ స్థాపించినప్పటి నుంచి తన తండ్రి హయాం నుండి టీడీపీలోనే ఉన్నామన్నారు. ఎప్పటికీ టీడీపీలోనే ఉంటానని తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షులు తోట శ్రీనివాసులు మాట్లాడుతూ చిరువ్యాపారం చేసుకుంటున్న వారిపై ప్రలోభాలకు గురి చేసి రాజకీయం చేయడం సబబుకాదన్నారు. టీడీపీ నాయకులు కేతం శ్రీను మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ముజీబ్ కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. అలాంటి నాయకుడిని మభ్యపెట్టి పార్టీ కండువా కప్పి ఇలా చేయడం సబబుకాదని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరిక్షన్‌బాబుకు వేద ఆశీర్వాదం


ఆశీర్వాదం తీసుకుంటున్న ఎరిక్షన్‌బాబు, మన్నె రవీంద్రలు

పుల్లలచెరువు, ఏప్రిల్ 13: వైపాలెం టీడీపీ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు విజయం సాధించాలని ఎర్రగొండపాలెం బ్రహ్మణ సంఘం పెద్దలు వేద ఆశీర్వాదం ఇచ్చారు. శనివారం ఎర్రగొండ పాలెంలో టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, డాక్టరు మన్నె రవీంద్రలను బ్రహ్మణ సంఘం ఘనంగా సన్మానించింది. ఎరిక్షన్ బాబు క్షేమంగా , ఆరోగ్యంగా ఉండాలని ఆశిస్సులు అందించారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం బ్రహ్మణ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీలోకి పది కుటుంబాలు చేరిక

మండలంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల జోరు కొనసాగుతోంది. శనివారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి నివాసంలో పుల్లలచెరువు మండలం ఆర్.ఉమ్మడివరం గ్రామంలో పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. మాగుంట రాఘవరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వై.పాలెంలో నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎరిక్షన్‌బాబును, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసలురెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య, మునగాల రామిరెడి, గజ్వేల్లి భాస్కర్, కే.కుమార్, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంచేపల్లిలో టీడీపీ ఎన్నికల ప్రచారం

హాజరైన నారాయణరెడ్డి, రాఘవరెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న నారాయణరెడ్డి, మాగుంట రాఘవరెడ్డి

పొదిలి, ఏప్రిల్ 13 : మార్కాపురం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి తనయుడు రాఘవరెడ్డి, జనసేన కనిగిరి ఇన్‌చార్జ్ వరికూటి నాగరాజులు కలిసి మండలంలోని కుంచేపల్లి గ్రామం నుంచి ప్రచారం ప్రారంభించారు. ఆ గ్రామంలో వరికుంట్ల అనిల్, కాంతమ్మలతోపాటు గ్రామస్థులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంతోపాటు ఎస్సీ, బీసీ కాలనీ, ఉన్నగురవాయపాలెం గ్రామాల్లో వీరు పర్యటించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ తాను 22 ఏళ్లగా ప్రజా జీవితంలో ఉన్నాన్నారు. మార్కాపురం, పొదిలి పట్టణాలను తన పరిధి మేరకు అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రజల కోసం పోరాడానన్నారు. గతంలో మూడు పర్యాయాలు ఓటమిని చూశానని, ఈ పర్యాయమైన తన సేవలను ప్రజలు గుర్తించాలన్నారు. గ్రామాల్లో మీరు చూపిస్తున్న ఆదరాభిమానాలను ఓటు రూపంలో వేయాలని కోరారు. మాగుంట రాఘవరెడ్డి మాటా డుతూ ఒంగోలు పార్లమెంట్ స్థానానికి తన తండ్రి మాగుంట శ్రీనివాసులురెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి నారాయణరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బలరామిరెడ్డి, బాదం రవి పాల్గొన్నారు

30 కుటుంబాల చేరిక

మండలంలోని సల్లూరు గ్రామానికి చెందిన 30మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు శనివారం కందుల నారాయణరెడ్డి, రాఘవరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఉప్పలపాడు మాజీ సర్పంచ్ ఉలవా గోపి, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాటూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

తర్లుపాడు: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలతో మేలు చేయనున్నట్లు యువ నాయకుడు రోహిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని సూరెపల్లెలో కందుల రోహిత్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.గోపినాథ్‌చౌదరి, నాయకులు తిరుపతయ్య, వి.జాను, నంబుల లక్ష్మయ్య, టీడీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠకు హాజరైన అర్చకులు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 13: మండలంలోని అయినముక్కుల గ్రామంలో శ్రీ పట్టాభి సీతా రామస్వామి దేవాలయంలో ధ్వజస్థంభ ప్రతిష్టా వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కాకర్ల ప్రసాద్, ప్రతిష్టాపకులు పండితశ్రీ సీతారామస్వామి శర్మ పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమాలు,గణపతి పూజలు చేశారు. అనంతరం ధ్వజస్థంభ ప్రతష్ట మహోత్సవ వేడుకలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని క్రతువును తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జై శ్రీరామ అంటూ రామ నామస్మరణలు చేస్తూ భక్తులు పరవశించిపోయారు. అనంతరం అన్నసంతర్పణ గావించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి పెద్దలు రామచంద్రారెడ్డి, గొల్మారు శేఖర్ రెడ్డి, చిట్యాల రామకృష్టారెడ్డి, కోటిరెడ్డి, బోళ్ల బాలకృష్టా రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచకపాలనను అంతమొందించాలి

టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు


ప్రచారం నిర్వహిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, ఏప్రిల్ 13: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను రానున్న ఎన్నికలలో ప్రజలు అంతమొందించాలని వై.పాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. పెద్దారవీడులో శనివారం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడితోనే ఏపీలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తల్లికి వందనం పథకంలో భాగంగా ఒక ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, దీపం పేరుతో ఏడాదికి 3 ఉచిత సిలెండర్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీఅధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జడ్డా రవి, తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీని ఆదరించి గెలిపించాలని ఎర్రగొండపాలెం అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు కుమార్తె చెల్సియా, కొడుకు అజిత్‌లు అన్నారు. త్రిపురాంతకంలోని ఉప్పలగుట్ట, అంబేద్కర్ కాలనీల్లో స్థానిక నాయకులతో కలిసి శనివారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలు పంచుతూ ఓట్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబుకు, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.వలరాజు, ఎం.శ్రీనివాస రెడ్డి, డి.చలమయ్య, వి.ఆంజనేయులు, ఎన్.రాయుడు, అయ్యప్ప, ఎం.రామిరెడ్డి, సీహెచ్.సత్యనారాయణ, పి.అంజిరెడ్డి, పి.వెంకటేశ్వర్లు, జనసేన నాయకుడు ఆవుల మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

నాలుగు కేజీబీవీల్లో జీరో ఉత్తీర్ణత

● ఫలితాల సాధనలో వెనుకంజ
● ఇంటర్ ఫలితాల్లో హైస్కూలు ప్లస్ ధమాల్

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 13 : ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) చతికిలబడ్డాయి. 28 కేజీబీవీల్లో నాలుగు చోట్ల ప్రథమ సంవత్సరం విద్యార్థులు, ఒకచోట ద్వితీయ సంవత్సరం విద్యార్థులందరూ ఫెయిలై జీరో ఉత్తీర్ణత సాధించారు. జిల్లా సగటు ఉత్తీర్ణత కంటే తక్కువతో బాగా వెనుకబడ్డారు. జిల్లాలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు సగటున 67శాతం ఉత్తీర్ణత సాధించగా కేజీబీవీ విద్యార్థులు 22శాతం తక్కువగా కేవలం 45.3శాతం మంది మాత్రమే పాసయ్యారు. పెద్దారవీడు కేజీబీవీలో ఐదుగురు, మర్రిపూడిలో ఐదుగురు, ముండ్లమూరులో 17 మంది, వెలిగండ్లలో 19మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఫెయిలయ్యారు. అర్ధవీడు కేజీబీవీలో 25కుగాను 21 మంది పాసై 84శాతం ఉత్తీర్ణతతో ప్రథమస్థానంలో నిలిచింది. పామూరు కేజీబీవీలో 11 మందికి తొమ్మిదిమంది ఉత్తీర్ణత సాధించి 81శాతం ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన కేజీబీవీలన్నీ జిల్లా సగటు ఉత్తీర్ణత సాధనలో వెనుకబడి ఉన్నాయి. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వెలిగండ్ల కేజీబీవీలో ఒక్కరు కూడా పాస్ కాలేదు. ఈ కళాశాల నుంచి నలుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందరు ఫెయిలయ్యారు. జిల్లాలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 78శాతం మంది ఉత్తీర్ణులు కాగా కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో 25.2శాతం తక్కువగా 52.8శాతం మంది మాత్రమే పాసయ్యారు. పుల్లలచెరువు కేజీబీవీలో 20 మందికి 18 మంది పాసై 90శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. అర్ధవీడు కేజీబీవీలో 17 మందికి 15 మంది పాసై 88.24శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. మిగిలిన వాటిలో జిల్లా సగటు కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించారు. మర్రిపూడిలో 10శాతం, దర్శి, కొనకనమిట్లలో 20శాతం, బీపేటలో 25శాతం, పెద్దారవీడులో 28.57శాతం, కే.బిట్రగుంటలో 40.74శాతం, కలుజువ్వలపాడులో 40.91శాతం, కనిగిరిలో 41.18శాతం, పెదదోర్నాలలో 45.45, ముండ్లమూరులో 47.37శాతం, తాళ్లూరులో 50శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

రెండు ప్లస్‌ల్లో జీరో ఉత్తీర్ణత

ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని హైస్కూలు ప్లస్‌లు ఢమాల్ అన్నాయి. జిల్లాలోని తొమ్మిది స్కూళ్లల్లో రెండుచోట్ల ఒక్క విద్యార్థి కూడా పాసుకాలేదు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సగటున 78శాతం మంది ఉత్తీర్ణులు కాగా హైస్కూలు ప్లస్‌ల్లో 52.1శాతం తక్కువగా కేవలం 25.9శాతం మంది మాత్రమే పాసయ్యారు. హెచ్.నిడమానూరులో ముగ్గురు, కొణిజేడు ప్లస్‌లో 11 మంది పరీక్షకు హాజరు కాగా అందరూ ఫెయిలయ్యారు. దేవరంపాలెంలో ఇద్దరు పరీక్షకు హాజరు కాగా ఇద్దరూ పాసయ్యారు. మిగిలిన ఆరు హైస్కూళ్లలో జిల్లా సగటు కన్నా తక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. పాకలలో ముగ్గురికి ఇద్దరు, కరవదిలో 20కి ఎనిమిది మంది, శీలంవారిపల్లిలో 10కి ముగ్గురు, మైనంపాడులో ఎనిమిదికి ఇద్దరు, కె.ఉప్పలపాడులో 11కు ఇద్దరు, గిద్దలూరులో 13మందికి ఇద్దరు పాసయ్యారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కూడా చతికిలపడ్డారు. జిల్లాలో సగటున 67శాతం మంది ఉత్తీర్ణులు కాగా హైస్కూలు ప్లస్‌లో 41శాతం తక్కువగా 26.21శాతం మంది పాసయ్యారు. జిల్లాలోని తొమ్మిది ప్లస్‌లలో ఒక్కదానిలో కూడా జిల్లా సగటు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. 145 మంది పరీక్షకు హాజరు కాగా కేవలం 38మంది మాత్రమే పాసయ్యారు. పాకలలో 10మందికి ఆరుగురు పాసై 60శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలువగా, కె.ఉప్పలపాడు 11 మందికి ముగ్గురు పాసై 42.86శాతంతో ద్వితీయస్థానంలో నిలిచారు. కొణిజేడులో 16 మందికి ఒక్కరు, హెచ్.నిడమానూరులో 9మందికి ఒకరు, దేవరపాలెంలో 10మందికి ఒకరు, గిద్దలూరులో 32 మందికి నలుగురు, కరవదిలో 14 మందికి ఒకరు, మైనంపాడులో ఎనిమిది మందికి ముగ్గురు, శీలంవారిపల్లిలో 39 మందికి 16 మంది పాసయ్యారు.

కొత్తపట్నం బీచ్‌లో యువకుడు మృతి

దొనకొండ, ఏప్రిల్ 13: కొత్తపట్నం బీచ్‌కు వెళ్లి సముద్రంలో శుక్రవారం అలల ఉధృతికి కొట్టుకుపోయి దొనకొండకు చెందిన యువకుడు మృతిచెందాడు. అందిన సమాచారం మేరకు.. దొనకొండకు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ (35) ఒంగోలులోని రిమ్స్‌లో పనిచేస్తున్నాడు. రంజాన్ పండుగకు దొనకొండలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. శుక్రవారం స్నేహితులతో కొత్తపట్నం బీచ్‌కు వెళ్లారు. సముద్రంలో ఇర్ఫాన్ ఒక్కసారిగా అలల తాకిడికి కొట్టుకుపోతున్న క్రమంలో రక్షించేందుకు ఒకరిద్దరు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. స్థానికంగా ఉన్న ఈతగాళ్ళు ఇర్ఫాన్‌ను గుర్తించి బయటకు తీసి హుటాహుటీన వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇర్ఫాన్ మృతదేహాన్ని శనివారం దొనకొండకు చేరటంతో బంధువులు, స్నేహితులు నివాళులర్పించారు.

టీడీపీలో వైసీపీ శ్రేణులు చేరిక

దొనకొండ, ఏప్రిల్ 13: దొనకొండ మండల టీడీపీ నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి, వల్లపునేని ఆదినారాయణ నేతృత్వంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ శ్రేణులు శనివారం టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ పెమ్మసాని వెంకటేశ్వర్లు, వల్లపునేని సుబ్బారావు, వెంకటస్వామి, భీమనేని వెంకటేశ్వర్లు మరో పది కుటుంబాలకు చెందిన వైసీపీ సానుభూతిపరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వారికి పార్టీ కండవాలు వేసి ఆహ్వానించారు. కూటమి గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

పూరిల్లు దగ్ధం

పీసీపల్లి, ఏప్రిల్ 13: మహిళ వంట చేస్తుండగా నిప్పురవ్వలు పడి పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని నేరేడుపల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన గుండాబత్తిన చినమాలకొండయ్య కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిసునాన్నరు. శనివారం మాలకొండయ్య కోడలు కొండమ్మ కట్టెలపొయ్యిపై వంట చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి పూరింటికి అంటుకున్నాయి. దీంతో భయాందోళనకు గురైన కొండమ్మ బయటకు పరిగెత్తుకుంటూ వచ్చి బయటకు వచ్చింది. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చేలోపే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో లక్షరూపాయల వరకు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారి రామక్రిష్ణ తెలిపారు.

ఇచ్చింది గోరంత.. బాదుడు కొండంత



పామూరులో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న పువ్వాడి

పామూరు, ఏప్రిల్ 13: వైసీపీ పాలనలో ప్రజలకు గోరంత ఇచ్చి కొండంత బాదారని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. బాబు ష్యూరిటీ, భవిషత్తుకు గ్యారెంటి కార్యక్రమాల్లో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై శనివారం టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో పట్టణంలోని అబ్దుల్‌కలాం సెంటర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఒక చేత్తో ఇస్తూ, మరోచేత్తో పన్నుల రూపంలో పిండేశారన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆరు పథకాలు పేదలకు అందాలంటే రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా, ఇర్రి కోటిరెడ్డి, షేక్ గౌస్ బాషా, ఖాజాగౌస్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, సీఎస్‌పురం మండలం అయ్యలూరివారిపల్లి రేగులచిలక గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మాలకొండయ్య, బొప్పూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి లక్ష్మికి మద్దతు

తాళ్లూరు, ఏప్రిల్ 13: కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి తూర్పుగంగవరం గ్రామ నాయుడు యూత్ ఫోర్సు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. యూత్ ఫోర్సు నేత పసుపులేటి సుబ్బారావు ఆధ్వర్యంలో కనిశెట్టి రామలక్ష్మయ్య అధ్యక్షతన టీడీపీ, జనసేన, నాయుడు యూత్ ఫోర్సు కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. వచ్చే ఎన్నికల్లో నాయుడు యూత్ ఫోర్సు ఆధ్వర్యంలోని శ్రేణులు కూటమికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ తీర్మానించారు. కార్యక్రమంలో బద్దుల శ్రీను, తోట ఆంజనేయులు, జల్లిపల్లి వెంకటేశ్వర్లు, భీమని కార్తిక్, కె.వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఎస్వీ విద్యార్థుల హవా



మాదినేని పూజ | ప్రత్యూష | షేక్ మన్సూరా

కనిగిరి, ఏప్రిల్ 13: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పామూరు ఎస్వీ కాలేజి విద్యార్థులు హవా చాటారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఇంటర్ ఫలితాల్లో నియోజకవర్గంలోని పామూరుకు చెందిన ఎస్వీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటం తమకెంతో గర్వకారణంగా ఉందని కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో మాదినేని పూజ 463 మార్కులు, బైపీసీలో ప్రత్యూష 423 మార్కులు, సీఈసీలో సంపతి నందకిషోర్ 441 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో షేక్ మన్సూరా 980 మార్కులు, బైసీపీలో షేక్ నజియా తస్లీమ్ 934 మార్కులు సాధించారు. ప్రతిఏటా తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించటంలో అధ్యాపకుల కృషి అభినందనీయమన్నారు.

అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

పీసీపల్లి, ఏప్రిల్ 13: అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని సూపర్‌సిక్స్ పథకాల ప్రచార సమన్వయ కర్తలు పువ్వాడి నాగరాజు, వీరపనేని పెద్దన్న, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పోతవరం, పెదవరిమడుగు, లింగన్నపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం తిరిగి గాడిలో పడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఉగ్ర నరసింహారెడ్డిని, ఎంపీగా మాగుంట శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో వడ్డెంపూడి వెంకట్(చిన్నా), వెంకటేశ్వరరెడ్డి, దేవరపు కొండపనాయుడు, బద్దిపూడి ఎబినేజరు, జోసెఫ్, ఏనుగంటి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటి పర్యవేక్షణకు బృందాలు ఏర్పాటు

కురిచేడు, ఏప్రిల్ 13: జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకై నాగార్జునసాగర్ జలాశయం నుంచి విడుదల చేసిన సాగర్ నీరు వృథా కాకుండా ఉండేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్ తెలిపారు. శనివారం సాగర్ నీరు కురిచేడు వద్దకు చేరుకోగానే ఆయన రెవెన్యూ, పోలీసు, ఎన్ఎస్‌పీ అధికారులతో కలిసి సాగర్ కాలువపై పర్యటించారు.

కురిచేడు మండలానికి తాగునీరు అందించే అట్లపల్లి రిజర్వాయర్‌కు నీటి సరఫరాను పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో జాన్‌ఇర్విన్ మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ నీటిని ఎవ్వరూ చేపల చెరువులకు, పొలాలకు వినియోగించవద్దని చెప్పారు. కాలువపై ఉన్న ప్రతి మేజర్ వద్ద రెవెన్యూ పోలీస్, ఎన్ఎస్‌పీ అధికారుల బృందం ఉంటుందని తెలిపారు. తాగునీరు దుర్వినియోగమైతే క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీరు ఒంగోలు చేరేంత వరకు జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్, ఎస్సై, ఎన్ఎస్‌పీ అధికారులు ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కురిచేడు, ఏప్రిల్ 13: ఎన్నికల వేళ అక్రమంగా తరలిస్తున్న 35 మద్యం బాటిళ్లను కురిచేడు ఎస్సై శ్రీకాంత్ పట్టుకున్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే సహించేది లేదని చెప్పారు. అటివారిపై క్రిమినల్ కేసులు పెడతామన్నారు. కురిచేడుకు చెందిన ఓవ్యాపారి బయట వ్యక్తులకు అమ్మేందుకు మద్యం బాటిళ్లను దుకాణంలో ఉంచారు. ముందస్తు సమాచారంతో తన బృందంతో ఎస్సై దాడిచేసి పట్టుకున్నారు. మద్యం అమ్మకాల విషయమై దుకాణదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనం

- మరోసారి మోసపోవద్దని కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర పిలుపు
- 175 కుటుంబాలు టీడీపీలో చేరిక

కనిగిరి, ఏప్రిల్ 13: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోలేకపోతే తెలుగుజాతి మనుగడకే కష్టమని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో కనిగిరి మండలంలోని నేలటూరి గొల్లపల్లి, పామూరు మండలం నుచ్చుపొద, సీఎస్‌పురం మండలం కేఅగ్రహారం, వెలిగండ్ల మండలంలోని గోకులం, రామగోపాలపురం గ్రామాలకు చెందిన 175 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా జరిగిన



కనిగిరిలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర



వైసీపీని వీడి టీడీపీలో చేరిన సీఎస్‌పురం మండలం కేఅగ్రహారం గ్రామస్థులు

కార్యక్రమంలో డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. సంక్షేమ పథకాల ముసుగులో మోసం చేస్తూ ఖజానాలోని సొమ్మంతా పథకాలకు మళ్ళించి, తిరిగి ఆ సొమ్మును తన వ్యాపారాల ద్వారా తన జేబుల్లోకి చేర్చుకున్న ఘనాపాటి జగన్ అని అన్నారు. ప్రజలు ఒక్క చాన్స్ ఇస్తేనే రాష్ట్రాన్ని దివాళా తీయించటమే కాకుండా వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేశారని చెప్పారు. మరోసారి చాన్స్ ఇస్తే రాష్ట్ర పరిస్థితి ఎంత దుర్భరంగా మారుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వైసీపీ నేతలు మళ్ళీ ఓట్ల కోసం కల్లబొల్లి మాటలు, హామీలు ఇస్తున్నారన్నారు. వాటిని నమ్మవద్దని డాక్టర్ ఉగ్ర సూచించారు. వైసీపీ ఐదేళ్ళ పాలనలో ఏ పరిశ్రమను తీసుకురాలేదన్నారు. జగన్ వైఖరితో పారిశ్రామిక వేత్తలు పారిపోయారని చెప్పారు. చంద్రబాబును సీఎంగా చేసుకుంటే పారిశ్రా మికంగా రాష్ట్రం తిరిగి అభివృద్ధి చెందటంతో పాటు లక్షలాది మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. కనిగిరి అభివృద్ధి కోసం తాను సంకల్పించిన ఇంటింటికి తాగునీరు, వెలుగొండ జలాలు, నిమ్స్, ట్రిపుల్ ఐఐటీ, నడికుడి రైల్వేలైన్ పూర్తి వంటి వాటిని సాధించుకు వస్తానన్నారు. తొలుత పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు వేసి సాదరం గా ఆహ్వానించారు.

కార్యక్రమంలో టీడీపీ వెలిగండ్ల మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, పామూరు మాజీ ఎంపీపీ టి.అల్లూరయ్య, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, బైరెడ్డి జయరామిరెడ్డి, పొంగులేటి సూరి తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

పామూరు ఏప్రిల్ 13: బీసీల సంక్షేమానికి రూ.లక్షన్నర కోట్ల బడ్జెట్‌తో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని కూటమి అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తిరగలదిన్నె గ్రామంలో జయహో బీసీ సభకు ఎం. గంగరాజు యాదవ్ అధ్యక్షత వహించారు.



పామూరు: ఉగ్రను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉగ్ర మాట్లాడుతు పరదాల చాటున పరిపాలన సాగించిన వైసీపీ పాలకులు నవరత్నాల పేరుతో ఉన్న పథకాలను రద్దుచేశారన్నారు. ఫలితంగా అన్నిరకాలుగా బీసీ సామాజిక వర్గం నష్టపోయారన్నారు. వైసీపీ నాయకులు కుల రాజకీయాలకు తెరలేపుతున్నారని, వారి మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. తాను కులాలకు కన్నా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

ఈసందర్భంగా మాజీ సర్పంచ్ ఒంటేలు నాగేశ్వరరావు, సుధాకరరెడ్డితోపాటు 35 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీ లో చేరారు. అనంతరం ఉగ్రను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు జి.దశరథరామయ్య, ఆవుల నాగేశ్వరరావు, ఎంపీటీసీలు బొట్ల నాగార్జున, బొల్లా నరసింహారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆరేకొండ హరిప్రసాద్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య జనసేన నాయకుడు షేక్ సందాని బాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక రంగం కుదేల్

- వైసీపీ అరాచకంతో తరలిపోయిన పరిశ్రమలు
- విజన్ కల్గిన నాయకుడు చంద్రబాబు
- కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 13: విజన్ కల్గిన నాయకుడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శిలో శనివారం ఐటీ ఉద్యోగులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో ఐటెక్ సిటీ ఏర్పాటు చేయటంవలనే లక్షలాది మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని విమర్శించారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం



లక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరిన దొనకొండ మండలం గంగదేవిపల్లి వాసులు

అధికారంలోకి వస్తేనే ఐటీ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. దర్శి నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఐటీ ఉద్యోగులు టీడీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. జిల్లెళ్ళమూడి వెంకట్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎన్ఆర్ఐల సహకారంతో వంద వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ లలిత్‌సాగర్, మాగుంట చందన, కోళ్ల అశోక్, జిల్లెళ్ళమూడి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయటానికే వచ్చా.. ఆశీర్వదించండి

ముండ్లమూరు, ఏప్రిల్ 13: ప్రజా సేవ చేయటానికే రాజకీయాల్లోకి వచ్చానని.. మీ ఆడ బిడ్డగా ఆదరించాలని కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని ఈదర, భీమవరం, బొప్పూడివారిపాలెంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. మహిళలను, యువతను ప్రోత్సహించేలనే ఉద్దేశంతో చంద్రబాబు తనకు అవకాశం కల్పించారన్నారు. ముండ్లమూరు మండలంలో ఆగిపోయిన పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, భీమవరం, ఈదర, బొప్పూడివారి పాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన గొట్టిపాటి లక్ష్మికి ఆయా గ్రామాల మహిళలు పెద్దు ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, వీరపనేని రంగా, భీమనేని నాసరయ్య, కుంచపు ఏడుకొండలు, మక్కెన రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

వంద కుటుంబాలు టీడీపీలో చేరిక

దర్శి, ఏప్రిల్ 13: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమనే ఉద్దేశంతో వైసీపీ నుంచి భారీగా చేరుతున్నారని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో దొనకొండ మండలం గంగదేవిపల్లికి చెందిన వంద కుటుంబాలు బొరిగొర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండవాలు కప్పి కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి, నూకసాని బాలాజీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే అన్నీ వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. వైసీపీ అరాచక పాలనతో అన్నివర్గాల ప్రజలు విసుగుచెందారని అన్నారు. ఆ పార్టీకి చరమగీతం పాడేందుకు టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచుగా మీవద్దకు వచ్చా..

దర్శి, ఏప్రిల్ 13: ఆడపడుచుగా మీ వద్దకు వచ్చా.. ఆదరించి గెలిపించాలని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి నిస్వార్థ సేవలందిస్తానని చెప్పారు. శనివారం దర్శి పట్టణంలోని 10వ వార్డులో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత లంకోజనపల్లి రోడ్డులోని సాయిపథమ్‌లో సాయిబాబాకు పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఆప్యాయంగా పలకరిస్తూ వచ్చే ఎన్నికల్లో అత్యంత మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పమిడి రమేష్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, పసుపులేటి శేషమ్మ, బీజేపీ నేత మాడపాకుల శ్రీనివాసరావు, జనసేన నేత సీహెచ్ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఐటీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాగుంట చందన తదితరులు

టీడీపీలో చేరిన సుబ్బారెడ్డి

ముండ్లమూరు, ఏప్రిల్ 13: మండలంలోని మారెళ్ళ గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు మట్టా సుబ్బారెడ్డి శనివారం టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు ఆయన వర్గీయులు కూడా పార్టీలో చేరారు. సుబ్బారెడ్డి చేరికతో తెలుగుదేశం పార్టీకి మారెళ్ళలో పూర్వ వైభవం వచ్చే అవకాశాలు కనపడుతున్నాయి.

కురిచేడుకు చేరిన సాగర్ జలాలు

కురిచేడు, ఏప్రిల్ 13: జిల్లా ప్రజల తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాశయం నుంచి విడుదల చేసిన తాగునీరు శనివారం ఉదయం 9 గంటల సమయంలో కురిచేడుకు చేరాయి. కురిచేడు పక్కనే ఉన్న దర్శి బ్రాంచ్ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద సాయంత్రం 5 గంటల సమయంలో 900 క్యూసెక్కుల నీటి పరిమాణం నమోదవుతుంది. తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని ఇతర అవసరాల కోసం వినియోగించవద్దంటూ ఎన్ఎస్‌పీ అధికారులు సూచిస్తున్నారు. పదిరోజుల పాటు సాగర్ కాలువలో నీరు ప్రవహిస్తుందని తెలిపారు. మంచినీటి చెరువులను నింపుకోవాలని అధికారులు సూచించారు. తాగునీరు వృథా కాకుండా తగు చర్యలు తీసుకోనున్నట్టు ఎన్ఎస్‌పీ డీఈ తెలిపారు.



సాగర కాలువలో ప్రవహిస్తున్న సాగర్ నీరు

16న దర్శిలో జయహో బీసీ సదస్సు

దర్శి, ఏప్రిల్ 13: దర్శి పట్టణంలో ఈ నెల 16వ తేది సాయంత్రం నియోజకవర్గ స్థాయి జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో బీసీలపై దాడులు పెరిగాయన్నారు. ఎంతోమంది హత్యకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలు వచ్చేసరికి వైసీపీ పాలకులు కల్లబొల్లి మాటలు చెప్పి కపట ప్రేమ చూపుతున్నారని అన్నారు. బీసీల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. దర్శిలో నిర్వహించే సదస్సుకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, బీసీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ బీసీలను అన్నివిధాలుగా ఆదరించి రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని చెప్పారు. చంద్రబాబు ఆయన అడుగుజాడల్లో నడుస్తూ బీసీలకు ఎన్నో ఉన్నత పదవుల కట్టబెట్టారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ లలిత్ సాగర్, మోడి వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవకులుగా ఉన్నాం.. ఆదరించండి

దొనకొండ, ఏప్రిల్ 13: జిల్లాలోని అన్నిప్రాంతాల్లో వివిధరకాలుగా సేవలందిస్తూ సేవకులుగా పనిచేస్తున్న తమ కుటుంబాన్ని ఆదరించాలని మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందనరెడ్డి మహిళలను కోరారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దొనకొండలో మాగుంట ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలనే లక్ష్యంతో మాగుంట ట్రస్టు ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ముందుగా మహిళలు చందనరెడ్డిని ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి, పులిమి రమణాయాదవ్, కామేపల్లి నారాయణమ్మ, కొమ్మతోటి సుబ్బారావు, దుగ్గెంపూడి చెంచయ్య, వైకే చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

తాళ్లూరు, ఏప్రిల్ 13: మహిళలు వృత్తి రంగాల్లో రాణించి తమ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు మాగుంట కుటుంబం అండగా ఉంటుందని టీడీపీ యువనేత మాగుంట రాఘవరెడ్డి సతీమణి చందన తెలిపారు. శనివారం తాళ్లూరు, తూర్పుగంగవరంలోని కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విజయపథంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమాల్లో ఐ.శ్రీనివాసరెడ్డి, ప్రశాంతి, కృష్ణారెడ్డి, గొల్లపూడి వేణుబాబు, వీసీరెడ్డి, తూము శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాగుంట చందనరెడ్డిని సన్మానిస్తున్న మహిళలు


ప్రత్తిపాడు సభకు హాజరైన జన సందోహం



రాజధాని.. అమరావతే

ప్రజాగళం.. నూతనోత్తేజం



- ప్రజలు గెలవాలి.. జగన్ పోవాలి
- 30 రోజుల్లో రాష్ట్రంలో మారనున్న చరిత్ర
- జూన్ 4న జగనాసుర వధ.. అమరావతి వేడుక
- మళ్లీ జగన్‌కు ఓటేస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్లే
- అమరావతి రైతులు, మహిళల పోరాటం అమోఘం
- తాడికొండ, ప్రత్తిపాడు ప్రజాగళం సభల్లో చంద్రబాబు

ప్రత్తిపాడులో కండువాలు ఊపుతూ ఉత్సాహపరుస్తున్న చంద్రబాబు, రామాంజనేయులు, పెమ్మసాని



తాడికొండలో వేదికపై ప్రసంగిస్తున్న పెమ్మసాని, శ్రావణ్‌కుమార్


తాడికొండ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

తాడికొండ, ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: ప్రపంచంలో తెలుగు వారు గర్వపడేలా రాజధాని అమరావతిని నిర్మిస్తా. అమరావతే ఆంధ్రుల రాజధాని. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే రోజే అమరావతే రాజధాని అని మీరంతా వేడుక జరుపుకునే రోజు. అదేరోజున జగనాసుర వధ.. అమరావతి రక్షణ రెండూ జరుగుతాయి. రాష్ట్రాన్ని కాపాడుకోవాలి. ప్రజలు గెలవాలి.. జగన్ పోవాలి.. అని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తాడికొండ, ప్రత్తిపాడుల్లో జరిగిన ప్రజాగళం సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌కు ఓటు వేస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్లేనన్నారు. మరో 30 రోజుల్లో రాష్ట్రంలో చరిత్ర మారుతుందన్నారు. రాజధాని అంటే ఆత్మ గౌరవం.. ఆత్మవిశ్వాసం.. గర్వంగా చెప్పుకునే ప్రజల ఆస్తి అన్నారు. హైదరాబాద్‌కు దీటుగా, దేశంలో నెంబర్ వన్‌గా, ప్రపంచంలో గొప్ప నగరాల్లో ఒకటిగా చెప్పుకునే రాజధానిని నిర్మించాలనుకున్నా కానీ మూడు రాజధానులంటూ అమరావతిని జగన్ సర్వనాశం చేశారన్నారు. విట్, అమృత, ఎస్‌ఆర్‌ఎం వంటి ప్రపంచస్థాయి విద్యాసంస్థలతో అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా మార్చాలనుకుంటే జగన్ సర్వనాశనం చేశాడన్నారు. అమరావతి రైతులు, మహిళల పోరాటం అమోఘం.. వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. 3 వేల కేసులు.. అడుగడుగునా అవమానాలు, పోలీసుల హింస, జైల్లో పెట్టి వేధింపులు.. ఎన్ని చేసినా పోరాటం ఆపలేదని, వారి పోరాటంతోనే అమరావతి గెలిచింది.. నిలిచిందన్నారు. రాష్ట్రం బాగుండాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు.

- తాడికొండ, ప్రత్తిపాడు పసుపుమయం
- చంద్రబాబు రాకతో పులకించిన జనం

ప్రజల కేరింతలు.. తెలుగు తమ్ముళ్ల జయజయధ్వానాలు.. యువత సందడి.. మహిళల హారుతులు.. పసుపు జెండాల రెపరెపల మధ్య శనివారం తాడికొండ, ప్రత్తిపాడుల్లో చంద్రబాబు ప్రజాగళం కార్యక్రమం జరిగింది. రోడ్ షో, బహిరంగ సభలకు జనం పోటెత్తారు. చంద్రబాబు పర్యటన మార్గాలు జనాలతో కిటకిటలాడాయి. ప్రజాగళంతో కూటమి పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది. నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన ప్రజాగళం కార్యక్రమాలకు సమీప మండల గ్రామాల నుంచి భారీగా జనం ఉత్సాహంగా తరలివచ్చారు. చంద్రబాబును చూసిన ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. తాడికొండ, ప్రత్తిపాడు ప్రధాన కూడళ్లు పసుపు జెండాలు, ఫ్లెక్సీలతో నిండిపోయాయి. హెలికాప్టర్‌లో తాడికొండకు వచ్చిన చంద్రబాబుకు టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. హెలి ప్యాడ్ నుంచి ప్రజలకు అభివాదం చేసుకుంటూ తాడికొండలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సభా స్థలి వద్దకు చేరుకుని ప్రసంగించారు. ఈ సభకు రాజధాని పరిధిలోని గ్రామాల నుంచి మహిళలు, రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా చంద్రబాబు కోసం ఎదురు చూశారు. సభలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు జెండాలతో మద్దతు తెలిపారు. సభ అనంతరం చంద్రబాబు హెలికాప్టర్‌లో ప్రత్తిపాడుకు చేరుకున్నారు. చంద్రబాబు రాకతో ప్రత్తిపాడు పులకించిపోయింది. ఆయన రాక సందర్భంగా ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో మధ్యాహ్నం నుంచే సందడి నెలకొంది. ఆయా సభలో చంద్రబాబు తమ్ముళ్లా అంటూ పలకరించిన తీరు.. నా ఆడబిడ్డలు అంటూ చూపిన ఆప్యాయతతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఆయా సభల్లో గుంటూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ, ప్రత్తిపాడు అభ్యర్థులు తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మతో అలింగనం


చంద్రన్నకు దిష్టి తీస్తూ..


ప్రత్తిపాడులో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ సీఎం చంద్రబాబు నాయుడు


తాడికొండలో సభలో మహిళల అభివాదం


ప్రత్తిపాడు సభలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు



ప్రత్తిపాడులో మిద్దెలపైకెక్కిన అభిమానులు


గజమాలతో స్వాగతం

సమన్వయంతో సత్తా చాటాలి

- అశ్రద్ధ వీడాలి.. స్పీడ్ పెంచాలి
- విజయమే ధ్యేయంగా ముందుకెళ్లాలి
- కూటమి నేతలతో రేపల్లెలో చంద్రబాబు సమీక్ష

రేపల్లె/బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎక్కడా ఎటువంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వొద్దు. సమన్వయంతో పనిచేయాలి. విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలి. భారీ మెజార్టీ కోసం సత్తాచాటాలి. గడువు చాలా స్వల్పంగా ఉంది. గెలుపు విషయంలో అతి ధీమా పనికిరాదు. వైసీపీ చేసిన విధ్వంసాన్ని ప్రతి ఒక్క ఓటరును కలిసి వివరించాలి.. అని టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్ల లోక్‌సభ పరిధిలోని కూటమి నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రజాగళం సభ అనంతరం శుక్రవారం రాత్రి రేపల్లె టీడీపీ కార్యాలయంలో బస చేసిన ఆయన శనివారం కూటమి నేతలతో ఎన్నికలపై సమీక్షించారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఆయా నేతల పనితీరుపై తన దగ్గరున్న నివేదికల ఆధారంగా వారితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అశ్రద్ధ వద్దని, మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని కొందరు నేతలను సున్నితంగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. ప్రజాగళం సభల విజయవంతంపై సంతృప్తి వ్యక్తం చేసిన చంద్రబాబు ప్రజలతో మరింత మమేకం అవ్వాల్సిన అవసరం ఉందని నేతలకు చెప్పారు. నియోజకవర్గాల్లో చేపట్టే కార్యక్రమాల్లో జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకోవాలని టీడీపీ నాయకులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఒక కుటుంబ సభ్యుల్లా తారతమ్యాలు లేకుండా కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చెయ్యాలన్నారు. ఎన్నికలకు ఇక 30 రోజులే గడువు ఉందని, అందరూ కష్టపడాలన్నారు. ప్రతి గ్రామంలో విస్తృతంగా పర్యటించి ఓటర్లను చైతన్యవంతులను చేసి పోలింగ్ కేంద్రాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగన్‌రెడ్డి పాలన అవినీతి అక్రమాలతో పాటు మోపిన బారాలను ప్రజలకు వివరించాలన్నారు. రేపల్లెలో గతంలో హత్యకు గురైన బాలుడు అమర్నాథ్‌గౌడ్ సోదరి హేమశ్రీ కుటుంబ సభ్యులతో చంద్రబాబును కలవగా ఆమె చదువు బాధ్యతలు తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. రేపల్లెకు చెందిన మన్నె శ్రీనివాసరావు తాను రచించిన ఎన్టీఆర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని చంద్రబాబుకు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు రేపల్లె నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు గుంటూరు జిల్లా తాడికొండలో జరిగే ప్రజాగళం సభకు తరలివెళ్లారు.


బాపట్ల పార్లమెంట్ పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో చంద్రబాబు సమీక్ష

నేడు తెనాలికి పవన్‌కల్యాణ్

- వారాహిపై పట్టణంలో రోడ్ షో
- సభలో ఉమ్మడి మ్యానిఫెస్టో విడుదల
- ఏర్పాట్లను పరిశీలించిన మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 13: గతంలో వాయిదా పడిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన తాజాగా ఖరారైనట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పవన్‌కల్యాణ్ తెనాలి రానున్నారు. ఆయన తెనాలి రావడం ఇదే తొలిసారి కావడంతో పవన్ అభిమానులు, జనసేన శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్ ద్వారా తెనాలి సుల్తానాబాద్‌లోని హెలీప్యాడ్ వద్దకు పవన్ చేరుకుంటారని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అక్కడి నుంచి వారాహి వాహనంపై పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌తో కలిసి చెంచుపేట, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదగా మహాత్మాగాంధీ మున్సిపల్ మార్కెట్లోని పురవేదిక వద్దకు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం జరిగే బహిరంగ సభలో పవన్ ప్రసంగించనున్నారు. పవన్‌కల్యాణ్ పర్యటన, బహిరంగసభను ఒక పండుగలాగా విజయవంతం చేస్తామని మనోహర్ తెలిపారు. ఈ సభకు గుంటూరు, బాపట్ల, కృష్ణ జిల్లాల నుంచి ఉమ్మడి పార్టీల నాయకులు, శ్రేణులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరవుతారని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవన్ పర్యటనకు సంబంధించి ఏర్పా టు చేసిన హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను శనివారం కూటమి నేతలతో కలిసి మనోహర్ పరిశీలించారు. పవన్ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులను ఆయన కోరారు. తాము అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించిన ఉమ్మడి మ్యానిఫెస్టోను సభలో పవన్‌కల్యాణ్ ప్రజల ముందుంచుతారని తెలిపారు. కార్మికులు, రైతులు, కౌలు రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి చేపట్టబోయే పరిష్కారాలను కూడా ప్రస్తావిస్తారన్నారు.


సభాప్రాంగణం వద్దకు ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి వస్తున్న మనోహర్

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

బాపట్ల, ఏప్రిల్ 13: వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సాగర్ నీటి విడుదల, విద్యుత్ సరఫరా, ఉపాధి పథకం అమలు తీరుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో శనివారం బాపట్ల నుంచి ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించారు. పశ్చిమ కృష్ణాడెల్టా, సాగర్ కాల్వల ద్వారా 17 వరకు జిల్లాకు తాగునీరు విడుదల అవుతుందని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన చెరువులను నూరుశాతం నింపుకోవాలన్నారు. తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని పొలాలు, చేపల చెరువులకు మళ్లించకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కాల్వలపై పోలీసులు గస్తీ తిరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీను కలెక్టర్ ఆదే శించారు. గుండ్లకమ్మకు నీరు విడుదల చేస్తామన్నారు. యద్దనపూడి, చుండూరు, సంతమాగులూరు, చెరుకుపల్లి, చినగం జాం మండలాల్లో ఉపాధి పనుల్లో పురోగతి లేకపోవడంపై ఎంపీడీవోలను కలెక్టర్ ప్రశ్నించారు.


కలెక్టర్ పి.రంజిత్‌బాషా



వాడరేవు సముద్రతీరంలో నిలిపిన బోట్లు

రేపటి నుంచి సముద్రంలో వేటకు విరామం

చీరాల, ఏప్రిల్ 13: సముద్రంలో వేటకు ఈనెల 15 నుంచి విరామం ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని మత్స్యశాఖ ఏవో(కారంచేడు) ఎం.రవీంద్ర శుక్రవారం తెలిపారు. జూన్ 14 వరకు సముద్రంలో వేట నిషిద్ధమన్నారు. సముద్రంలో చేపలు, రొయ్యల పునరుత్పత్తికి భంగం కలగకుండా ప్రతి ఏడాది రెండు నెలల పాటు వేటకు విరామం ప్రకటిస్తారని చెప్పారు. ఈ విరామం సమయంలో బోట్ల యజమానులు ఎవరైనా సముద్రంలో వేటకు వెళితే వారు వేటాడిన మత్స్యసంపదను స్వాధీనం చేసుకోవటంతో పాటు, ప్రభుత్వపరంగా మత్స్యకారులకు అందించే పథకాల ఫలాలు వర్తించకుండా చర్యలు చేపడతారన్నారు. ఇదిలా ఉంటే సాధారణంగా వేట విరామం సమయంలో మత్స్యకారులు బోట్లు, వలలు మరమ్మతులు చేసుకుంటారు. ఆ పనులను ఉపాధిహామీ పనుల్లో చేర్చాలని ఎప్పటి నుంచే మత్స్యకారులు కోరుతున్నారు. అయితే అది ఆచరణకు నోచుకోవటం లేదు. ఈ ఏడాదన్నా మత్స్యకారుల బోట్ల మరమ్మతులు, వలల అల్లిక పనులకు సంబంధించి ఉపాధి పనుల్లో చేర్చితే తమకు ఎంతో మేలు చేసినవారవుతారని అధికారులను కోరుతున్నారు.



ఈవీఎంలను నియోజకవర్గాలకు తరలించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించిన ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఈవీఎంలు నియోజకవర్గాలకు తరలింపు

● ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 13: ర్యాండమైజేషన్ ప్రకారం ఈవీఎంలను జిల్లాలోని నియోజకవర్గాలకు పంపుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం నియోజకవర్గాలకు ఈవీఎంల తరలింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం రాజకీయ నేతల సమక్షంలో నిర్వహించామన్నారు. అందుకు అనుగుణంగా శనివారం పార్లమెంట్ నియోజకవర్గానివి, ఆదివారం జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీలకు సంబంధించిన ఈవీఎంలను ర్యాండమైజేషన్ ప్రకారం తరలిస్తామన్నారు. ఈ మొత్తం ప్రక్రియను సీసీటీవీల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వివరాలను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ఈఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈవీఎంలకు సరికొత్త నెంబర్లు కేటాయించి పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ఆయా నియోజకవర్గాల్లోని తాత్కాలిక స్ట్రాంగ్‌రూములకు తరలిస్తామన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నియోజకవర్గ స్థాయిలో రెండో విడత ర్యాండమైజేషన్ చేసి పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఎంలను తరలిస్తామన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో శ్రీలత, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వైసీపీ ఎన్నికల ప్రచారం లో పాల్గొన్న బూసిబాబు



వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న గోపి

వైసీపీ ప్రచారంలో మున్సిపల్ కాంట్రాక్ట్ సిబ్బంది

● అధికారులకు టీడీపీ నేతల ఫిర్యాదు ● వేటుకు రంగం సిద్ధం

అద్దంకి, ఏప్రిల్ 13 : మున్సిపల్ కాంట్రాక్ట్ సిబ్బంది వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అద్దంకి పట్టణంలోని 8వ వార్డులో శుక్రవారం రాత్రి వైసీపీ అద్దంకి నియోజకవర్గ అభ్యర్థి పాణెం చిన హనిమిరెడ్డి తరఫున సోదరుడు నరసింహారెడ్డితో పాటు పలువురు వైసీపీ నేతలు ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో అద్దంకి మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ సిబ్బందిగా పనిచేస్తున్న బూసిబాబు, గోపి పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు శనివారం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఇద్దరు కాంట్రాక్ట్ సిబ్బందిని తొలగించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తుంది. మున్సిపల్ కాంట్రాక్ట్ సిబ్బంది వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం చర్చకు దారితీసింది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణను వివరణ కోరగా ఇంకా తనకు నివేదిక అందలేదని తెలిపారు.

19 న గొట్టిపాటి నామినేషన్

● భారీగా హాజరు కానున్న టీడీపీ శ్రేణులు

అద్దంకి, ఏప్రిల్ 13 :ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈనెల 19వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. 19వ తేదీన అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేయనున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు గొట్టిపాటి నామినేషన్‌కు భారీగా తరలివచ్చేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వరుసగా నాలుగుసార్లు వరుస విజయాలు సొంతం చేసుకున్న గొట్టిపాటి రవికుమార్ ఐదోసారి నామినేషన్ వేయనున్నారు.

వలపర్ల వైసీపీలో గ్రూపు గొడవలు

● ఆర్యవైశ్య నాయకుడిపై యువకుడు చాకుతో దాడికి ప్రయత్నం

మార్టూరు, ఏప్రిల్ 13 : మండలంలోని వలపర్ల గ్రామంలో వైసీపీ పార్టీలో గ్రూపుల మధ్య విభేదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. శనివారం మధ్యాహ్నం ఆర్యవైశ్య నాయకుడు తవ్వా రవికుమార్‌పై యువకుడు చాకుతో దాడికి ప్రయత్నించడం ఇందుకు నిదర్శనం. వివరాల్లోకి వెళితే.. వారిద్దరూ వైసీపీకి చెందిన వారు. వారిలో ఒక వ్యక్తి ఆర్య వైశ్య సంఘ నాయకుడు తవ్వా రవికుమార్. గ్రామంలో ఉన్న పెట్రోలు బంకును లీజుకు తీసుకొని ఆయన వ్యాపారం చేస్తున్నారు. మరో యువకుడు గతంలో ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేసిన యువకుడు. మధ్యాహ్నం పెట్రోలు బంకులో ఉన్న రవికుమార్ వద్దకు యువకుడు ప్రగడ నరేష్ ద్విచక్రవాహనంపై వచ్చాడు. పార్టీ పరంగా వారిద్దరి మధ్యా వివాదం జరిగింది. తరువాత తోపులాట జరిగినట్లు తెలిసింది. అనంతరం యువకుడు ద్విచక్రవాహనంలో ఉన్న చాకును తీసి రవికుమార్‌పై దాడికి ప్రయత్నించాడు. దాంతో పెట్రోలు బంక్ వద్ద ఉన్న సిబ్బంది, పెట్రోలు కొట్టించుకోవడానికి వచ్చిన ద్విచక్రవాహనదారులు యువకుడిని అడ్డగించడంతో రవికుమార్ క్షేమంగా బయటపడ్డారు. అనంతరం యువకుడు వెళ్లిపోగా, రవికుమార్ తన సామాజిక వర్గానికి చెందిన వారితో మార్టూరులోని స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఏఎస్ఐ సైదాను వివరణ కోరగా వలపర్ల గ్రామానికి చెందిన తవ్వా రవికుమార్ గ్రామానికి చెందిన ప్రగడ నరేష్ అనే యువకుడు తనను చాకుతో దాడి చేయడానికి ప్రయత్నించినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రౌడీరాజ్యం!

ఏకపక్షంగా సహకరిస్తున్న పోలీసులు
ఇలాగైతే ప్రశాంతంగా ఎన్నికలు జరిగేనా?
వైసీపీ మూకల దాడులతో అనుమానాలు
తాజాగా ఒంగోలు ఘటనతో మరింత ఆందోళన
టీడీపీ వారిపై దాడి, ఆపై అక్రమ కేసులు
ఐదేళ్లుగా ఇదేవిధంగా అరాచక చర్యలు
ఎస్పీ మారినా వెనక్కితగ్గని అరాచకవాదులు
ఒంగోలులో పోలీసు అధికారులపై గతంలోనే దామచర్ల పిటిషన్
తాజాగా సింగరాయకొండలో సీఈఓకు ఫిర్యాదు
యంత్రాంగం నుంచి భరోసా కోరుతున్న ప్రజానీకం
ఆ దిశగా ఉన్నతాధికారుల చర్యలు ఉంటేనే సజావుగా ప్రక్రియ

వైసీపీ రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయి. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు, ఆపై దాడులు ఎక్కువయ్యాయి. పోలీసులు వారికి వంతపాడుతూ ప్రతిపక్షాల వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం వంటి చర్యలకు తెగబడుతున్నారు. తాజాగా ఒంగోలులో వైసీపీ మూకలు వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనలో ఒంగోలు పోలీసుల తీరుపై ప్రధాన ప్రతిపక్షం తీవ్ర ఆరోపణలు, విమర్శలు చేస్తోంది. ఆ మాటకు వస్తే ఇక్కడి పోలీసు అధికారులపై టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ గతంలోనే ఏకంగా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అనంతరం ఇక్కడి ఎస్పీని ఎన్నికల సంఘం బదిలీ చేసి కొత్త అధికారిని నియమించిన తర్వాత కూడా ఒంగోలులో బాలినేని అనుచరులు బరితెగించి దాడులు చేస్తున్నారు. మరోనెల రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండగా జిల్లాలో ఆ ఎన్నికలు ప్రశాంతంగా ఏ మేరకు సాధ్యమన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఎన్నికల సమయంలో పోలీసుల తీరు ఏలా ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఒంగోలు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకం ఎన్నికల వేళ కొనసాగుతోంది. ఆ పార్టీ శ్రేణులమంటూ కిరాయి రౌడీమూకలు రోడ్డుపడ్డాయి. ఆ పార్టీ అభ్యర్థులు, వారి కుటుంబసభ్యుల ప్రచారంలో వారే అంతా తామై వ్యవహరిస్తున్నారు. పూర్తిగా మద్యం మత్తులో ఉండి ఇదేమని అడిగిన వారిపై దౌర్జన్యాని పాల్పడుతున్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో దౌర్జన్యకర పాలన సాగించినట్లే జిల్లాలోనూ ఆ పార్టీ తాజాగా వ్యవహరిస్తోంది. ఇందుకు ఒంగోలు ఘటనే నిదర్శనం. వివరాల్లోకి వెళితే.. 2019లో సాధారణ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగానే సాగాయి. అప్పుడు మొత్తం 12అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికలను ఇక్కడి అధికారులు పర్యవేక్షించారు. దాదాపు మూడు వేల పోలింగ్ కేంద్రాలు అప్పట్లో ఉండగా ఒక్కచోట మాత్రమే రీపోలింగ్ జరిగింది. మిగతా ఎక్కడ ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ప్రస్తుతం ఒంగోలు పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలు మాత్రమే జిల్లా పరిధిలో ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో జరిగిన ఘటనలు, జరుగుతున్న పరిణామాలతో ఈసారి ఎన్నికలు ఏ మేరకు ప్రశాంతంగా సాగుతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మచ్చుకు కొన్ని పరిశీలిస్తే.. వైపాలెంలో స్థిరాస్తి వ్యాపారి హత్య, ఒంగోలులో సుబ్బారావు గుప్తాపై దాడి, దోర్నాల మండలంలో సర్పంచ్ భర్త హత్య, తర్లుపాడులో అక్రమఇసుక బాగోతాన్ని ప్రశ్నించిన యువకునిపై దాడి, ఎస్ఎన్‌పాడు తహసీల్దార్‌పై ఆఫీసులోనే వైసీపీ నేత దాడి, సీఎస్ పురంలో ఉపాధి పథకం అవినీతిని ప్రశ్నించిన పాస్టర్‌ను అంతమొందించడం, బీపేట మండలంలో పారిశుధ్య పరిస్థితి ప్రశ్నించిన జనసేన కార్యకర్తకు వేధింపులు ఆపై ఆత్మహత్య, కొండపి సెగ్మెంట్‌లో అనేకమార్లు ఏకంగా ఎమ్మెల్యే స్వామిపై వైసీపీ నేతలు దౌర్జన్యం, టంగుటూరులో అంగన్‌వాడీ కార్యకర్త హత్య ఇలా పలుచోట్ల పెద్దఎత్తున అక్రమాలు, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయి. ఆయా ఘటనల్లో పోలీసులు అధికారపార్టీకి కొమ్ముకాశారన్న విమర్శలు వచ్చాయి.



టీడీపీ నేత మోహనరావుపై మూకుమ్మడిగా దాడిచేస్తున్న వైసీపీ రౌడీలు (ఫైల్)

బెదిరింపులు, దాడులు, హత్య

ప్రస్తుత ఎన్నికల ప్రక్రియ ప్రారంభంలోనే గిద్దలూరు నియోజకవర్గంలో మునయ్య అనే టీడీపీ కార్యకర్త హత్యోదంతం మరింత సంచలనం కలిగించింది. గతనెలలో మేదరమెట్ల వద్ద జరిగిన సీఎం సిద్ధం సభకు రాకపోగా టీడీపీకి అనుకూలంగా జనాన్ని కూడగడుతున్నడన్న అక్కసుతో అక్కడ మునయ్యను వైసీపీ నేతలు మట్టుపెట్టగా పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఇదేవిషయంలో సీరియస్ అయిన ఎన్నికల సంఘం ఏకంగా అప్పటి ఎస్పీ పరమేశ్వరరెడ్డిని తన కార్యాలయానికి పిలిపించి వివరణ కోరింది. తదనంతరం ఆయన బదిలీ కాగా ఆయన స్థానంలో గరుడ సుమిత్ సునీల్ వచ్చారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, ఆరోపణలతో ఏకంగా ఎస్పీ బదిలీ అయినా జిల్లాలో ఇటు వైసీపీ శ్రేణులుగాని, పోలీసుల తీరుకాని మారిన పరిస్థితి లేదు. అందుకు గత బుధవారం రాత్రి వైసీపీ కార్యకర్తలు, ప్రత్యేకించి ఇక్కడి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరులు బరితెగించి సామాన్య కుటుంబంపైనా, టీడీపీ నేతలపైన చేసిన దాడే నిదర్శనం.

దాడులు ఆపై కేసులు

సమతానగర్, రిమ్స్ వద్ద చేసిన దాడులతో ఆగక ఏకంగా టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు కూడా పెట్టడాన్ని అందరూ ఖండిస్తున్నారు. నగరంలోని పోలీసుల అధికారుల తీరు ప్రతిపక్ష టీడీపీ శ్రేణులే కాక సామాన్య ప్రజల్లోనూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సదరు పోలీసు అధికారులను మార్చాలని గతంలోనే టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో పిటిషన్ కూడా వేశారు. ఇదే విషయాన్ని గురువారం జిల్లాకు వచ్చిన సీఈఓ మీనా దృష్టికి కూడా టీడీపీ తీసుకెళ్లింది. కాగా తాజాగా ఒంగోలులో జరిగిన ఘటన, వైసీపీ వ్యవహరించిన తీరు, పోలీసుల వ్యవహారశైలి జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఎస్పీని ఎన్నికల సంఘం మార్పు చేసి కొత్త వారి నియామకం జరిగాక కూడా ఇలాంటి ఘటనలు జరగడంతో ప్రజల్లో ఎన్నికలు ఎలా జరుగుతాయోనన్న ఆందోళన, అనుమానం వ్యక్తమవుతోంది.

వైసీపీ పాలనలో పెరిగిన హింస

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో మూడొంతులకుపైనే సమస్యాత్మకంగా ఏదో ఒక స్థాయిలో ఇబ్బంది కలిగించేవిగా అధికారులు గుర్తించారు. దాదాపు 1,600లకు పైగా అలాంటివి ఉండగా సమస్య అధికంగా ఉండే వాటిలో సగం వరకు ఉన్నట్లు సమాచారం. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకునే ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాకు అదనపు బలగాలు కూడా వచ్చాయి. దాదాపు నెలరోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సాయిధ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమం కూడా జరుగుతోంది. అయితే ఇవన్నీ జరుగుతున్నా ఎన్నికల సంఘం సీరియస్‌గా ఉండి ఏకంగా ఎస్పీనే బదిలీ చేసినా స్థానికంగా ఉన్న పోలీసుల పక్షపాత ధోరణితో వైసీపీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. ప్రజానీకం స్వేచ్ఛగా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రశాంత వాతావరణం కావాలని యంత్రాంగాన్ని కోరుతున్నారు. ఆ మేరకు ఎన్నికల సంఘం తరఫున జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ అలాగే ఎస్పీ, ఇతర అధికారులు ప్రజలకు భరోసా ఇచ్చే చర్యలు ఇకనైనా పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రచారంలో టీడీపీ దూకుడు

ఇంటింటి ప్రచారం, విభిన్నవర్గాలతో ఆత్మీయ సమావేశాలు
కేడర్‌తో మమేకం, నేతలతో సమీక్షలు
పార్టీలో చేరికలపై ప్రత్యేక దృష్టి
అందరూ కార్యరంగంలోకి..
మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం



కనిగిరి మండలం ఎన్.గొల్లపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో కూటమి అభ్యర్థి ఉగ్ర

ఒంగోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గాల బరిలో నిలుస్తున్న వారంతా గెలుపే లక్ష్యంగా, అందుకు అవసరమైన ఏ ఒక్క దానిని నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగుతున్నారు. పోలింగ్‌కు మరో నెలరోజులు ఉండగా ఇప్పటికే ఇంచుమించు తమ నియోజకవర్గాల్లోని సగంమంది ఓటర్లను ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిశారు. పార్టీ మేనిఫెస్టోలోని అంశాలను, వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. నిత్యం సాయంత్రం వేళ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం విధిగా చేపడుతున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల కుటుంబసభ్యులు అంతా ఇదే పనిలో ఉంటున్నారు. మరోవైపు వివిధ సామాజికవర్గాల వారితో అలాగే తమకు మద్దతు ఇస్తున్న కూటమిలోని భాగస్వామ్య పార్టీల శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు, మరోవైపు టిడిపి కార్యకర్తలతోనూ సమావేశాలు నిర్వహించి క్షేత్ర స్థాయి కేడర్‌ను కదిలిస్తున్నారు. అదేసమయంలో గ్రామ, బూత్ స్థాయిలోని నేతలతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ వ్యక్తిగత బాధ్యతలు అప్పగిస్తూ మెరుగైన ఫలితాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక అన్ని నియోజకవర్గాల్లోనూ పెద్దసంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలోకి వివిధ స్థాయిల్లోని నాయకులు, కార్యకర్తలు వచ్చేందుకు ఆసక్తి చూపుతుండగా వాటిపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. అలాంటి వారి రాక వల్ల ఇప్పటివరకు పార్టీలో ఉన్నవారి నుంచి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకొని సమన్వయం చేస్తున్నారు. దీంతో టీడీపీలో చేరికలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ప్రతిరోజు అన్ని నియోజకవర్గాల్లో ఇలా భారీగానే వైసీపీ నుంచి వచ్చి చేరుతున్నారు. ఇలా అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులే కాకా చాలా చోట్ల ఎక్కడికక్కడ స్థానిక నేతలు కూడా ఎన్నికల ప్రచారంలో పాలు పంచుకుంటున్నారు. నామినేషన్ల తర్వాత మరింత ఉధృతంగా ప్రచార కార్యక్రమం కొనసాగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాగా జిల్లాలో శనివారం కార్యక్రమాలు పరిశీలిస్తే ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ నగరంలోని 35వ డివిజన్ పార్టీ కార్యాలయ ప్రారంభం, డివిజన్ అధ్యక్షులతో సమావేశంతో పాటు సాయంత్రం ఒంగోలు రూరల్ మండలంలోని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కొండపి అభ్యర్థి డాక్టర్ స్వామి టంగుటూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముందుగా పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుతో భేటీ అయ్యారు. అనంతరం ఆయన టంగుటూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎస్.విజయకుమార్ చీమకుర్తి మండలం పిడతలపూడిలో ఉదయం క్యాంపెయిన్ నిర్వహించగా, అక్కడ 35 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రాత్రికి చీమకుర్తి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. కనిగిరి అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో పెద్దఎత్తున వైసీపీ శ్రేణులు టీడీపీలోకి వస్తుండగా శనివారం కూడా నాలుగు మండలాలకు చెందిన 175 కుటుంబాల వారు చేరారు. పామూరు మండలంలోని తిరగలదిన్నెలో జరిగిన జయహో బీసీ సభలో ఉగ్ర పాల్గొన్నారు. అక్కడ మాజీ సర్పంచ్ నాగేశ్వరరావుతోపాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరారు. దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి దర్శి పట్టణంలో విస్తృతంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కూటమిలోని పార్టీలకు చెందిన ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి, మాగుంట రాఘవరెడ్డిల సమక్షంలో 250మంది మైనార్టీలు పార్టీలో చేరారు. సాయంత్రం కొమరోలు మండలంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు పెద్దారవీడు మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పొదిలి మండలంలో మాగుంట రాఘవరెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. మండలంలోని ఏలూరులో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు.



ముండ్లమూరు మండలం ఈదరలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

ఇసుక అక్రమ తవ్వకాలు.. అడ్డుకునేదెవరు..?

ఎన్జీటీ ఉత్తర్వులు బేఖాతరు
పట్టించుకోని అధికారులు

చీరాల, ఏప్రిల్ 13 : చీరాల మండలం కావూరివారిపాలె, బోయినవారిపాలెం గ్రామాల సరిహద్దుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. వీటిని అడ్డుకోవల్సిన అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అక్రమార్కులు ఎన్జీటీ(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేయటం అందుకు నిదర్శనం. తాజాగా బోయినవారిపాలెం, స్టువర్టుపురం మధ్య అక్రమ ఇసుక క్వారీ నుంచి తరలించిన ఇసుక లోడులో ఓ తలలేని మొండెం వెలుగు చూడటం అక్రమార్కుల దుశ్చర్యలకు పరాకాష్ట. గతంలోనూ బోయినవారిపాలెంలో శివార్లలో ఓ వృద్ధురాలి మృతదేహం లభించటం అప్పట్లో సంచలనం రేపింది. ఇసుక తవ్వకాలకు సంబంధించి చీరాల మండలంలో ఎవరికి అనుమతులు లేవు. అయితే చీరాల, బాపట్ల మండాల సరిహద్దుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయనేది బహిరంగ రహస్యం. ఏకంగా ఎక్స్‌కవేటర్లతో అనధికారిక క్వారీల్లో ఇసుక తవ్వకాలు సాగిస్తూ టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నారు.



బోయినవారిపాలెం సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలతో తటాకాలను తలపిస్తున్న గుంతలు

మృతదేహం ఎలా వచ్చింది..?

చీరాల మండలం ఈపురుపాలెంకు చెందిన రాంబాబు, లక్ష్మి దంపతులు పద్మనాభునిపేటలో గృహం నిర్మించుకునేందుకు ఇసుక, ఇతర మెటీరీయల్‌ను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆక్రమంలో ఒప్పందం కుదుర్చుకున్న వ్యక్తి చీరాల మండలం బోయిన వారిపాలెం, బాపట్ల మండల స్టువర్టుపురం మధ్యనున్న ఓ అక్రమ ఇసుక క్వారీ నుంచి ఇసుక దిగుమతికి మాట్లాడుకున్నారు. ఈక్రమంలో ఇసుకలోడు గురువారం రాత్రి గృహనిర్మాణ ప్రదేశానికి చేరింది. ఇసుక అన్‌లోడ్‌కు వెళ్లారు. శుక్రవారం ఆ ఇసుకను బేస్‌మెంట్‌లో నింపేందుకు భవన నిర్మాణ కూలీలు ఇసుక తీస్తుండగా తల లేని మృతదేహం గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

ఈ మృతదేహంపై పోలీసుల దర్యాప్తు సాగుతోంది. ఎక్కడైతే ఇసుక అక్రమ క్వారియింగ్ జరుగుతుందో అక్కడి నుంచే మృతదేహం ఇసుకలోడులోకి చేరి ఉంటుంది. అయితే ఆ మృతదేహం క్వారీ జరిగే ప్రదేశంలో ఎందుకుంది. అక్కడేమైన శ్మశానం ఉందా. లేదంటే ఎవరన్నా ఆ వ్యక్తిని చంపి అక్కడకు చేర్చారా.. మృతదేహానికి తలలేకుండా ఉండటం వెనుక కారణాలేంటి..? ఈ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.



నిర్మాణంలో ఉన్న గృహానికి తోలిన ఇసుక కుప్పలో నుంచి బయటపడ్డ మృతదేహం

ఎమ్మెల్యే ఏలూరికి బ్రహ్మరథం

- కూటమి ప్రచారంతో హోరెత్తిన పర్చూరు
- తిలకం దిద్ది హారతులతో ఆశీర్వదించిన మహిళలు
- స్వచ్ఛందంగా గ్రామస్థుల మద్దతు

పర్చూరు, ఏప్రిల్ 13: పర్చూరులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ప్రజలు బ్రహ్మరథం పట్టా రు. తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్య ర్థిగా ఏలూరి శనివారం పర్చూరులో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గ్రా మ దేవత శ్రీ అద్దంకి నాంచార మ్మ అమ్మవారి గుడిలో పూజలు చేసిన అనం తరం కార్యకర్తల తో కలసి ప్రచారం నిర్వ హించా రు. ఎమ్మెల్యే ఏలూరికి ప్రజలు పెద్ద ఎత్తున ఎదురెళ్లి స్వాగతం పలుకుతూ మద్దతు తెలుపుతున్నా రు. మహిళలు హారతులిచ్చి మేము సైతం అంటూ ప్రచారంలో వెంట నడుస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులను ఆప్యా యంగా పలుకరిస్తూ ముందుకుసాగారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్‌కుమార్, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొన్నారు.



పింఛన్ పెంచుతున్నట్లు అవ్వకు చెప్తున్న ఏలూరి

కిక్కిరిసిన రహదారులు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరికి మద్దతుగా అభిమానులు పెద్దఎత్తున తరలి రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఆయా ప్రధాన వీధులు సైతం ప్రజలతో కిక్కిరిసాయి.. యువకులు, వృద్ధులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొనడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.



ఏలూరికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న మహిళలు

అవ్వాతాతలకు ఏలూరి భరోసా

ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేని ఆప్యాయంగా ప లుకరిస్తున్న వృద్ధులతో ఏలూరి కొంతసేపు ముచ్చటించారు. ఎన్నికల మేనిఫెస్టోలో అవ్వాతాతలకు జూన్ నుంచి రూ.4వేల చొప్పున పింఛన్ ఇవ్వ నున్నట్లు వివరించారు. ఓటు ద్వారా రాష్ట్ర భవిష్యత్‌కు బాసటగా నిలవాలని ఆయన కోరారు.

కలసికట్టుగా ముందుకు సాగుదాం

తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఐక్యంగా ముందుకుసాగి రానున్న ఎన్నికల్లో అరాచక వైసీపీ పాలకులను ఇంటికి సాగనంపాలని కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. పచ్చని ప ర్చూరే లక్ష్యంగా శక్తివంచన లేకుండా పర్చూరు నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసిగి వేసారి పోవడంవల్లే నేడు కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అనంతరం ఏలూరు ప్రచారంలో భాగంగా నేనూ మీవాడినే అంటూ బొమ్మల సెంటర్ టీ దుకాణంలో ఎమ్మెల్యే స్వయంగా టీకాచి ప్రజల కు ఇస్తూ అభిమానం చాటుకున్నారు. చెరుకూరులో ఏలూరి విస్తృత ప్రచారం చేశారు. సెంటర్లోని హోటల్లో ప్రజలందరితో కలసి టిఫిన్ చేశారు.

సహజ వనరులను దోచుకున్న వైసీపీ నేతలు

- టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి
- కూటమి అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 13: వైసీపీ పాలకులు సహజవనరులను దోచుకున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. మండలంలోని మోదేపల్లిలో శనివారం ఎమ్మెల్యే గొట్టిపాటి ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిలిపేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆ బిల్లులను చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకుంటామన్నారు. చిలకలేరు వాగులో గతంలో నీరు ఉండేదని, ప్రస్తుతం కనీసం పశువులు తాగేందుకు కూడా నీరు లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇసుక ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేసేందుకు వీలుగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు గేట్లను పెట్టలేదన్నారు. సహజ వనరుల దోపిడీతో ప్రజలు వలస పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తామని గొట్టిపాటి చెప్పారు. టీడీపీ ప్రభుత్వం అర్హులందరికి పింఛన్‌లు మంజూరు చేయగా, జగన్‌రెడ్డి వచ్చాక వైసీపీ సానుభూతిపరులకు మాత్రమే పింఛన్‌లు మంజూరు చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే పింఛన్‌ను రూ4వేలకు పెంచుతామన్నారు. అలాగే బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ మంజూరు చేస్తామని తెలిపారు. టీడీపీతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. జగన్‌రెడ్డి విద్యుత్ చార్జీల పేరుతో ప్రజల రక్తాన్ని జలగలా పీల్చుతున్నారన్నారు. ఉచిత విద్యుత్ హామీలో వైసీపీ పూర్తిగా విఫలమైందన్నారు. రకరకాల చార్జీల పేరుతో ఐదేళ్లలో 9సార్లు కరెంట్ చార్జీలను పెంచుతూ ప్రజలకు షాక్‌లు ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికలలో అధికార పార్టీ నేతలకు ప్రజలు ఓటు తో తగిన షాక్‌ను కొట్టాలని గొట్టిపాటి పిలుపునిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున హారతులు ఇచ్చి, వీరతిలకం దిద్ది స్వాగతం పలికారు. కార్య క్ర మంలో కరి పరమేష్, మానం మురళీ మోహన్‌దాస్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నార య్య, నర్రా వీరయ్య, బీమని శ్రీనివాసరావు, సర్పంచ్ ఒంపుగుడి అంజనా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి



మహిళా పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

కొప్పరంలో అగ్నిప్రమాదం

4ఎకరాల అరటి తోట దగ్ధం

కొప్పరం (సంతమాగులూరు), ఏప్రిల్ 13 : మండలంలోని కొప్పరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సయ్యద్ సుబానీకి చెందిన 4 ఎకరాల అరటితోట అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో అరటి తోట పూర్తిగా ఆహుతయింది. శనివారం మధ్యాహ్నం సమయంలో అరటి తోట నుంచి ఎగిసిపడుతున్న మంటలను చూసిన రైతులు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేశారు. అద్దంకి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని రైతు సయ్యద్ సుబానీ వాపోయారు.



ఆహుతైన అరటి తోట

ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల విజయదుందుబి

సంతమాగులూరు, ఏప్రిల్ 13 : సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో విజయదుందుబి మోగించారు. గతంలో లేని విధంగా ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రైవేటు కళాశాలకు దీటుగా ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ ఇంటర్‌లో హేమంత్ 945/1000, సీహెచ్ గౌతమి 944, మౌనిక 875 మార్కులు సాధించగా, ప్రథమ సంవత్సర ఫలితాల్లో హారిక 429/470, కోమలి 424/ 470 మార్కులతో పాలసయ్యారు.

17న శ్రీరామ నవమి ఉత్సవాలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 13: మండలంలోని వేలమూరిపాడు గ్రామంలో ఈ నెల 17వ తేదీన రామాలయం వద్ద మా ఊరు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు చందు డాన్స్ అ కాడమీ ఒంగోలు వారి భరతనాట్య ప్రదర్శన, అనంతరం వివిధ రంగాలల్లో సేవలందించిన పలువురు సేవామూర్తులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రజలు పాల్గొనాలని కోరారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

చీరాలటౌన్, ఏప్రిల్ 13 : అసాంఘిక శక్తులపై చీరాల పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలో నిత్యం తనిఖీలు చేస్తూనే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో శనివారం టూటౌన్ సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ మురళి విస్తృత తనిఖీలు చేశారు. స్టేషన్ పరిధిలోని ఎల్‌బీఎస్‌నగర్, ఆనందపేట, గాంధీనగర్ ప్రాంతాలలో ప్రత్యేక పోలీసు బలగాలతో రూట్ మార్చ్ నిర్వహించారు. ఆయా ప్రాంతంలోని ప్రయాణిస్తున్న పలు వాహనాలు తనిఖీ చేసి డ్రైవర్‌లకు సూచనలు చేశారు. అంతేకాకుండా స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్‌లకు వారి నివాసాల వద్దనే కౌన్సెలింగ్ చేశారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి

మాజీ మంత్రి జేడీ శీలం

పర్చూరు, ఏప్రిల్ 13 : నిరుపేదల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి జేడీ శీలం అన్నారు. శనివారం రోటరీ భవనంలో పార్టీ నియోజకవర్గస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. జేడీ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధ్యమన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి నల్లగొర్ల శివశ్రీలక్ష్మీజ్యోతి, జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు, సీనియర్ నాయకులు తోట శివనాగేశ్వరరావు, పులిపాటి రవి, నల్లగొర్ల రామరాజు, పోతిన సంపత్ కుమార్, షేక్. అబ్దుల్ రహీమ్, జ్యోతి, భవనం పేరిరెడ్డి, పఠాన్ బాషా, అంబేడ్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జేడీ శీలం

16న మండల సర్వసభ్య సమావేశం

బల్లికురవ, ఏప్రిల్ 13: బల్లికురవ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16న ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో హనుమారెడ్డి తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ఉండటంతో సమావేశాన్ని సాధారణంగా నిర్వహిస్తామని, సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు రావాలి

కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 13 : రాష్ట్రంలో అందరి భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావల్సిన చారిత్రాత్మక అవసరాన్ని గుర్తించి కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. ఎంజీసీ మార్కెట్‌లో శనివారం బీటీఎఫ్ సభ్యులతో కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో ప్లకార్డులు పట్టుకుని బీటీఎఫ్ శ్రేణులు చేసిన నినాదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సూపర్ సిక్స్ పథకాలతో అందే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి కొండయ్య

కూటమి గెలుపు .. రాష్ట్ర అభివృద్ధికి మలుపు







ప్రచారాన్ని నిర్వహిస్తున్న గౌరీ అమర్‌నాథ్..రాజుపాలెంలో బాబీ ప్రచారం..గొట్టిపాటినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న శ్రేణులు

చీరాల, ఏప్రిల్ 13 : కూటమి గెలుపు, రాష్ట్ర అభివృద్ధికి మలుపని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య కుమారుడు గౌరీ అమర్‌నాథ్ అన్నారు. శనివారం బీటీఎఫ్ (బెంగళూరు టీడీపీ ఫోరం) సభ్యులతో కలసి స్థానిక కామధేను కాంప్లెక్స్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కొండయ్యను ఎమ్మెల్యేగా, తెన్నేటి కృష్ణప్రసాద్ ఎంపీగా అఖండ మెజార్టీతో గెలిపించాలని అమర్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. వైసీపీ అరాచక, అసమర్థ పాలనతో అన్నివర్గాల ఆర్థికంగా నష్టపోగా, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ప్రతి దుకాణానికి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. బీటీఎఫ్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి బలంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీటీఎఫ్ ప్రతినిధులతో పాటు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవ : రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) విజ్ఞప్తి చేశారు. శనివారం కేరాజుపాలెం గ్రామంలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్ కిషోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అయన గడప గడపకు తిరిగి రవికుమార్ చేపట్టిన అభివృద్ధి పనులు, టీడీపీ చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతు టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామాలలో ప్రధాన సమస్య తాగు నీటిని ఇంటింటికీ అందిస్తామన్నారు. వైసీపీ పాలన వలన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారని, అన్ని వర్గాల ప్రజలను జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. ఒక్క ఛాన్స్‌తో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఎంతో అనుభవ శాలి అయిన చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరు సమిష్టిగా ఎన్నికలలో పనిచేయాలని ఆయన కోరారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అద్దంకి అభ్యర్థి రవికుమార్‌ను బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను భారీ మెజారిటితో గెలిపించాలని బాబీ కోరారు. కార్యక్రమంలో గ్రామ నేతలు జాష్టి శ్రీరంగనాయకులు, అడుసుమల్లి శ్రీహర్ష, అమరనేని రమేష్‌బాబు, చెరుకూరి రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాటినగర్‌లో టీడీపీ ప్రచారం

మార్టూరు : పర్చూరు నియోజకవర్గం టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావును గెలిపించాలని కోరుతూ శనివారం గొట్టిపాటినగర్‌లో టీడీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ అభివృద్ధిలో ఘోరంగా విఫలమైందన్నారు. బేల్దారి కూలీలకు కూడా పనిలేకుండా పోయిందన్నారు. ఇసుక కొరతతో పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోయారన్నారు. నాసిరకం మద్యం ప్రజల ప్రాణాలను బలిగొంటున్నదన్నారు. రాష్ట్ర అభివృద్ధి గాడిలో పడాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

ఇంటింటి ప్రచారం

ఇంకొల్లు : టీడీపీ కూటమి అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. శనివారం 1వవార్డులో నేతలు ఇంటింటికీ తిరిగి అభ్యర్థి ఏలూరిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డాక్టర్ బోడాల శ్యాంసుందర్, కొల్లూరి శివాజీ, వీరగంధం, ప్రసాద్, కరి శ్రీను, మీరావలి, బోడావుల శివయ్య, హరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన లోపాల సవరణకు సర్వే

పేరాల(చీరాలటౌన్), ఏప్రిల్ 13 : విద్యార్థుల అభ్యసన లోపాలను సవరణ చేసుకునేందుకు సర్వే పరీక్షలు ఉపయోగపడతాయని ఎమ్ఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన రాష్ట్ర స్థాయి సాధన సర్వే పరీక్షలు జరుగనున్నాయి. ఈక్రమంలో శనివారం పేరాల ఎఆర్ఎం ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి 13 మండలాలకు చెందిన సీఆర్పీలు, ఫీల్డ్ ఇన్విజలేటర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పరీక్ష 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్, మ్యాథ్స్, తెలుగు సబ్జెక్టులకు పరీక్ష ఉంటుందని, పరీక్ష రెండుసార్లు ఏదయినా రెండు సబ్జెక్టుల కాంబినేషన్‌తో ఉంటుందన్నారు. క్రమంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌గా పవని భానుచంద్రమూర్తి, పాఠశాల ప్రధానోపధ్యాయుడు సాల్మన్ రాజు, డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

22న అనంతవరంలో దేవాలయ పునఃప్రతిష్ఠ

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 13 : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో ఈనెల 22వ తేదీన శ్రీ గంగా పార్వతీ సమేత భోగ మల్లేశ్వర స్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నుంచి ప్రత్యేక పూజలు, 22న ఆలయ ప్రదక్షిణ, పూర్వ శిఖర కలశ ప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పర్చూరు, ఏప్రిల్ 13: పర్చూరులోని ఎస్‌కేపీఆర్ డిగ్రీ కళాశాలలో శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని, చిన్మయామిషన్. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా విద్యాదాత పాబోలు రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాబోలు ఉదయభాస్కర్ శనివారం ప్రకటనలో తెలిపారు. నిరుపేద రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 2 వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

అంబేడ్కర్ భావజాలం ఉన్నవారికే ఓటేయండి

చీరాలటౌన్, ఏప్రిల్ 13 : సార్వత్రిక ఎన్నికల్లో అంబేడ్కర్ భావజాలం కలిగిన నాయకులకు ఓటు వేయాలని పలువురు వక్తలు అన్నారు. శనివారం జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ముందస్తు అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరెడ్డి, ప్రేమ్‌కుమార్, అక్కల వెం కటేశ్వర్లు, అర్జునబాబు, సుభాని, మాధవరావు, కిరణ్, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



యద్దనపూడి బ్రాంచి కెనాల్‌కు వచ్చిన జలాలు

కోనంకికి చేరిన సాగర్ జలాలు

మార్టూరు, ఏప్రిల్ 13 : కోనంకి సబ్ డివిజన్ పరిధిలో ఎన్ఎస్‌పీ కాలువలోకి శనివారం సాయంత్రానికి సాగర్ జలాలు ప్రవేశించాయి. చాలా తక్కువగా సాగర్ జలాలు ప్రవాహం వస్తున్నట్లు ఎన్నెస్పీ అధికారులు చెప్తున్నారు. శనివారం రాత్రి 7 గంటలకు మార్టూరు మండలం బొల్లాపల్లి జీఎస్‌టీ రోడ్డు దాటి సాగర్ జలాలు దిగువకు ప్రవహించాయి. రాజుపాలెం మేజర్‌కు కూడా స్వల్పంగా జలాలు వెళుతున్నాయి. వారబందీ పద్ధతిన పమిడిపాడు మేజర్, కోటపాడు మేజర్‌ను మూసివేశారు. మూడు రోజుల తర్వాత వాటిని తెరుస్తారు. యద్దనపూడి బ్రాంచి కెనాల్ ద్వారా జీఎస్‌టీ దాటిన తర్వాత నూతలపాడు మైనర్, ద్రోణాదుల మేజర్‌కు నీటి సరఫరాను పంపించనున్నట్లు జేఈ రాజేష్ తెలిపారు. ప్రస్తుతం ఐఎస్‌టీ వద్ద 230 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. అక్కడ నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందంటున్నారు. శనివారం అర్ధరాత్రికి మార్టూరు, వలపర్ల మంచినీటి చెరువులకు నీరు చేరే అవకాశం ఉందని, మండలంలోని తాగునీటి చెరువులను నింపడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి తెలిపారు.

పర్చూరుకు చేరిన బ్యాలెట్ బాక్స్‌లు

పర్చూరు, ఏప్రిల్ 13 : బాపట్ల పార్లమెంట్‌కు సంబంధించిన ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లు పర్చూరు చేరినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి ఆర్వో గంధం శనివారం రవీందర్ తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లను జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచినట్లు తెలిపారు. వాటి భద్రత బాధ్యత రిజర్వు పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. వీవీ ప్యాట్స్ 430, బ్యాలెట్ యూనిట్స్ 359, సీయూ-359 చొప్పున స్ట్రాంగ్ రూంకు చేరాయన్నారు. పర్చూరు, యద్దనపూడి తహసీల్దార్‌లు సీహెచ్.సుబ్బయ్య, వై.నాగరాజు సారథ్యంలో బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూంకు చేర్చినట్లు ఆర్వో తెలిపారు.



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న పీడీ

కూలీలకు పనులు కల్పించాలి

పీడీ రాజేష్

బల్లికురవ, ఏప్రిల్ 13 : గ్రామాలలో రోజువారీ కూలీలు వలస పోకుండా ఉపాధీ హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.రాజేష్ ఆదేశించారు. శనివారం మండలంలోని వేమవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను అయన తనిఖీ చేశారు. కూలీల మస్టర్‌ను తనిఖీ చేశారు. బోగస్ మస్టర్లు వేసినా, ఒకరికి బదులు మరొకరు పనులకు వచ్చినా సహించేది లేదని చెప్పారు. ప్రతి కూలికి రూ.300 వంతున కూలి గిట్టు బాటు అయ్యేలా పనులు చేయించాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు ఉన్నాయన్నారు. రైతులకు ఉపయెగ పడే పనులు చేయించాలన్నారు. పంట కాలువలు, చెరువులలో ఉన్న పూడిక తొలగించాలన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని పనులు చేసే సమయంలో తగుజాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రాజు, క్లస్టర్ టీఏ నాగబోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన అంబడిపూడి చెరువు

- ఆరు గ్రామాలలో తాగునీటి ఎద్దడి
- మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్న ప్రజలు

బల్లికురవ, ఏప్రిల్ 13: మండలంలోని ఆరు గ్రామాలలో వారం రోజుల నుంచి తాగు నీటి ఎద్దడి నెలకొంది. అంబడిపూడి రక్షిత నీటి పథకం ద్వారా పెద అంబడిపూడి. చిన అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలకు తాగు నీరు అందాల్సి ఉంది. ఈ పథకం ద్వారానే గ్రామాలకు నీరు అందుతుంది. గత వారం రోజుల నుంచి స్టోరేజీ చెరువులో నీరు అడుగుకు చేరటంతో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఆరు గ్రామాలలో నీటి కష్టాలు మొదలయ్యాయి. సాగర్ నీరు చెరువుకు చేరేవరకు గ్రామాలకు నీటి సరఫరా జరిగే అవకాశాలు లేకపోవటంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరయితే గ్రామాలలోనే ఉన్న మినరల్ ఆర్వో ప్లాంట్ల నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. నిరుపేదలు నీటిని కొనుగోలు చేయలేక ఫ్లోరిన్ నీటినే సేవిస్తున్నారు. అధికారులు సకాలంలో పట్టించుకోక పోవడంతో నీటి ఎద్దడి తలెత్తిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సాగర్ నీటిని స్టోరేజీ చెరువులకు పూర్తిస్థాయిలో నింపి వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఆరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రెండు గ్రానైట్ లారీల పట్టివేత

బల్లికురవ. ఏప్రిల్ 13 : పర్మిట్లు లేకుండా అక్రమంగా తరలి వెళుతున్న రెండు గ్రానైట్ ముడిరాయి లారీలను శుక్రవారం రాత్రి మైనింగ్ కార్యాలయ టీఏ భాస్కర్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నారు. వేమవరం రోడ్డులో వెళ్తున్న ముడిరాయి లారీలను తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వెంటనే లారీలను బల్లికురవ పోలీసుస్టేషన్‌కు తరలించారు. తనిఖీలో భాగంగా పర్మిట్ ఉన్న ఒక లారీని కూడా మైనింగ్ అధికారులు నిలిపివేసినట్లు లారీ యజమానులు అధికారులపై మండిపడ్డారు. దీంతో గ్రానైట్ యజమానులు నిలదీయడంతో లారీలను విడిచిపెట్టారు.

ప్రశాంతంగా ఓటును వినియోగించుకోవాలి




ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహారావు

బల్లికురవ. ఏప్రిల్ 13 : ఎన్నికలలో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియెగించుకోవాలని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు కోరారు. శనివారం మండలంలోని వేమవరం, ముక్తేశ్వరం, రామాంజనేయపురం, వైదన, గొర్రెపాడు గ్రామాలలో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ ఫ్యాక్షన్ గ్రామమైన వేమరవంలో ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికలకు సహకరించాలన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాలకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జాగర్లమూడి వీఆర్‌వో మృతి

యద్దన పూడి, (మార్టూరు) ఏప్రిల్ 13 : యద్దనపూడి మండలం జాగర్లమూడి వీఆర్‌వో షేక్ కాలేషావలి (42) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఎన్నికల విధులు నిమిత్తం శుక్రవారం రాత్రి మండల రెవెన్యూ సిబ్బందితో కలిసి బాపట్ల వెళ్లారు. అక్కడ కాలేషావలి రాత్రి 11 గంటలకు అస్వస్థతకు గురవడంతో రెవెన్యూ అధికారులు చీరాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మధ్యలోనే అయన మృతి చెందినట్లు చీరాలలోని వైద్యులు తెలిపారు. అనంతరం ఆయన మృతదేహాన్ని స్వగ్రామం యద్దనపూడికి తీసుకొచ్చారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అత ని మృతదేహానికి తహసీల్దార్ వై.నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున మట్టి ఖర్చులకు నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.25 వేలు అందజేశారు.



ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.8	28.2
కావలి	37.0	26.0
కందుకూరు	37.0	26.0
ఆత్మకూరు	38.0	27.0
ఉదయగిరి	39.0	24.0

కిలో పొగాకు రూ.241

కలిగిరి : పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 658 పొగాకు బేళ్లు తీసుకువచ్చారు. మొత్తం 11 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 580 బేళ్లు కొనుగోలుచేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.241, కనిష్ఠ ధర రూ. 220, సగటు ధర రూ. 227.63గా నమోదయ్యింది.

మిర్చి ధర ఢమాల్!

మూణ్నెళ్ల క్రితం క్వింటం రూ.23వేలు.. ఇప్పుడు 15వేలే!



లింగసముద్రం, ఏప్రిల్ 13 : ఎర్ర బంగారంగా పలవబడే మిర్చి ధర పడిపోతోంది. మూడు నెలల క్రితం వరకు క్వింటం ధర రూ.23 వేల వరకు ఉండగా, ప్రస్తుతం రూ.15 వేలకు పడిపోయింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఒక ఎకరాలో మిర్చి దిగుబడి 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు బాగానే ఉండగా తొలి కోతల సమయంలో ఉన్న మద్దతు ధర కొన్ని నెలల పాటు ఉంటుందని, లాభాలు వస్తాయని రైతు లు ఆశపడ్డారు. అయితే, ధర పతనావస్థకు చేరుకుంటుండటంతో వారిలో దిగులు మొద లైంది. మన రాష్ట్ర రైతులేగాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రాల నుంచి రైతులు మిర్చి టిక్కీలు గుంటూరు మిర్చి యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. అయితే, ఇక్కడ నుం చి చైనాకు ఎగుమతు లు ఆగిపోవడంతో విక్రయాలు సక్రమంగా జరగడంలేదని రైతులు వాపోతున్నారు. శీతల గోదాముల్లోను మిర్చి టిక్కీలను భారీస్థాయిలో నిల్వ చేశారని చెబుతున్నారు. మండల రైతులు గుంటూరుకు తీసుకెళ్లినా అక్కడ అమ్మకాలు లేక, నిల్వ చేసేందుకు గోదాముల్లో చోటు ఉండటం లేదు. దీంతో మిర్చి ఉత్పత్తులను రోడ్లపైనే పట్టలు కప్పి కాపాడుకుంటు న్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంటే పాడైపోతుందన్న ఉద్దేశంతో అందిన కాడికి అమ్మేస్తున్నారు.

ఆత్మకూరు ఎమ్మెల్యేపై కేసు నమోదు

ఆత్మకూరు, ఏప్రిల్ 13 : ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిపై పోలీసు కేసు నమోదయ్యింది. ఈ నెల 11వ తేదీన రంజాన్ సందర్భంగా ఆత్మకూరులోని ఓ మసీదులో జరిగిన ప్రార్థనలో ముస్లింలతోపాటు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచారం నిర్వహించి, పలు రకాల హామీలు గుప్పించారు. దీన్ని ఆధారాలతో సహా ఏబీఎన్ చానల్‌లో ప్రసారం అయ్యింది. ఈ కథనంతో స్పందించిన ఎన్నికల అధికారులు విచారణ చేయగా నిర్ధారణ అయ్యింది. దీంతో శనివారం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిపై ఆత్మకూరు పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

• కారులో రూ.17లక్షల నగదు స్వాధీనం

నెల్లూరు (క్రైం) : నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద కారులో తరలిస్తున్న రూ.17 లక్షల నగదును శనివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో దర్గామిట్ట పోలీసులు అన్నమయ్య సర్కిల్ వద్ద తనిఖీలు చేస్తుండగా చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని ఓ జిమ్ మేనేజర్ వెంకటేశ్వర్లు కారును ఆపారు. కారులో 17 లక్షల నగదు ఉన్నట్టు గుర్తించారు. నగదుకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.



జలదంకిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ తల్లి మస్తానమ్మ



నెల్లూరు నగరంలో తన భర్త నారాయణ గెలుపు కోసం రమాదేవి ప్రచారం



కొడవలూరు : కోవూరు టీడీపీ అభ్యర్థి ప్రశాంతి రెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న ఆమె తనయుడు అర్జున్ రెడ్డి



ఇంటింటి ప్రచారం వంద రోజులైన సందర్భంగా దొంతాలిలో కేక్ కట్ చేస్తున్న నెల్లూరు రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు (ఫైల్)



కందుకూరులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య



ఆత్మకూరు : తన తండ్రిని గెలిపించాలంటూ మహిళను అభ్యర్థిస్తున్న కైవల్యారెడ్డి



వెంకటాచలం : తన తండ్రి సోమిరెడ్డి గెలుపు కోసం కసుమూరు దర్గాలో ప్రార్థనలు చేసిన డాక్టర్ సింధురెడ్డి



బుచ్చిరెడ్డిపాళెంలో టీడీపీ అభ్యర్థి ప్రశాంతి రెడ్డి తరఫున ప్రచారంలో పాల్గొన్న కుమార్తె నీలిమారెడ్డి, కోడలు దివ్యారెడ్డి

జనంలోకి బంధుగణం

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల కుటుంబ సభ్యులు • పోటీపోటీగా పర్యటనలు.. ప్రజలతో పలకరింపులు

నెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : 1970 సంవత్సరానికి ముందు ఎన్నికల బరిలో నిలిచిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటు కోసం ఇల్లిల్లు తిరిగేవారే కారు. అప్పట్లో గోడలపై ముద్రించే పార్టీ గుర్తులే అభ్యర్థు లుగా చెలామణి అయ్యేవి. 1983 తరువాత సీఎం అభ్యర్థులే ప్రధాన ప్రచార ఆకర్షణలుగా మారారు. ఎన్టీఆర్, చంద్రబాబు ఇలా ప్రధాన పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థుల పోస్టర్లు, కటౌట్లే ప్రచారంలో కీలక పాత్ర పోషించేవి. 2009 తరువాత ఎన్నికల ప్రచారంలో ట్రెండ్ మారింది. అవినీతి, అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత జగన్ జైలుకు వెళ్లడంతో ఉప ఎన్నికల్లో ఆయన తరఫున తల్లి విజ యమ్మ, చెల్లెలు షర్మిల ఎన్నికల ప్రచారం చేశారు. ఇలా అభ్యర్థుల గెలుపు కోసం కుటుంబ సభ్యుల ప్రచారాలు తరువాతి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. భర్తల కోసం భార్యలు, తండ్రుల కోసం బిడ్డలు, వారి పతి, సతులు ఇలా కుటుంబ సమేతంగా ఎన్నికల ప్రచా రంలో పాల్గొంటున్నారు. అభ్యర్థులకు దీటుగా వీరు సైతం చెమటోడ్చుతు న్నారు. ఓట్ల అభ్యర్థనలో ప్రజలను ప్రభావితం చేసే స్థాయిలో మాట్లాడుతున్నారు. నెల్లూరు జిల్లాలో నాలుగు నెలల క్రితం నుంచే అభ్యర్థుల తరఫున కుటుంబ సభ్యుల ప్రచారం మొదలయ్యింది.

• టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ విజయం కోసం నాలుగు నెలలుగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఆయన సతీమణి పొంగూరు రమాదేవి ప్రచారం చేస్తున్నారు. ఆరంభంలో నారాయణ రాష్ట్ర పార్టీ కార్యకలాపాలు, వ్యాపార పనుల నిమిత్తం ఒకటి రెండు రోజులు ప్రచారానికి దూరంగా ఉన్నా ఆ లోటు తెలియకుండా ఈమె ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈమెతోపాటు నారాయణ ఇద్దరు కుమార్తెలూ ప్రజలను కలుస్తున్నారు. పెద్ద కుమార్తె సింధుజా, రెండవ కుమార్తె షరిణిలు నగర పరిధిలోని డివిజన్లలో కలియ తిరుగుతూ తండ్రిని గెలిపించమని అభ్యర్థిస్తున్నారు.

• నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపు కోసం ఆయన కుటుంబమంతా జనంలోకి కదిలింది. ఆయన సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ, కుమార్తెలు లక్ష్మీహైందవి, సాయి వైష్ణవి, చిన్న అల్లుడు నవీన్ గడిచిన 125 రోజులుగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మొదటి విడత ఇంటింటి ప్రచారాన్ని పూర్తి చేసుకొని రెండో విడ త ప్రచారం ప్రారంభించారు. తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నకు సర్వం తానై ఎన్నికల వ్యూహరచన చేస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి కోసం ఆయన కుమార్తె హిమబింధు కూడా ప్రజలను కలుస్తున్నారు.

• నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల గెలుపు కోసం కుటుంబ సభ్యులంతా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రశాంతిరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి, కుమార్తె నీలిమారెడ్డి, అల్లుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కోడలు ఐషితరెడ్డి కోవూరు నియోజకవర్గంలో కలియ తిరుగుతున్నారు. ఇక ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయసాయి భార్య సుజిత రెడ్డి, కుమార్తె నేహారెడ్డిలు కూడా ప్రచారం చేస్తున్నారు.

• సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపు కోసం ఆయన కోడలు శృతిరెడ్డి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రతినిత్యం ఈమె పల్లెల్లో తిరుగుతూ తన మామయ్యను గెలిపించమని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. సోమిరెడ్డి కుమారుడు రాజగోపాల్‌రెడ్డి ప్రచారంతోపాటు ఎన్నికల నిర్వహణ బాధ్యతలను చూస్తు న్నారు. వైసీపీ అభ్యర్థి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితరెడ్డి తండ్రి గెలుపు కోసం ప్రజలను కలుస్తున్నారు.

• కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గెలుపు కోసం ఆయన సతీమణి ఇంటూరి సౌజన్య గడప గడపకు తిరిగి ప్రచారం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి గెలుపు కోసం బుర్రా మధుసూదన్ యాదవ్ సతీమణి లక్ష్మీ, కుమారుడు లక్ష్మీనారాయణలు కూడా ప్రచారం చేస్తున్నారు

• ఆత్మకూరులో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపు కోసం ఆయన కుమార్తె కైవల్యారెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గం పూర్తిగా కలియ తిరుగుతున్నారు. వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి గెలుపు కోసం ఆయన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారు.

• కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గెలుపు కోసం ఆయన కుమార్తె సంహితరెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తరఫున ఆయన భార్య ఆదిలక్ష్మి ఎన్నికల బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు.



కావలి : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుమాటి క్రిష్ణారెడ్డి కుమార్తె సంహితా రెడ్డి ప్రచారం



నెల్లూరు రూరల్ : వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి కుమార్తె బిందు రెడ్డి ప్రచారం



ఆత్మకూరు : తన కుమారుడు విక్రమ్‌రెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

సామాన్యుడికి లక్కు! అధికారానికే కిక్కు!

• మద్యం దుకాణాల్లో దొరకని సరుకు
• నిర్ణీత సమయానికన్నా ముందే మూత
• వైసీపీ నేతల డంప్‌నకు చేరుతున్న మందు
• ఇదే అదునుగా విచ్చలవిడిగా బెల్టు వ్యాపారం
• మందుబాబులకు తప్పని కష్టాలు

'గతేడాది ఇదే సీజనులో ఎంత మద్యం విక్రయాలు జరిగాయో. ఆ లెక్కనే ఇప్పుడూ అమ్మకాలు ఉండాలి. అంతకు మించి మద్యం విక్రయాలు చేయొద్దు.' ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవి. ఇది బాగానే ఉన్నా.. అధికార పార్టీ నేతలకు మాత్రం ఈ ఆదేశాలు కలిసొచ్చినట్టున్నాయి. ఎక్సైజ్ శాఖలో కొంత మంది అధికారులు, మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది సహకారంతో కేసుల కొద్దీ మద్యం సీసాలు రహస్య ప్రదేశాలకు తరలిపోతున్నాయి. సందట్లో సడేమియా అన్నట్టుగా ఎమ్మార్పీకంటే అదనపు ధరకు బెల్టు దుకాణాలకూ ఇచ్చేస్తున్నారు. దుకాణం తెరవక ముందే వాటిని స్కాన్ చేసి గుట్టుచప్పుడు కాకుండా తరలించేస్తున్నారు. మధ్యాహ్నానికే 'నో స్టాక్' బోర్డు పెట్టేసి దుకాణాలను మూసేస్తున్నారు. మద్యంపై ఆశచావని మందుప్రియులు బార్‌లకు వెళ్లడమే లేదా బెల్టుషాపులకు ఆశ్రయిస్తున్నారు.



మర్రిపాడులో మూతపడిన మద్యం దుకాణం

నెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 193 మద్యం దుకాణాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు, పట్టణాల్లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ దుకాణాలు పని చేయాల్సి ఉంది. అయితే గడిచిన నెల రోజులుగా సాయంత్రం ఆరేడు గంటలకే ఈ దుకాణాలను మూసివేస్తున్నారు. ఎందుకిలా అని అడిగితే దుకాణంలో సరుకు అయిపోయిందని సిబ్బంది చెబుతున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు వరకు అయిపోని సరుకు ఇప్పుడే ఎందుకు అయిపోతోందన్నదే అసలు ప్రశ్న. జిల్లాలో సరాసరి రోజుకు రూ.3 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. అంతకుమించి ఎన్నికల సమయంలో విక్రయాలు జరపవద్దని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు చెబుతున్నారు. మరి ఆ మేరకైనా సరుకు విక్రయాలు దుకాణాల్లో జరుగుతున్నాయా.. అంటే అదీ లేదు. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని తెప్పించిన వైసీపీ నేతలు ఈ దఫా ప్రభుత్వ మద్యం దుకాణాలను టార్గెట్ చేసుకుంటున్నారు. మద్యం దుకాణాల్లోని సిబ్బంది అంతా వైసీపీ నాయకులు నియమించిన వారే కావడం, వారికి ఎక్సైజ్ సిబ్బంది కూడా సహకరించడంతో దర్జాగా మద్యాన్ని డంప్‌కు తీసుకెళుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఆలోచనలో ఉన్న వైసీపీ నేతలు ఆ క్రమంలో ఎక్కడికక్కడ భారీగా మద్యాన్ని నిల్వ చేస్తున్నట్లు తెలుస్తోంది. దుకాణం తెరిచేముందుగానే మద్యం దుకాణాల్లోని సిబ్బంది వైసీపీ నేతలకు ఇచ్చే బాటిళ్లను స్కాన్ చేసేస్తున్నారు. చీకటి పడగానే ఆ కేసులను దుకాణాల నుంచి తరలించేస్తున్నారు. ఈ విషయాలు సెబ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నెల రోజుల క్రితం వరకు రాత్రి 9 గంటల వరకు సరుకు విక్రయాలు జరిగినా నిండుకోని మద్యం నిల్వలు ఇప్పుడు సగం పూటకే అయిపోతున్నా ఏ అధికారి కూడా దృష్టి పెట్టకపోవడం గమనార్హం. ఇదే సమయంలో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మద్యం దుకాణాల నుంచి భారీగానే బెల్టుకు మద్యం తరలిపోతోంది. రాత్రి ఏడు గంటలకు మద్యం దుకాణంలో సరుకు అయిపోయినా పక్కనే ఉన్న బెల్టుషాపుల్లో మాత్రం దొరుకుతోంది. అయితే మద్యం దుకాణానికి, బెల్టు షాపుకు మధ్య క్వార్టర్‌కు రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఎక్కువగా ఉంటోంది. వైసీపీ నేతల మందు రాజకీయం ఇప్పుడు మందుబాబులపై భారం.



లింగసముద్రం : శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మూతపడిన ప్రభుత్వ మద్యం దుకాణం

ఉదయగిరిలో మధ్యాహ్నానికే బంద్!



మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ విధించిన పరిమితిని కూడా అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. రోజువారి టార్గెట్ పూర్తయిందని చెబుతూ ఉదయగిరి నియోజకవర్గంలో చాలా చోట్ల మధ్యాహ్నానికే దుకాణాలు మూసేస్తున్నారు. ఆ తరువాత మందుబాబులు బ్లాక్‌లో కొని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. కొందరు ఎక్సైజ్ అధికారులు సహకరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో నిఘా లేకపోవడంతో అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి మద్యం వెళ్లిపోతోంది. మద్యం దుకాణాల నుంచి 70 శాతానికిపైగా బెల్టుషాపులకు తరలిస్తున్నారు.

- ఉదయగిరి

మెట్ట ప్రాంత ప్రజల అభివృద్ధే ధ్యేయం!



టీడీపీలో చేరిన వారితో కాకర్ల సురేష్



ఆత్మీయ సమావేశానికి హాజరైన వలస వాసులు

- వలసవాసుల ఆత్మీయ సమావేశంలో కాకర్ల సురేష్
- ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తెస్తే పరిష్కరిస్తా..

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13: హైదరాబాదులోని బీఎన్‌రెడ్డినగర్‌లో శనివారం నియోజకవర్గంలోని మండలాల నుంచి వలస వెళ్లి హైదరాబాదులో స్థిరపడ్డ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు పరిశ్రమల స్థాపనకు కృషి చేసి వలసల నివారణకు చర్యలు చేపడతామన్నారు. ఏ సమస్య ఉన్నా తనకు ఫోన్ చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో తనతో పాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజయానికి సహకరించాలని కోరారు. అనంతరం కాకర్లను వలసవాసులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఆత్మీయ సమావేశానికి హైదరాబాదు నగరంలోని వనస్థలీపురం, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, బీఎన్‌రెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వలసవాసులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

టీడీపీ ఇంటింటా ప్రచారం

వింజమూరు: పట్టణంలోని సుజాతనగర్‌లో శనివారం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాకర్ల సురేష్ తమ్ముడు సునీల్ భార్య సురేఖ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడా నర్సారెడ్డి, కొండపల్లి వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా, చల్లా వెంకటేశ్వర్లు, గురజాల సుబ్బారావు, సాంబయ్య, తిరుపతి ఆచారి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



వింజమూరు : ప్రచారం చేస్తున్న కాకర్ల సురేష్ మరదలు సురేఖ తదితరులు

మద్యం అమ్మకాల్లో జగన్ రూ.లక్ష కోట్ల దోపిడీ!

- వైసీపీ ట్రబుల్ ఇంజన్ సర్కార్‌ను కూలకొడదాం
- ఆత్మకూరు ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి
- డబుల్ ఇంజన్ సర్కార్‌ని అధికారంలోకి తీసుకొద్దాం



ఆత్మకూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 13: అధికారంలోకి వచ్చిన తరువాత అంచెలంచెలు గా మద్యంను నిషేధిస్తానని మహిళలకు హామీ ఇచ్చిన వైసీపీ అధినేత జగన్ సీఎం అయ్యాక మద్యంలో రూ.లక్ష కోట్ల దోపిడీ చేశారని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన ఆత్మకూరులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం జగన్ జె బ్రాండ్స్‌తో జె గ్యాం గ్‌ను ఏర్పాటు చేసుకుని మద్యంలో సుమారు రూ.లక్ష కోట్లు నేరుగా జగన్ ఇంటికే చేరాయని మండిపడ్డారు. ఆయన స్వంత మనుషులు అనిల్‌రెడ్డి, వాసుదేవరెడ్డిలను మద్యం కార్పొరేషన్ చైర్మన్, ఎండీలుగా ఏర్పాటు చేసుకుని ఈ దోపిడీ చేశారని విమర్శించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న వాసుదేవరెడ్డి మద్యంలో వచ్చే ఆదాయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి పంపిస్తున్న వాసుదేవరెడ్డి ఇక ఏమాత్రం ఆ పదవిలో ఉండేందుకు అర్హత లేదన్నా రు. ఎన్నికల సుమోటో కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని టీడీపీ తరుపున ఎన్నికల సంఘానికి విన్నవిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో 312, 313 జీవోలు తెచ్చి బేవరీస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్యం కొనుగోలు, విక్రయం చేపట్టిందన్నారు. వచ్చే ఆదా యంలో 20ఏళ్ల పాటు బ్యాంకులకు తాకట్టు పెట్టి రుణం తెచ్చిన దుర్మార్గ ప్ర భుత్వమని విమర్శించారు. మద్యం నిషేధమని మాయమాటలు చెప్పి ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కిందని వైసీపీ ప్రభుత్వం అన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి అభ్యర్థినైన ఆత్మకూరు ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. జగన్ ఆధ్వర్యంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ట్రబుల్ ఇంజన్ సర్కార్‌ను కూలదోచి, డబుల్ ఇంజన్ సర్కార్ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూట మి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్

మున్సిపల్ కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి చిన్నపురెడ్డి వైసీపీని వీడి శనివారం ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా నరసాపురం మాజీ సర్పంచ్ ఆలంపాటి రమాదేవి, చిట్టమూరి సుబ్బారెడ్డిలు వీరి వెంట ఉన్నారు. వీరికి ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సర్దార్, తెలుగుదేశం ఆత్మకూరు టౌన్ అధ్యక్షులు చంద్రారెడ్డి, బుజ్జిరెడ్డి ఉన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

మర్రిపాడు: బూదవాడ సర్పంచ్ మంచాల హరిబాబు, ఇర్లపాడు గుర్రం నాగేశ్వరావుతో పాటు మరో 30కుటుంబాలు వైసీపీని వీడి శనివారం పుట్టం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. అనంతరం వారికి ఆనం రామనారాయణ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వలంటీర్ల రాజీనామా ఆమోదం

అంనతసాగరం, ఏప్రిల్ 13: మండలంలో రెండు రోజులుగా 70మంది వలంటీర్లు రాజీనామాలు చేయగా వారి వినతులను ఆమోదం చేసినట్లు శనివారం ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తెలిపారు. ఇందులో ఆమనిచిరివేళ్ల 11, ముస్తాపురం 5, పాతాళపల్లి 9, ఉప్పలపాడు 7, వరికుంటపాడు 5, అనంతసాగరం వన్ 12, అనంతసాగరం టూ 11, బొమ్మవరం 10మంది ఉన్నట్లు స్పష్టం చేశారు.

గ్రామాల్లో వైసీపీ ప్రచారం

ఉదయగిరి రూరల్: గండిపాళెం, వెంగళరావునగర్, గుడినరవ గ్రామాల్లో శనివారం నియోజకవర్గ వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఓబులరెడ్డి, జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మాజీ సొసైటీ అధ్యక్షులు వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

గాంధీజన సంఘంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సంగం: గాంధీ జన సంఘంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ర్యాలీగా ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శనివారం పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్ పోలింగ్, ఓటింగ్ ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారి నెహ్రూ బాబు, మాస్టర్ ట్రైనర్ సమీవుల్లా, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ ఫలితాల్లో యువరాజ్‌కు అత్యధిక మార్కులు

వింజమూరు, ఏప్రిల్ 13: పట్టణంలోని శ్రీవివేకానంద హైస్కూల్ అండ్ కాలేజీ విద్యార్థి ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో యువరాజ్ అనే విద్యార్థి 1000 మార్కులకు 986 మార్కులు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం మద్దూరు గోపాల్‌రెడ్డి తెలిపారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని కృష్ణంపల్లి సెక్షన్ అటవీ శాఖాధికారి షేక్ మునీర్‌బాబు అన్నారు. శనివారం రేంజ్ అధికారి ఉమా మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు వెంగళరావునగర్, తోటలచెరువుపల్లి గ్రామాల్లో ఆయన అగ్నిప్ర మాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులను అటవీ ప్రాంతాల్లో పార వేస్తే వాతావరణ కాలుష్యానికి పెనుముప్పుగా మారుతుందన్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల వృక్ష సంపదతోపాటు వన్యప్రాణులు నశిస్తాయన్నారు. ప్రజలు అవగాహన కలిగి ఉండి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవోలు అప్జల్, కరీముల్లా పాల్గొన్నారు.

శేషవాహనంపై శ్రీరామచంద్రుడు



సంగం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్దిపురం సీతారామస్వామి రెండోరోజు (శుక్రవారం రాత్రి) శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు స్వామిఅమ్మవారిని జలాభిషేకం చేసి ప్రత్యేకంగా అలం కరించి పూజలు చేశారు. గజపూలమాలతో అలంకరించిన శ్రీరాముడు ఉత్సవ విగ్రహాన్ని శేషవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతించి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

అనంతసాగరం, ఏప్రిల్ 13: ఆత్మకూరు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపునకు కృషి చేయాలని, ఈ మారు టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని పార్టీ మండల అధ్యక్షురాలు మునగపాటి సునీత తెలిపారు. శనివారం మండల తెలుగు యువత అధ్యకుడు గూడూరు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జనసేన నాయకులు చిలకలమర్రిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ విజయంకు దోహదపడే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మునగపాటి సుబ్బారాజు జనసేనికులు భరత్, రవి, కృష్ణమూర్తి యాదవ్, శ్రీనివాస్, వేణు, నరసింహారాయల్ పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి



అధికారులతో చర్చిస్తున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13: ఈ నెల 18నుంచి జరుగనున్న నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ, నామినేషన్ల నోడల్ అధికారి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఆర్వో కార్యాల యాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. అలాగే ఆర్వో గది, స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. ఆర్వో కార్యాలయ గేటు నుంచి వంద మీటర్ల వరకే వాహనాలను అనుమతించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన వెంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెహ్రూ బాబు, కలిగిరి సీఐ ఫిరోజ్, ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మా గెలుపునకు సహకరించండి!

- హైదరాబాదులో వలసవాసులతో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న అభ్యర్థులు వేమిరెడ్డి, ఇంటూరి, కాకర్ల

ఉదయగిరి రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం సహకరించాలని నెల్లూరు ఎంపీ ఎన్డీఏ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కోరారు. శనివారం రాత్రి హైదరాబాదులోని మియాపూర్ నరైన్ గార్డెన్స్‌లో ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల నుంచి వలస వెళ్లిన వారితో ఉదయగిరి, కందుకూరు అసెంబ్లీ అభ్యర్థులు కాకర్ల సురేష్, ఇంటూరు నాగేశ్వరరావులతో కలిసి వేమిరెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వలసవాసులంతా గ్రామాలకు వచ్చి తమకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వలసవాసులు తమకు సహకరిస్తే మెట్ట ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి వలసల నివారణకు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును చేసుకోవాలన్నారు. వలసవాసులు మంచి మనసుతో ఆలోచించి తమ గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా అభ్యర్థులను నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

కొండాపురం, ఏప్రిల్13: ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపు కోసం శనివారం హైదరాబాదులో వ్యాపార, ఉద్యోగరీత్యా ఉన్నవారితో మండల టీడీపీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలపరిధిలోని గొట్టిగుండాలపాలెం సర్పంచి కోవి మాల్యాద్రితోపాటు గ్రామానికి చెందిన 100 మంది వైసీపీ కార్యకర్తలతోపాటు పలు పంచాయతీలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కాకర్ల వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

- ఇంటూరికి ఇటుక బట్టీల వ్యాపారుల మద్దతు

వలేటివారిపాలెం : మండలంలోని కూనిపాలెం వలేటివారిపాలెం, రామచంద్రాపురం, పోకూరు, శాఖవరం, కళవళ్ల, తదితర గ్రామాలకు చెందిన వారు హైదరాబాద్‌లో ఉన్న ఇటుకబట్టీల వ్యాపారం చేస్తున్నారు. వీరంతా శనివారం కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీ లో చేరారు. వారికి నాగేశ్వరావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు అవసరం ఎంతో ఉందని తెలిపారు. కావున టీడీపీని గెలిపించాలన్నారు.



వైసీపీ నాయకులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాకర్ల సురేష్



హైదరాబాద్‌లో ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన ఇటుక బట్టీల వ్యాపారులు

వాడవాడలా టీడీపీ నేతల ప్రచారం

ఉలవపాడు, ఏప్రిల్ 13 : స్థానిక కృష్ణానగర్‌లో టీడీపీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. కందుకూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాచగల్లు సుబ్బారావు, మాల్యాద్రి, వెంకట్రావు, జిలానీబాషా, రవి,యలమందమ్మ, సుబ్బరత్తమ్మ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



కావలి 35వ వార్డులో ప్రచారం చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి



ఉలవపాడు : ఇంటింటి ప్రచారంలో టీడీపీ శ్రేణులు

ముస్లింల అభ్యున్నతికి పాటుపడింది టీడీపీయే..

కందుకూరు, ఏప్రిల్ 13: ముస్లింల అభ్యున్నతి కోసం పాటుపడింది టీడీపీయేనని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య తెలిపారు. పట్టణంలోని 18వవార్డు, మోహన్ థియేటర్ వెనుక ప్రాంతాల్లో శనివారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు జయకృష్ణ, ముచ్చు శ్రీనివాసులు, ముచ్చు లక్ష్మీరాజ్యం, షేక్ మున్నా, షేక్ అబ్దుల్ ఫాజిల్, షేక్ బాబు, షేక్ రాహుల్, నాగరాజు సింగ్, సంగా పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమె పట్టణంలోని 17వ వార్డు తూర్పుకమ్మపాలెంలో శనివారం రాత్రి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దివి శ్రీనివాసరావు, ముచ్చు శ్రీనివాసులు, జంపాల శ్రీకాంత్, రావి వెంకటేశ్వర్లు, అమర రామలింగయ్య, బెల్లం వెంకటేశ్వర్లు, దివి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా : కావ్య

కావలి, ఏప్రిల్13: ఒక్క అవకాశం ఇవ్వండి.. కావలిలో అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తానని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని 3,35 వార్డుల్లో శనివారం ఆయన ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. 10 ఏళ్లుగా కావలికి ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలికి ఏమి అభివృద్ధి చేశాడో చెప్పాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు తోట వెంకటేశ్వర్లు, కొమరా రమణయ్య స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు.

మన హక్కులను మనమే కాపాడుకుందాం !

అల్లూరు, ఏప్రిల్ 13 : మన హక్కులను మనమే కాపాడుకుందామని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కరిస్ట్ కావలి నియోజకవర్గ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన మండలంలోని పురిణి గ్రామంలో పర్యటించారు. ఇంటింటా తిరిగి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో కోవూరు బాబు, ముసలి నరేంద్ర, నక్కా గిరి, కప్పల నవీన్‌కుమార్, కిరణ్‌కుమార్ , నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నానికే మద్యం దుకాణాల మూత

లింగసముద్రం, ఏప్రిల్ 13: ఎన్నికల సీజన్ మొదలవడంతో పది రోజుల నుంచి లింగసముద్రం, పెదపవని గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు మధ్యాహ్నం మూడు గంటలకే మూతపడుతున్నాయి. లింగసముద్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణం శనివారం మధ్యాహ్నం 3 గంటలకే మూతపడింది.వాస్తవానికి ఈ దుకాణాలు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేయాలి.కానీ 10 రోజుల నుంచి ఈ దుకాణాల్లో రోజువారీ అమ్మకాల టార్గెట్లు పూర్తి అవుతున్నాయని కారణంతో మూతవేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు. ప్రతి దుకాణంలో రోజూ రూ.2.01 లక్షలకు మద్యం అమ్మాల్సి ఉందని సిబ్బంది తెలిపారు.ఈ మేరకు మద్యం అమ్ముతున్నందున ముందుగానే మూసి వేస్తున్నట్టు వారు చెప్పారు. ఈ షాపులపై పెద్దగా తనిఖీలు లేకపోవడంతో అవకతవకలు జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

కేంద్ర బలగాల కవాతు



కావలి రూరల్ : కావలి మండలం చౌదరిపాలెం, ముసు నూరు గ్రామాల్లో శనివారం రూరల్ సీ ఐ కాటూరి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించా యి. రానున్న ఎన్నిక లను దృష్టిలో పెట్టు కుని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజల కు భరోసా కల్పించేందుకు ఈ కవాతు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 9,42,577

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.9,42,577 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 5,750, కుంకుమార్చన ద్వారా రూ. 22,600, వివాహాల ద్వారా రూ. 7 వేలు, తలనీలాల ద్వారా రూ. 39,275, వాహనపూజల ద్వారా రూ. 2,900, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,96,500, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 8,20, రూముఅద్దెల ద్వారా రూ. 31,960, కవర్లు ద్వారా రూ. 6,900, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,27,065, అన్నదానం ద్వారా రూ. 2,92,807, విరాళాల ద్వారా రూ. 9 వేలు ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

- నృసింహుడి సేవలో మహీధర్‌రెడ్డి

మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు.

బోగోలులో ప్రతాప్‌రెడ్డి ప్రచారం

బిట్రగుంట : బోగోలులో కావలి వైసీపీ అభ్యర్థి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రచారం నిర్వహించారు. వైసీపీ నేతలు వీరరఘు, సుజాత, అనిత, కీర్తనలు తదితరులు ఆయనతో కలిసి బోగోలు, అరుంధతీవాడ,హరిజనవాడల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో దేవరాల సుబ్రహ్మణ్యం, కౌశల్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండాగా ప్రజల ముందుకు..



కావలి పట్టణంలో పర్యటిస్తున్న పసుపులేటి సుగుణమ్మ

కావలిటౌన్, ఏప్రిల్13: అభివృద్ధే ప్రధాన అజెండాగా ప్రజల ముందుకు వెళుతున్నామని స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ పేర్కొన్నారు. శనివారం ఆమె పట్టణంలోనూ, రూరల్ మండల కొత్తసత్రంలోనూ పర్యటించారు. సుధాకర్ విడుదల చేసిన సొంత మేనిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కావలి అభివృద్ధి కోసం అందరూ తమవెంట కలిసి అడుగులు వేయాలన్నారు. పార్టీలకతీతంగా ప్రజలు ముందుకొచ్చి తమతో కలిసి రావడం సంతోషంగా ఉందన్నారు. తాము మాటలు చెప్పే రకం కాదని, అధికారం లేకపోయినా స్వంత నిధులతో అభివృద్ధి చేసి చూపించిన వారమన్నారు.

- పలువురి చేరిక

పట్టణంలోని 33వ వార్డుకు చెందిన జనసేన కార్యకర్తలు సుగుణమ్మ సమక్షంలో పసుపులేటి కండువాలు కప్పుకున్నారు. సుధాకర్‌కు మద్దతు తెలిపిన వారిలో ఆనాల బ్రహ్మయ్య, సరస్వతి, కోటేశ్వరరావు, తోట భాగ్యమ్మ, కరుణ, మునీంద్ర, బూచి మనోహర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ శిక్షణ కేంద్రం పరిశీలన



టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు తదితరులు

కందుకూరు, ఏప్రిల్ 13: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీవోలు, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరు హరినారాయణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతకుముందు జాతీయ రహదారిపై తెట్టు సమీపంలో ఏర్పాటుచేసి ఉన్న ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. తనిఖీలన్నీ సీసీ కెమెరాలో ఉండాలని తెలిపారు. ఆయన వెంట కందుకూరు సబ్ కలెక్టరు జీ విద్యాధరి తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను దెబ్బతీసిన వారిని వదలం

కావలి, ఏప్రిల్ 13 : అంబేడ్కర్ ఆశయాలను దెబ్బతీసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తేలేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి తెలిపారు. ఆర్డీవో కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపి, ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి గ్రామగ్రామాన జగనన్న పాలనలో దళితులకు, గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని తెలియచేస్తామన్నారు. గతంలో అంబేడ్కర్ జయంతికి దళితలకు అనేక పథకాలను అందచేసేవారిని, వైసీపీ అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ జయంతిని పూర్తిగా విస్మరించారన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు జరుగుమల్లి విజయరత్నం,చౌటూరి వెంకటరత్నం,జడ్డా వాసు, ముక్కు మోహన్‌రావు, కనకాల ఏడుకొండలు, తిరుపతి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య మాస్టర్ మృతికి నివాళి

బిట్రగుంట, ఏప్రిల్ 13: బోగోలు మండలం అక్కరాజువారికండ్రికకు చెందిన సుందరయ్య మాస్టారు (90) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా, శనివారం ఆయన పార్థివ దేహాన్ని పలువురు సందర్శించి పలువురు నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో కావలి స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్, ఆయన సోదరుడు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు మాలేపాటి నాగేశ్వరావు, మస్తాన్‌రావు, బీజేపీ నేతలు గుర్రం వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రావు, జైభీం అంబేడ్కర్ వ్యవస్థాపకుడు రవిచంద్ర, ఆంథోనీ ఉన్నారు.

ఎస్పీ పోలీసు స్టేషన్ తనిఖీ

బిట్రగుంట, ఏప్రిల్ 13: బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప పోలీస్‌స్టేషను జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి స్థానిక పరిస్థితుల గురించి కావలి డీఎస్పీ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కావలి రూరల్ సీఐ నాగభూషణం, స్థానిక ఎస్సై బోజ్యా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో...

అల్లూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం రాత్రి జిల్లా ఎస్పీ ఎస్.కె.ఆసీఫ్ హఫీజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐదు నిమిషాలపాటు అల్లూరు పోలీస్ స్టేషన్‌లో తనిఖీ చేశారు. మండలంలోని పోలింగ్ బూత్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ